టాల్‌స్టాయ్

కాకేసస్ ఖైదీ

(రష్యన్ నవల)



అనువాదం : ముక్తవరం పార్థసారథి

భీకర యుద్ధం! తుపాకులు పేలుతున్నాయి.
సైనికులు నేలకొరుగుతున్నారు.
ఇరుపక్షాలదీ ఒకటే లక్ష్యం!
ఎదుటివారిని ఓడించాలి.
తామే విజయభేరి మోగించాలి.
ఓ పక్షంలో వేల సైనికులు! మరో పక్షంలో
కేవలం ఐదుగురు! అయినా తామే
గెలుస్తామన్న నమ్మకం. వారి నాయకుడు
హాజీమురాద్! అదే వారి ధైర్యం.
అనుచరుల తుపాకులు గురితప్పినా
నాయకుడు గురితప్పకుండా ప్రత్యర్థి
సైనికుల మీద బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నాడు.
ఇంతలో ఓ బుల్లెట్ అతని శరీరంలోకి
దూసుకుపోయింది.
ఆ తర్వాత ఏం జరిగింది?
అసలు హాజీమురాద్ ఎవరు?
ఇంతకూ ఆ యుద్ధంలో అతను గెలుస్తాడా?
ఆద్యంతం ఉత్కంఠగా చదివించే టాల్‌స్టాయ్
చివరి నవల **హాజీ మురాద్** కు
ముక్తవరం పార్థసారథి తెలుగు అనువాదం
చతుర జూన్ కానుక!



ప్రపంచ సాహిత్యంలో అత్యుత్తమ రచయిత టాల్‌స్టాయ్ *(1828-1910)* అన్నారు పండితులు. ఆయన 'యుద్ధము -శాంతి', 'అన్నా కరేనినా' చదవని నవలా ప్రియులుండరు.

లియో టాల్‌స్టాయ్ ముత్తాతను రష్యన్ చక్రవర్తి పీటర్, ది గ్రేట్ 'కౌంట్' బిరుదుతో సత్కరించాడు. అలా జార్ చక్రవర్తుల దర్బారుతో టాల్‌స్టాయ్ వంశీకులకు సన్నిహిత సంబంధాలేర్పడ్డాయి. ఆనాటి భూస్వాములందర్లాగే టాల్‌స్టాయ్ కూడా యవ్వనంలో పలు దుర్వ్యసనాలకు అలవాటు పడ్డాడు. తాగుడు, జూదం, స్త్రీలోలత అతడి బలహీనతలు.

యూనివర్సిటీ చదువు ముగించిన టాల్‌స్టాయ్ కొన్నాళ్ళు సైన్యంలో పనిచేశాడు. అప్పుడే కాకసస్ ప్రాంతంలో అతడు తొలిసారిగా హాజీ మురాద్ గురించి విన్నాడు. తన రచనా జీవితం ఇంచుమించు ముగిసిన చివరిదశలో *1896*లో 'హాజీ మురాద్' ప్రారంభించి *1904*లో ముగించాడు. ఇదే అతడి చివరి నవలిక. *1912*లో రచయిత మరణానంతరం కొంతభాగం, *1917*లో పూర్తిపాఠం అచ్చయింది.

హాజీమురాద్ గురించి...

రష్యన్ సామ్రాజ్యంలో అంతర్భాగం చెచెన్యా. అత్యధిక ముస్లిం జనాభా కలిగిన ఈ ప్రాంతం రష్యా నుండి విడివడి స్వతంత్ర దేశంగా ప్రకటించుకోవటానికి సుదీర్ఘ పోరాటం చేస్తున్నది. కథాకాలం నాటికి యిక్కడి వేర్పాటు వాద నాయకుడు షామిల్ మీద పగ సాధించడానికి, ఒకప్పుడు అతడికి కుడి భుజంగా వున్న హాజీ మురాద్ అయిష్టంగానే రష్యన్‌ల సహాయం అర్థిస్తాడు.

హాజీ మురాద్ చెచెన్యాలోని అవర్ తెగకు చెందిన తిరుగుబాటు నాయకుడు. టర్కిష్‌లో ఇతణ్ణి హాకి ముతాత్‌గా పిలుస్తారు. రష్యన్‌లో ఖాజీ మురాద్ అంటారు. హాజీ మురాద్ (1790-1852); షామిల్ (1834-1859); ప్రిన్స్ వొరొంట్సోవ్ (1782-1856), జార్ నికొలస్ (1796-1855) అందరూ పందొమ్మిదో శతాబ్ది రష్యా చరిత్రలో ముఖ్య భూమిక పోషించినవాళ్లే.

పాఠకుల సౌలభ్యం కోసం ఈ నవలలోని కొన్ని ముఖ్య పాత్రల గురించిన వివరణ:

ఎల్డార్ : హాజీ మురాద్ సహాయకులలో ఒకడు.

సాడో : హాజీ మురాద్‌కు ఆశ్రయమిచ్చిన గ్రామస్తుడు.

ప్రిన్స్ వొరొంట్సోవ్ : రష్యన్ సైనిక అధికారి.

మైఖేల్ సెమెనోవిచ్ వొరొంట్సోవ్: ప్రిన్స్ వొరొంట్సోవ్ తండ్రి, జార్ కొలువులో వున్న వైస్‌రాయ్.

లారిస్ మెలికోవ్ : వైస్‌రాయ్ వద్ద ఒక వుద్యోగి.

మురిద్ : సూఫిజంను పోలిన ఒక మతశాఖ మురిదిజం. దీని అనుయాయులే మురిద్‌లు.

త్వరగా ఇంటికి చేరుకోవాలి. పొలాల పక్కగా నడుస్తున్నాను. నడివేసవి. 'రై' ధాన్యం కోతలకు సిద్ధంగా ఉంది. ఎటుచూసినా రంగురంగుల పూలతో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా ఉంది. ఎరుపు, తెలుపు, గులాబీరంగు పూలనుండి లవంగ వాసన మత్తుగా వ్యాపిస్తోంది. ఎన్నిరకాల మొక్కలో? దేనికదే ప్రత్యేకం. ఉదయం విచ్చుకున్న పూలు ఎంత అందమైనవైనా, ఎంత సుగంధ భరితమైనవైనా సాయంత్రమయ్యేసరికి వాడిపోతాయి. ఒక పూలకొమ్మ విరిచి, చేతబట్టుకుని హడావిడిగా ముందుకు కదులుతుంటే పక్కన గోతిలో, ఒక ముళ్లకంపలో పూసిన ఎర్రటి పువ్వొకటి కన్పించింది. దాన్ని మా ప్రాంతంలో 'టార్టార్' అంటాం. ఆ ముళ్లు మహా ప్రమాదకరం. నేల దున్నుతున్నప్పుడు, ఈ మొక్కలు కనిపిస్తే, వాటిని జాగ్రత్తగా పెరికి దూరంగా పారేస్తాం. గోతిలోకి దిగి, ఆ పువ్వుమీద మత్తుగా వాలిన తుమ్మెదను పారదోలి, చేయి ముందుకు చాపాను. కాని అన్ని ముళ్ల మధ్యన ఒక్కపువ్వు! చేతికి జేబురుమాలు చుట్టుకున్నాను. చుట్టూవున్న ఆకులు, కొమ్మలు ఒక్కొక్కటే తొలగిస్తూ అయిదు నిమిషాలు శ్రమించాను. ఎట్టకేలకు పువ్వయితే దొరికించుకున్నాను గాని అదంత తాజాగానూ, అందంగానూ కనిపించలేదు.

నా వద్దవున్న సుకుమారమైన పువ్వులతో పోల్చితే అది చాలా మొరటుగా వుంది. తిరిగి గోతిలోకి విసిరేశాను. బాధ కలిగింది. మొక్కమీద అందంగా కనిపించిందే? అనవసరంగా ఒక జీవితం నాశనం చేశాను.

కాని ఆ ముళ్లకంపది ఎంత మొండిబతుకు! ఆత్మరక్షణ కోసం ఎంతగా పోరాడుతుంది! చివరి క్షణంలో కూడా తనమీద దాడి చేసిన వాడికి ఏదో ఒక గాయం చేయకుండా ఓటమినంగీకరించదు గదా! తాజాగా దున్నిన పొలంలో వడివడిగా నడిచాను. నల్లటి నేలలో దుమ్ము లేచింది. చాలా విశాలమైన పొలం అది. కనుచూపు మేర గీతల్లా పొడుగాటి నాగేటిచాళ్లు. మనిషి విత్తుతాడు, మొక్కల్ని పెంచుతాడు. తిరిగి వాటిని నాశనం చేస్తాడు. తనకోసం ఎన్ని లక్షల కోట్ల మొక్కల్ని, వృక్ష సంతతిని నిర్దాక్షిణ్యంగా నాశనం చేస్తాడు. దూరంగా ఒక దిబ్బ మీద మరో ముళ్లకంప కనిపించింది. అదే టార్టార్. అవును ఎంత దున్నినా, ఎంత కలుపు తీసినా కొన్నిమొక్కలు మనిషిని ధిక్కరించి మరీ పెరుగుతాయి. అలాంటిదే టార్టార్. ఈ మొక్కకు మూడు కొమ్మలున్నాయి. ఒకటి విరిగి, తెగిన చేతిలా వెళ్లాడుతోంది. మిగతా రెండు కొమ్మలకూ పూలున్నాయి. వాడిపోయి, మట్టికొట్టుకుపోయిన ఎర్రటిపూలు. బండి చక్రం కింద నలిగిపోయిన మొక్క కాబోలు.. తిరిగి నిటారుగా నిలబడటానికి ప్రయత్నిస్తున్నది. నుజ్జు నుజ్జయిన శరీరంలోని పేగులు బయటికి వచ్చినట్టుగా వేళ్ళాడుతున్న పువ్వు, కన్ను ఎవరో పీకేసినట్టుగా వున్నది. అయినా ఓటమినంగీకరించక, ధైర్యంగా నిలబడిన వీరుడిలా ఉందది! తనవాళ్లందరూ నేలకూలారు. కాని తను మాత్రం తల వంచదు.

'జీవశక్తి' అంటే అదేనని అనుకున్నాను. లోకాన్ని జయించాడు మనిషి. వృక్షజాతిని నాశనం చేశాడు. కాని ఒక్కమొక్క అతడి కెదురు తిరిగింది. కొన్నేళ్ల క్రితం కాకసస్‌లో జరిగిన ఒక కథ గుర్తుకొచ్చింది. కొంత నేను స్వయంగా చూశాను. కొంత ప్రత్యక్ష సాక్షులనుండి విన్నాను. మిగతాది నా వూహ.

1851 చివరలో...

నవంబర్ నెల. శీతాకాలం ప్రవేశిం

చింది. రష్యా పొలిమేర నుండి సుమారు పదిహేను మైళ్ల దూరంలో వున్న చెచెన్ గ్రామం మక్మెట్‌లోకి ప్రవేశించాడు హాజీ మురాద్. కాలుతున్న పిడకల వాసన ఘాటుగా వ్యాపించింది. మసీదులో ప్రార్థనల కోసం అందర్నీ పిలిచాడు ముయెజ్జిన్. స్వచ్ఛమైన కొండగాలితో కలిసింది పిడకల వాసన. ఇళ్లముందు పశువులు, గొర్రెలు అరుస్తున్నాయి.

తేనెతుట్టెలోని చిన్నచిన్న గూళ్లలా వరుసగా కట్టుకున్న ఇండ్లవి. బొంగురు గొంతు కలతో పరుషంగా ఏదో మాట్లాడుతున్నారు పురుషులు. స్త్రీల, పిల్లల స్వరాలు కింద ప్రవహిస్తున్న సెలయేటి రొదతో కలసిపోయాయి.

సాహసాలకు పేరుమోసిన చెచెన్యా టార్టార్ నాయకుడు షామిల్‌కు కుడిభుజం హాజీ మురాద్. అనుచరగణం లేకుండా, ఇతర అధికార లాంఛనాలు లేకుండా ఎక్కడికీ కదలడు. కానీ ఈ రోజు ముసుగు వేసుకుని, తుపాకీ లోపల దాచుకుని కేవలం ఒకే ఒక్క సేవకునితో, కాందిశీకునిలా, ఎవరికంటా బడకుండా పలు జాగ్రత్తలు తీసుకుని ఇక్కడికి చేరుకున్నాడు.

అశ్వారూఢుడై ఊళ్లోకి ప్రవేశించిన తర్వాత, పక్క సందులోకి తిరిగి కొండను తొలచినట్టుగా వున్న ఒక ఇంటి దగ్గర ఆగి, పరిశీలనగా అటూ ఇటూ చూశాడు హాజీ మురాద్. చుట్టుపక్కల ఎవరూ కనిపించలేదుగాని, ఆ ఇంటిపైన, గొర్రెచర్మం కప్పుకున్న ఓ వ్యక్తి పడుకున్నాడు. తన కొరడా కర్రతో అతణ్ణి తట్టి, "సలాం ఆలేకుం" అంటూ ముఖానికి కట్టుకున్న గుడ్డ తొలగించాడు హాజీమురాద్.

"ఆలేకుం సలాం". వృద్ధుడు అతణ్ణి గుర్తుపట్టాడు. లేచి, గొర్రె చర్మం కోటులోకి చేతులు దోపి, కర్ర చెప్పులు తొడుక్కుని, నిచ్చెన దిగుతూ బోసిగా నవ్వాడు. ఆ తర్వాత మర్యాదకోసం గుర్రపు కళ్లెం పట్టుకుని మురాద్ దిగటానికి సాయం చెయ్యబోయాడుగాని, అప్పటికే కిందికి గెంతిన అనుచరుడు, తన నాయకుడికి చేయి అందించాడు.

అప్పుడే తలుపు ఓరగా తీసుకుని వచ్చిన పదిహేనేళ్ల కుర్రాడొకడు ఆశ్చర్యంగా ఆగంతకులవైపు తేరిపార చూశాడు.

"మసీదుకు వెళ్లి మీ నాన్నను త్వరగా రమ్మను" అంటూ కుర్రాడికి పురమాయించి తలుపు బార్లా తెరిచాడు వృద్ధుడు.

పసుపుపచ్చ శాలువా, ఎర్రటి కమీజ్, నీలం రంగు పైజామాలో వున్న మధ్య వయస్కురాలు గోడకు దిండ్లు పెట్టి, వచ్చి కూర్చొమ్మని లోపలికి ఆహ్వానించింది. ఆ తర్వాత వంగి అభివాదం చేస్తూ "మీ రాక మాకు శుభం చేకూర్చుగాక!" అంటూ లోపలికెళ్లింది.

"మీ సంతానమంతా చిరంజీవులవుదురుగాక" అంటూ హాజీ మురాద్ ముసుగు పూర్తిగా తొలగించి తన రైఫిల్, ఖడ్గం, యింటి యజమాని ఆయుధాల పక్కనే గోడకున్న మేకుకు తగిలించి, నడుముకున్న పిస్తోలును సరి చేసుకుని, కింద కూర్చున్నాడు. వృద్ధుడు కూడా పక్కనే కూలబడి, చేతులు పైకెత్తి ప్రార్థించాడు. హాజీ మురాద్ అతణ్ణి అనుసరించాడు.

తరువాత యిద్దరూ అరచేతులు మొహానికి రుద్దుకున్నారు. గడ్డాలు దువ్వుకున్నారు.

"ఏమైనా విశేషాలున్నాయా? " అని అడిగాడు హాజీ మురాద్.

"నేను తేనెతుట్టెల వద్దవుంటాను. ఈ రోజే నా కొడుకును చూద్దామని వచ్చాను. ఏమైనా వార్తలుంటే వాడికి తెలుస్తాయి" అన్నాడు వృద్ధుడు.

అతడు చెప్పదలచుకోవటంలేదని గ్రహించిన హాజీ మురాద్ మరేమీ అడగలేదు.

"మంచి వార్తలేమీ లేవు. కుందేళ్లు డేగలను పారదోలటమెలాగా అని చర్చించుకుంటున్నాయి. డేగలేమో ఒక్కొక్క కుందేలునీ చీల్చుకుని తింటున్నాయి. మొన్నటికి మొన్న రష్యన్ పూరకుక్కలు మిచిట్ గ్రామంలో గడ్డివాములు తగలబెట్టారు. పురుగులుపడి చస్తారు దుర్మార్గులు" అంటూ చెప్పుకుపోయాడు వృద్ధుడు బాధగా, కోపంగా.

హాజీమురాద్ అనుచరుడు గదిలోకి ప్రవేశించి, తన నాయకుడిలాగే బురఖా తొలగించి, రైఫిల్, ఖడ్గం గోడకు వేలాడ దీసి, చురకత్తి, పిస్తోలు మాత్రం ఒంటి మీదుంచుకున్నాడు.

"అతడెవరు? " అనడిగాడు వృద్ధుడు.

"నా మనిషి. పేరు ఎల్దార్" అన్నాడు హాజీ మురాద్.

వృద్ధుడు సైగ చెయ్యటంతో, తన నాయకుడి పక్కనే బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు ఆగంతకుడు. గతవారమే తమ వీర యువకులు ఇద్దరు రష్యన్లను పట్టుకుని అందులో ఒకణ్ణి సంహరించారనీ, మరొకణ్ణి షామిల్‌కు అప్పగించారనీ చెప్పాడు వృద్ధుడు.

ఇంటి వెలుపలి శబ్దాలను జాగ్రత్తగా ఆలకించాడు హాజీ మురాద్. తలుపు కిర్రుమంది. ఇంటి యజమాని సాడో ప్రవేశించాడు. అతడికి సుమారు నలభై ఏళ్లుంటాయి. చిన్నగడ్డం, పొడుగాటి ముక్కు, నల్లటి కళ్లు. అతడి వెనకే అతడి కొడుకు కూడా లోపలికొచ్చాడు. కింద కూర్చుని చేతులు పైకెత్తి దేవుణ్ని ప్రార్థించి, మొహం తుడుచుకున్నాడు సాడో. ఆ తర్వాత అసలు విషయం నెమ్మదిగా చెప్పాడు. "సజీవంగానైనా, సంహరించి అయినా సరే, హాజీ మురాద్‌ను పట్టుకెళ్మాలని షామిల్ నుండి ఆదేశం వచ్చింది. ఇక్కడి ప్రజలెవరికీ, షామిల్‌కు ఎదురు నిలిచే ధైర్యం లేదు. అందువల్ల మన జాగ్రత్తలో మనం వుండటం మంచిది. ఇంట్లో వున్నంతవరకూ తనకు ఎటువంటి ఆపదా రాదు. కాని బయటకు వెళ్లినప్పుడు ఎవరు రక్షిస్తారు? "

"సరే మనం రష్యన్లకో సందేశం పంపిద్దాం. నా అనుచరుడు అది తీసికెడతాడు. కాని అతడికి దారి చూపేవాడొకరు కావాలి" అన్నాడు హాజీ మురాద్.

"భాయి బాటాను వెంట పంపిస్తాను. వెళ్లి బాటాను పిలుచుకురా" అంటూ కొడుకువైపు చూశాడు సాడో.

లేడిలా ఒక్క గెంతులో అదృశ్యమయ్యాడు కుర్రాడు.

మరో పది నిమిషాల తర్వాత పొట్టిగా, సన్నగా వున్న ఒక చెచెన్ యువకుడితో తిరిగి వచ్చాడు.

అతడికి అభివాదం చేసి "నా అనుచరుణ్ణి రష్యన్ల వద్దకు తీసుకెళ్లగలవా? " అని ప్రశ్నించాడు హాజీ మురాద్.

"తప్పకుండా. అందరూ వాగ్దానాలు చేస్తారుగాని పని చెయ్యరు. నేను చెప్పింది చేస్తా" అన్నాడు బాటా.

"నీ బహుమానం మూడు" అంటూ వేళ్లు చూపించాడు హాజీ మురాద్.

ఆ సంజ్ఞ బాటాకు అర్థమైంది. డబ్బు కోసం కాదు, హాజీ మురాద్‌కు సహాయం

చెయ్యగలగటమే తనకు గొప్ప గౌరవం. ఈ పర్వత ప్రాంతంలో హాజీమురాద్ గురించి తెలియనిదెవ్వరికి! అతను రష్యన్ పందుల్ని ఎలా చంపాడో కథలుగా చెప్పుకుంటారు.

"సంతోషం. తాడు పొడుగుండాలి. కాని అవసరానికి మించి మాట్లాడకూడదు" అన్నాడు హాజీమురాద్.

"ఇక నోరు మెదపను" అన్నాడు బాటా.

"కొండమీద ఆర్గున్ నది మలుపు తిరుగుతుంది చూడు. అక్కడ అడవిలో రెండు పెద్దబండలున్నాయి."

"తెలుసు"

"అక్కడ నలుగురు అశ్వికులు నాకోసం నిరీక్షిస్తున్నారు"

"సరే"

"ఖాన్ మహోమా కావాలని అడుగు. ఏం చెయ్యాలో చెబుతాడు. అతణ్ణి నువ్వు రష్యన్ కమాండర్ ప్రిన్స్ వొరొంట్సోవ్ వద్దకు తీసికెళ్లాలి"

"అలాగే"

"మళ్లీ తిరిగి తీసుకురావాలి"

"తప్పకుండా"

"అతణ్ణి తీసుకుని నువ్వు అడవికి తిరిగిరా. నేనక్కడ నీకోసం చూస్తుంటాను"

గుండెమీద చేయి పెట్టుకుని, తలవంచి నిష్క్రమించాడు బాటా.

సాడోవైపు తిరిగి "మరో మనిషిని చెఖి పంపించాలి" అంటూ కోటు జేబులో వున్న బుల్లెట్లు తీయబోయి, యిద్దరు స్త్రీలు ప్రవేశించటంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు హాజీమురాద్.

ఆ వచ్చినవాళ్లలో ఒకావిడ సాడో భార్య. దిండ్లు అమర్చిందావిడే. మరొకరు చిన్న పిల్ల. ఎర్రటి పైజామా, ఆకుపచ్చ చొక్కా.

మెడలో వెండి నాణాల గొలుసు వేసుకుని, తలవంచుకుని నడిచింది.

ఒక చిన్న గుండ్రటి బల్లమీద టీ, వెన్న పూసిన రొట్టె, జున్ను, తేనె తీసుకుని వచ్చింది సాడో భార్య. చేతులు కడుక్కోవటానికి నీళ్లు, తువ్వాలు తెచ్చింది చిన్నపిల్ల.

స్త్రీలు గదిలో ఉన్నంతసేపూ నిశ్శబ్దంగా ఉండిపోయాడు హాజీమురాద్.

ఆ తర్వాత బుల్లెట్ ఒకటి తీసి అందులోంచి చుట్టగా చుట్టిన కాగితం బైటికి లాగి "ఇది నా కొడుక్కు చేర్చాలి" అన్నాడు.

"సమాధానం మళ్లీ నీకు చేరడమెలా? " అని అడిగాడు సాడో.

"నువ్వే స్వయంగా నాకు చేరవెయ్యాలి"

"అలాగే" అంటూ కాగితాన్ని తిరిగి కాట్రిడ్జ్‌లో దోపాడు సాడో.

ఆ తర్వాత అతిథులిద్దరూ చేతులు కడుక్కొని భోజనం చేశారు. వాళ్లు వచ్చినందుకు పలుమార్లు కృతజ్ఞతలు వ్యక్తం చేశాడు సాడో.

క్రితంరోజు భోజనం చెయ్యకపోయినప్పటికీ కొద్దిగా రొట్టె, జున్ను మాత్రమే తిన్నాడు హాజీమురాద్. ఆ తర్వాత మరో చిన్న రొట్టెముక్క మీద కాసింత తేనె రాసుకున్నాడు.

"మా తేనె స్వచ్ఛమైంది. ఈ సంవత్సరం దిగుబడి బాగా వచ్చింది" అన్నాడు వృద్ధుడు గర్వంగా.

"ఆతిథ్యానికి ధన్యవాదాలు" అన్నాడు హాజీమురాద్.

ఎల్డార్‌కు బల్లమీద వున్నదంతా తినెయ్యాలనే వుంది గాని మొహమాటం అడ్డొచ్చింది.

ఇటువంటి అతిథిని ఇంటికి రానిచ్చినందుకు తన ప్రాణం ప్రమాదంలో పడిందని సాడోకు తెలుసు. షామిల్‌ను ఎదిరించి పోరాడినందుకుగాను చెచెన్యా పౌరులందరూ హాజీమురాద్‌ను బహిష్కరించాలని బహిరంగ ప్రకటన చేశారు. ఈ ఆదేశం పాటించనివాళ్లు మరణదండనకు పాత్రులవుతారని హెచ్చరించారు.

వుతారు.

ఇరుగుపొరుగు ఎవరైనా హాజీమురాద్ తమ ఇంటికి వచ్చిన విషయం పసిగట్ట వచ్చు అతణ్ణి తమకు అప్పగించమని పట్టు పట్టవచ్చు కాని సాడోకు భయం వెయ్యలేదు సరికదా, కాస్త గర్వంగా కూడా వుంది. ప్రాణం పోయినాసరే అతిథిని రక్షించటం తన బాధ్యత.

"ఇంట్లో వున్నంతవరకూ నీకే భయమూ లేదు" అన్నాడు సాడో మరోసారి.

కృతజ్ఞతగా తలాడించాడు హాజీమురాద్.

చలిమంట వెలిగించి స్త్రీలు నిద్రిస్తున్న గదిలోకి వెళ్లాడు సాడో.

ఈ అతిథులతో, తమ ప్రాణాలకు ముప్పు వస్తుందేమోనని మాట్లాడుకుంటున్నారు వాళ్లు.

★ ★ ★

హాజీమురాద్ వుంటున్న వూరినుండి సుమారు పదిమైళ్ల దూరంలో వోడ్పిజెన్స్కయ వద్ద వున్న దుర్గం గేట్లు తెరుచుకుని ముగ్గురు సైనికులు, ఒక ఆఫీసర్ షెగిరిన్స్ వైపు నడిచారు. దారి నిర్మానుష్యంగా వుంది. అంతలో ఒక పొద వెనక అడుగుల సవ్వడి వినిపించింది. ఊపిరి బిగపట్టి విన్నారు. ఎండిన ఆకులమీద నడుస్తున్న బలమైన పాదాలు, చీకటిలో ఏమీ కనిపించలేదుగాని చెచెన్ గొంతులు వినిపించాయి. సైనికులకు ఎదురుగా నడిచి వచ్చాయి రెండు ఆకారాలు. ఒకటి పొడుగ్గా, ఒకటి పొట్టిగా వుంది.

"ఎవరు? " అంటూ అరిచాడొక సైనికుడు.

"నేను ఒక చెచెన్ను" అన్నాడు పొట్టి వాడు. అతడు బాటా.

"ఎక్కడికి? "

"ప్రిన్స్ కోసం. మా దగ్గర ఆయుధాలు లేవు. ఇతడికి నేను గైడ్ను"

"ప్రిన్స్ వొరొంట్సోవ్ కోసం" అన్నాడు పొడుగువాడు.

"సర్లే. మేం తీసుకెళ్తాం" అన్నాడొక సైనికుడు.

చలి పెరిగింది.

రెండు గంటల తర్వాత ఎల్డార్, బాటాలను తీసుకెళ్లిన సైనికులు తిరిగి వచ్చారు.

"క్షేమంగా చేరారా? " అంటూ అడిగాడు వాళ్లకోసం నిరీక్షిస్తున్న ఆఫీసర్.

"కల్నల్ ఇంట్లో ఇంకా ఎవరూ నిద్రపోలేదు. వీళ్లను ఆయనకే అప్పగించాం"

సైనికుల బారక్స్ చీకటిగా వున్నాయి గాని ప్రిన్స్ ఇంట్లో మాత్రం ఇంకా లైట్లు వెలుగుతున్నాయి. ప్రిన్స్ సైమన్ మిఖైలోవిచ్ వొరొంట్సోవ్(ఈయన కురిన్ రెజిమెంట్కు కమాండర్)తోపాటు ఆయన భార్య పీటర్స్బర్గ్ అందాలభామ మార్యా వాసిలెవ్నా కూడా వుంటుందక్కడ. బారక్స్లోనైనా సరే అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతారు వాళ్లు. కాని ఎంతో కష్టపడిపోతున్నామనుకుంటారు.

ఈ అర్ధరాత్రి అతిథులతో పేకాటలో మునిగున్నారు వాళ్లు. కార్డ్ టేబుల్ మీద నాలుగు కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. విశాలమైన డ్రాయింగ్ రూంలో తివాచీ పరచి వున్నది. కిటికీలకు తెరలున్నాయి. వొరొంట్సోవ్ది పొడుగాటి మొహం. కోటు మీద మెడల్స్ మెరుస్తున్నాయి. పేకాటలో అతడి పార్ట్నర్ ఒక యూనివర్సిటీ విద్యార్థి. ప్రిన్సెస్ వొరొంట్సోవ్కు మొదటి భర్తతో పుట్టిన పిల్లాడికి ఇతడు ట్యూషన్ చెబుతాడు. మరో ఇద్దరు ఆఫీసర్లది మరో టీం.

ఆట ఆసక్తికరంగా సాగుతోంది.

అంతలో ప్రిన్స్ సేవకుడు ప్రవేశించి, ఒక ఆఫీసర్ అతనితో మాట్లాడటానికి వచ్చాడని చెప్పాడు.

"ఎక్స్క్యూజ్మీ జెంటిల్మెన్, ప్రిన్సెస్

మార్యా నా బదులు ఆడుతుంది" అంటూ లేచాడు ప్రిన్స్.

"మీకు అభ్యంతరం లేదుగా? " అంటూ ముద్దుగా అడిగింది ప్రిన్సెస్ మార్యా.

ఆ అదృష్టాన్ని ఎవరు వదులుకుంటారు? ఆమె అందానికి ముగ్ధులుకాని వాళ్లెవరూ వుండరు.

"రండి, రండి" అంటూ ఆహ్వానించారు. పేకముక్కలు పంచుతుంటే ప్రత్యర్థి చేతులు కంపించాయి.

ప్రిన్స్ తిరిగి వచ్చేసరికి ఒక ఆట ముగిసింది.

"ఎందుకొచ్చారు వాళ్లు? " అని అడిగింది ప్రిన్సెస్ మార్యా.

"ఒక ఆఫీసర్, మరొకతను వచ్చారు"

"ఎవరు? ఎందుకు? "

"చెప్పకూడదు. రహస్యం" అన్నాడు ప్రిన్స్.

"అలాగా, చూద్దాం" అంది ప్రిన్సెస్.

"మీ కంపెనీకి రేపు అడవిలో డ్యూటీ వుందా? " అని అక్కడ కూర్చున్న ఒక ఆఫీసర్ను అడిగాడు ప్రిన్స్.

"అవును, ఎందుకు? "

"రేపు కలుద్దాం" అంటూ చిరునవ్వు నవ్వాడు ప్రిన్స్.

"తప్పకుండా" ప్రిన్స్ వుద్దేశం అర్థం కాకపోయినా నవ్వాడు ఆఫీసర్. అతిథులందరూ వెళ్లిపోయిన తర్వాత మంచం మీద పడుకొన్న భర్తతో "వచ్చిందెవరు? హాజీ మురాద్ కదా? " అని అడిగింది. కొన్నాళ్లుగా ఇద్దరి మధ్యా రాయబారాలు కొనసాగుతున్నాయని విన్నది.

ఆమె వూహించింది పూర్తిగా అబద్ధం కాదు గాని, వచ్చింది హాజీమురాద్ కాదని, అతని అనుచరుడు మాత్రమే అని చెప్పాడు ప్రిన్స్. మరుసటి రోజు ఒక రహస్య ప్రదేశంలో హాజీమురాద్ తనను కలుసుకోబోతున్నాడు. ఈ వార్త తెలిసి తన తండ్రి తప్పక సంతోషిస్తాడు. రెండు దాటింది. నిద్రముంచుకొచ్చింది.

★ ★ ★

తనను బంధించి తెమ్మని షామిల్ పంపించిన ముష్కరుల నుండి తప్పించుకుని, మూడు రాత్రులు నిద్రాహారాలు లేకుండా ప్రయాణించి సాడో యింట్లో నడుం వాల్చగానే క్షణంలో గాఢనిద్రలోకి జారుకున్నాడు హాజీమురాద్. దుస్తులు, తలకు చుట్టుకున్న గుడ్డ కూడా విప్పలేదు.

అతడికి కొంచెం దూరంలో వెల్లకిలా పడుకున్నాడు ఎల్డార్. బుల్లెట్లు దాచిన సంచీ చొక్కాజేబులో ఎత్తుగా కనిపిస్తున్నది. ఊపిరి తీసుకున్నప్పుడల్లా పైపెదవి కదులుతూ, చిన్న పిల్లాడిలా కనిపిస్తున్నాడు. తన నాయకుడిలాగే అతడు కూడా బెల్టుకు చురకత్తి, పిస్తోలు పెట్టుకునే నిదురించాడు. చలిమంట వేడి తగ్గింది. గదిలో దీపం మసక మసకగా వెలుగుతోంది.

అర్ధరాత్రి దాటింది. నెమ్మదిగా తలుపు తెరుచుకుంది. ఆ చిన్న శబ్దానికే దిగ్గున లేచి కూర్చుని, పిస్తోలు వద్దకు చేయి పోనిచ్చాడు హాజీమురాద్. పిల్లిలా అడుగులు వేస్తూ లోపలికి వచ్చాడు సాడో.

"ఏమైంది? " అనడిగాడు హాజీమురాద్. నిద్రాభంగమైనట్టుగా కాక, యుద్ధానికి

సన్నద్ధమైన వీరుడిలా వున్నాడతడు.

"నువ్వు వచ్చినప్పుడు ఇంటి డాబామీద నిల్చున్న ఓ స్త్రీ చూసి తన భర్తకీ విషయం చెప్పింది. ఇప్పుడు వూరంతా తెలిసింది. మసీదులో సమావేశమైన గ్రామ పెద్దలు నిన్ను అదుపులోకి తీసుకోవాలని తీర్మానించారట. పక్కింటివాళ్లు, ఇప్పుడే నా భార్యకీ విషయం చెప్పారు" అన్నాడు సాడో.

"బయల్దేరతాను" అన్నాడు హాజీము రాద్.

"గుర్రాల మీద జీనులు వేసి సిద్ధం చేశాను" అన్నాడు సాడో

గుసగుసగా 'ఎల్డార్' అంటూ నిదురిస్తున్న తన అనుచరుడిని తట్టి లేపాడు హాజీమురాద్.

నాయకుడి స్వరం వినిపించటంతో వెంటనే కళ్లు తెరిచాడు ఎల్డార్.

ఆయుధాలు, బురఖా ధరించి ఇద్దరూ గడపదాటారు. గుర్రాలు సిద్ధంగా వున్నాయి. గట్టి నేలమీద వాటి గిట్టల చప్పుడుకు ఎవరో కిటికీలోంచి తొంగి చూశారు. మరో వ్యక్తి కర్ర చెప్పులతో మసీదు వైపు పరిగెత్తాడు. చంద్రుడు లేడు. కాని నక్షత్రాల వెలుగు చీకటిని కొంత తగ్గించింది. ఇళ్ళకప్పులూ, మసీదు మినారులూ కనిపిస్తున్నాయి. అల్లంత దూరాన మసీదులో అనేక మంది వ్యక్తుల గొంతులు వినిపించాయి.

ఒక్క గెంతుతో అనాయాసంగా గుర్రం ఎక్కి కళ్లెం పట్టుకున్నాడు హాజీమురాద్.

"అల్లా నీకు మేలు చేస్తాడు" అంటూ తన ఆతిథేయికి అభివాదం చేసి, కొరడా సైగలతో ముందుక్కదిలాడు. ఎల్డార్ అతణ్ణనుసరించాడు. వాళ్ల వెంట కొంత దూరం పరిగెత్తి, ఆ అశ్వాలు అదృశ్యం కాగానే వెనుదిరిగాడు సాడో.

"ఆగు, కదలొద్దు" అంటూ అరిచిందొక స్వరం. మరింత మంది హాజీమురాద్ దారికి అడ్డంగా నిలిచారు.

హాజీమురాద్ ఆగకుండా, పిస్తోలు చేత పట్టుకొని ఎల్డార్‌తో సహా వాళ్లమధ్య నుండి దూసుకుపోయాడు. గ్రామస్తులు తుపాకులు కాల్చారు గాని, అశ్వికులకు బుల్లెట్లు తగలలేదు. మరో మూడు వందల గజాలు ముందుకెళ్లి, రొప్పుతున్న గుర్రానికి విశ్రాంతినిచ్చాడు హాజీమురాద్.

ముందర వంపులో కాలవ వడివడిగా ప్రవహిస్తోంది. వెనక, వూళ్లో కాకులు కావు కావుమంటున్నాయి. గుర్రాలు పరిగెత్తుకుని వస్తున్న శబ్దం వినిపించింది. జనం చాలామందే వుండి వుంటారు. అరుపులు కూడా వినిపిస్తున్నాయి. హాజీమురాద్ తన గుర్రాన్ని పరిగెత్తించాడు. కాని త్వరలోనే వాళ్లు అతణ్ణి చేరుకున్నారు. అందరూ ఆ వూరివాళ్లే. సుమారు ఇరవై మంది వుంటారు. అతణ్ణి పట్టుకున్నట్టు నటించాలి. కనీసం షామిల్‌కు తాము అతణ్ణి బంధించటానికి ప్రయత్నించామని తెలియాలి. వాళ్లను చూసి హాజీమురాద్ ఆగి అలవాటుగా, ఎడం చేత్తో రైఫిల్ తీశాడు. నాయకుడిని అనుసరించాడు ఎల్డార్.

"ఏం కావాలి మీకు? నన్ను పట్టుకుని అప్పగించాలనే గదా మీ కోరిక. రండి..

రండి!" అంటూ రైఫిల్ ఎత్తాడు హాజీము రాద్. గ్రామస్తులు ముందుక్కదల్లేదు.

గుర్రాన్ని లోయలోకి పరిగెత్తించాడు హాజీమురాద్. వాళ్లు అతణ్ణి వెంటాడే ప్రయత్నం చెయ్యలేదు. కొంతదూరం వెళ్లి వెనక్కు తిరిగి చూసిన హాజీమురాద్‌తో 'మేం చెప్పేది ఒకసారి విను' అంటూ అరి చారు. సమాధానంగా రైఫిల్ పేల్చాడ తడు. మరికాసేపటికి ఎవరూ తనను అనుసరించటం లేదని రూఢీ చేసుకుని, ఒక క్షణం ఆగి అడవిలోని కాలవ గలగల లను విన్నాడు. ఇక్కడ కాకులు లేవు గాని ఓ గుడ్లగూబ కూసింది. దట్టమైన అడవి ఒక కోటగోడలాంటిది. మురిద్‌లు(అనుచ రులు) తనకోసం అక్కడ నిరీక్షిస్తున్నారు.

అలా మరికొంత దూరం ప్రయాణిం చాక ఆగి ఈల వేశాడు. మరు నిమిషం జవాబుగా మరో ఈల వినిపించింది. హా జీమురాద్ అడవిలోకి ప్రవేశించాడు. కొ న్ని అడుగులేసి అలా ముందుకెళ్లాడో లేదో, చెట్ల మధ్య రాజుకుంటున్న మంట ఒకటి కనిపించింది. జీను వేసిన గుర్రం, నలుగురు మనుషులూ వున్నారు ఆ మంట చుట్టూ.

అందులోంచి ఒకడు వచ్చి గుర్రం కళ్లెం పట్టుకుని హాజీమురాద్ దిగటానికి సాయం చేశాడు. అతడు హాజీమురాద్ సోదరుడు. ఇంటి వ్యవహారాలన్నీ అతనే చూస్తాడు.

గుర్రం దిగుతూనే "మంట ఆర్పె య్యండి" అన్నాడు హాజీమురాద్.

నిప్పుల మీద ఆకులు కప్పేశారు మను షులు.

"బాటా ఇక్కడికి వచ్చాడా? " అని అడి గాడు, నేలమీద పరచిన గుడ్డవైపు నడుస్తూ.

"వచ్చాడు. ఖాన్ మహోమాతో కలిసి వెళ్లిపోయి కూడా చాలా సేపయింది.

"ఎటువైపుగా వెళ్లారు? "

హాజీమురాద్ వచ్చిన దిశకు వ్యతిరే కంగా చూపిస్తూ "అటువైపు" అన్నాడు ఖనేఫీ.

"సరేగాని, మనం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నన్ను కొందరు వెంబడిం చారు" అంటూ హెచ్చరించాడు హాజీము రాద్.

ఎల్డార్ కూడా గుర్రం దిగి, రెండు గుర్రాలనూ చెట్టుక్కట్టేశాడు. ఆ తర్వాత రైఫిల్ తీసుకుని, కాలవకు అతడొక వైపు, గంజాలో అనే చెచెన్ మరోవైపు కాపలా కాశారు. మంట ఆరిపోవటంతో చీకటి పెరిగింది. నక్షత్రాలు మరింతగా ప్రకాశిం చాయి.

ఆకాశం వైపు చూసి, సప్తర్షి మండలం నడినెత్తికి రావటంతో అర్ధరాత్రి దాటి వుంటుందని తెలుసుకున్నాడు హాజీము రాద్. చివరి నమాజు సమయం దాటి చాలా సేపైంది. ఖనేఫీ నుండి నీళ్లచెంబు తీసుకుని కాలవ వైపు నడిచాడు హాజీము రాద్. ప్రయాణాల్లో నీళ్లచెంబు వెంట తీసుకెళ్లటం వాళ్ల ఆచారం.

మరి కాసేపటికి కాళ్లూ చేతులు కడు క్కుని, వంగి కూర్చుని, వేళ్లు చెవులకానించి, కళ్లు మూసుకుని, దక్షిణంవైపు తిరిగి ప్రార్థన చేశాడు. తిరిగివచ్చి మోకాళ్ల మీద

కూర్చుని, తలవంచి దీర్ఘాలోచనలో పడ్డాడు.

హాజీమురాద్‌కు ఆత్మవిశ్వాసమెక్కువ. తను అదృష్టవంతుణ్ణనే అనుకుంటాడు. ఏమి చేసినా విజయం సాధిస్తానని గట్టి విశ్వాసం. ఇంతవరకూ అతని నమ్మకం వమ్ము కాలేదు. అనుకున్నవన్నీ సాధించగ లిగాడు- ఎప్పుడో ఒకటి రెండుసార్లు తప్ప ముఖ్యంగా నిత్యయుద్ధాలే జీవనసర ళిగా మారినప్పుడు- ప్రతిసారీ అపజయం కూడా పొంచివున్నప్పుడు, తరచూ తనదే పైచేయి కావటమంటే మామూలు విషయం కాదు. ఆ నమ్మకంతోనే ఇప్పుడు కూడా విజయం సాధిస్తాననుకున్నాడు. ఆ దృశ్యం అప్పుడే అతడి కళ్లముందు మెది లింది. వొరొంట్సోవ్ సైన్యం తనకు తోడు రాగా షామిల్‌తో యుద్ధంచేసి, అతణ్ణి ఖైదీగా పట్టుకుని తన పగ తీర్చుకుం టాడు. అప్పుడు రష్యన్ జార్ తనకు బహుమానం ప్రకటిస్తాడు. కేవలం అవే రియా (చెచెన్యాలో ఒక ప్రాంతం) మాత్రమే కాక, మొత్తం చెచెన్యా తన ఆధీ నంలోకి వస్తుంది. ఈ మధురోహలతో అతడికి త్వరగా నిద్రపట్టింది.

కల ఎంత సుఖంగా వుందో! విజయగీ తాలు గానం చేస్తూ ప్రతీకారం తీర్చుకున్నా మన్న ఆనందంతో పెద్దగా అరుస్తూ, షామిల్ మీదికురికారు తన అనుచరులు. షామిల్ భార్యలు భయంతో బిక్కచచ్చి, శోకాలు పెట్టారు. "హాజీమురాద్ వస్తు న్నాడు 'ల్యా ఇల్ అల్లీషా' అంటూ విజ యోత్సాహంతో చిందులు వేశారు తన సైనికులు. ల్యా ఇల్ అల్లీషా, షామిల్ భార్యల రోదనలు, తన సైనికుల నవ్వులు.. ఇంతలో మెలకువ వచ్చింది. తనకు మెలకువ రావటానికి కారణం నక్కల వూళలు! తల ఎత్తి ఆకాశం వైపు చూశాడు. చెట్ల సందుల గుండా తూర్పున వెలుగు కనిపించింది. ఒక మురిద్‌ను ఖాన్ మహోమా గురించి అడిగాడు. అత డింకా తిరిగి రాలేదట. హాజీమురాద్ మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు.

మరి కాసేపటికి ఖాన్ మహోమా గొంతు విని మెలకువ వచ్చింది. బాటా కూడా తిరిగి వచ్చాడు. హాజీమురాద్ పక్కనే కూర్చుని జరిగిందంతా చెప్పాడు ఖాన్ మహోమా. రష్యన్ సైనికులు తమను ప్రిన్స్ వద్దకు తీసికెళ్లారు. మరు నాడు అడవిలోని ఒక రహస్య ప్రదేశంలో షాలిన్ వద్ద కలుసుకుంటానని వాగ్దానం చేశాడు ప్రిన్స్. ఎంత ఘనంగా మర్యాద చేశాడో! అక్కడక్కడ బాటా కూడా మాటలు కలిపాడు.

"ముఖ్యంగా తను రష్యన్ల పక్షం చేర టానికి సిద్ధంగా వున్నానని చెప్పినప్పుడు, ప్రిన్స్ ఎలా స్పందించాడు? ఏమ న్నాడు? " అని గుచ్చిగుచ్చి అడిగాడు హాజీ మురాద్.

"మిమ్మల్ని రష్యన్ల అతిథిగా అంగీకరిస్తా నని చెప్పాడనీ, అది తనకు అంగీకారయో గ్యమే అనుకుంటున్నాననీ ఆశాభావం వ్యక్త పరిచాడు"

"కలుసుకోవలసిన రహస్య ప్రదేశానికి దారి తెలుసా? " అని మరోసారి బాటాను ప్రశ్నించాడు హాజీమురాద్.



"బాగా తెలుసు. స్వయంగా తీసికెళతా" అన్నాడు బాటా.

వాగ్దానం చేసిన మూడు రూబుళ్లూ తీసిచ్చాడు హాజీమురాద్. ఆ తర్వాత బంగారు తాపడం పెట్టిన ఆయుధాలను బైటికి తీసి మెరుగు పెట్టమన్నాడు. రష్యన్లను మొదటిసారి కలుస్తున్నారు. తమ హోదా కూడా చూపించుకోవాలి మరి.

ఇంకా తెల్లవారకముందే రష్యన్ కంపెనీ కమాండర్ పోల్టోరాట్స్కీ నాయకత్వంలో రెండు కంపెనీల సైనికులు గొడ్డళ్లు పట్టుకుని, చెట్లు నరకటానికి ఆరు మైళ్లు ప్రయాణం చేసి షాగిరిన్స్ గేట్ చేరుకున్నారు. కొందర్ని కాపలా పెట్టి మిగతావాళ్లు పనికి ఉపక్రమించారు. ఎనిమిదింటికి మంచు కరిగింది. గడ్డి, చెట్ల వాసనలతో కలిసిన చలిమంటల పొగ తెరకప్పినట్టు వ్యాపించింది.

చెట్లు నరుకుతున్న చోట కూర్చున్నారు సైనికులు. పోల్టోరాట్స్కీ, అతని సహాయకుడు టిఖానోవ్, మూడవ కంపెనీలోని ఇద్దరు ఆఫీసర్లు, బేరన్ ఫ్రెజ్ (ఇతడు గార్డ్స్‌కు చెందిన మాజీ ఆఫీసర్) భోజనం ముగించారు. సిగరెట్టు పీకలు, ఖాళీ బాటిళ్లు చెల్లాచెదురుగా పడివున్నాయి. కొందరు వోడ్కా ముగించి వైను తాగుతున్నారు. ఒక సేవకుడు మూడవ బాటిల్ కార్కు తీస్తున్నాడు.

రాత్రి సరిగా నిద్ర లేకపోయినప్పటికీ, పోల్టోరాట్స్కీ వుత్సాహంగా వున్నాడు. తన సైనికులతో కలసి ఏ ప్రమాదాన్ని ఎదుర్కోవాలన్నా అతనికి చాలా సంతోషంగా వుంటుంది.

ప్రస్తుత సంభాషణ జనరల్ స్లెట్‌ప్స్నోవ్ మరణం గురించి. మరణం అంటే, జీవితం ఎక్కడ ప్రారంభమైందో తిరిగి అక్కడికి చేరుకుందన్నమాట. వాళ్లు ఈ అతిముఖ్యమైన విషయాన్ని విస్మరించి, తమ అవగాహనను ఒక వీరుడి శౌర్యపరాక్రమాలకు మాత్రమే పరిమితం చేశారు. పర్వత ప్రాంతాలలోని తిరుగుబాటుదారులతో కత్తియుద్ధం చేస్తూ మరణించాడతడు.

యుద్ధంలో పాల్గొన్నవాళ్లందరికీ అనుభవమే. ఆ రోజుల్లో, ఈ రోజుల్లో కూడా ఎదురెదురు నిల్చి చంపుకోవటమనేది ఎప్పుడూ జరగదు. నరుక్కోరని కాదు. పారిపోయేవాళ్లనే తరిమి తరిమి చంపుతారు. యుద్ధంలో వీరత్వం, శౌర్యపరాక్రమాలు వుంటాయనే భావనే వాళ్లు ఆరోజు అంత సరదాగా కబుర్లు చెప్పుకోవటానికి కారణం. చల్లగాలి వీస్తున్నది. తాగుతూ, హాస్యపు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారేగాని, స్లెట్‌ప్స్నోవ్‌ను కబళించినట్టుగానే తమ కోసం కూడా మృత్యువు పొంచి వుందని అర్థం చేసుకోలేదు. ఈ విషయాన్ని నిజం చేస్తున్నట్టుగా సరిగ్గా ఆ సరదా కబుర్ల మధ్య, వాళ్లకు అతిసమీపంగా ఒక బుల్లెట్ దూసుకుపోయింది.

"అదిగో, ఎవరో మననే గురిచూశారు. కోట్స్యా, రైఫిల్ అందుకో" అంటూ ఫ్రెజ్ వైపు చూసి "నీ సత్తా చూపించు. నేను కంపెనీని లీడ్ చేస్తాను. యుద్ధం మజా రుచి చూద్దువుగాని" అంటూ పురకలెత్తే వుత్సాహంతో అరిచాడు పోల్టోరాట్స్కీ.

తుపాకీ పొగ వచ్చిన దిశగా పరిగెత్తాడు ఫ్రెజ్. గుర్రమెక్కి, అనుచరగణంతో ముందుక్కదిలాడు పోల్టోరాట్‌స్కీ. గాలి తీవ్రత పెరిగింది. లోయ అంచున వున్నది వీళ్ల జెట్‌పోస్ట్. అప్పటికి మంచు కరిగి వెలుగొచ్చింది. ముందు వరుసలో నిల్చున్న పోల్టోరాట్‌స్కీకి ఓ పావు మైలు దూరంలో నలుగురు అశ్వికులు కనిపించారు. రష్యన్ల సహాయం అర్థించమని హాజీమురాద్‌ను ఒప్పించింది వీళ్లే. వాళ్లలో ఒకడు తుపాకీ పేల్చాడు. సైనికులు బదులిచ్చారు. చెచెన్లు వెనక్కు తగ్గారు. ఫైరింగ్ ఆగింది.

అయితే ఈ కాల్పుల్లో ఒక సైనికుడు అవ్వీవ్ గాయపడ్డాడు. అతడికి పొట్టలో తగిలింది బుల్లెట్.

పోల్టోరాట్‌స్కీ అతణ్ణి సమీపించి "ఎక్కడ? బాగా నొప్పిగా వుందా? " అంటూ పరామర్శించాడు.

"నొప్పెక్కువగా లేదుగాని నడవలేకపోతున్నాను. ఒక చుక్క వోడ్కా వుంటే యివ్వండి సార్" అన్నాడు అవ్డీవ్.

వెదికితే కాస్త వోడ్కా దొరికింది. లేదా అలాంటిదే మరో స్పిరిట్. పానోవ్ అనే సైనికుడు ఒక జగ్గులో పట్టుకొచ్చాడు. రుచిచూసి అవ్డీవ్ "తాగలేను. నువ్వే తాగు" అన్నాడు.

స్పిరిట్ మొత్తం తాగేశాడు పానోవ్.

"యువరానర్, కల్నల్ గారొస్తున్నారు" అంటూ పోల్టోరాట్‌స్కీని అప్రమత్తం చేశాడు సార్జెంట్ మేజర్.

"అయితే పద, ఎదురెళదాం" అంటూ గుర్రాన్ని దౌడు తీయించాడు పోల్టోరాట్‌స్కీ. మేలుజాతి ఇంగ్లీష్ గుర్రంమీద వస్తున్నాడు వొరొంట్సోవ్. వెంట ఒక కోసక్కు, ఒక చెచెన్ దుబాసీ వున్నారు.

"ఏం జరుగుతోందిక్కడ? " అంటూ ప్రశ్నించాడు వొరొంట్సోవ్.

"వాళ్లు మనపైన దాడి చేశారు" అన్నాడు పోల్టోరాట్‌స్కీ.

"కాల్పులు మీరు ప్రారంభించలేదా? "

"లేదు ప్రిన్స్, వాళ్లే ముందుకు రావటానికి ప్రయత్నించారు"

"ఒక సైనికుడు గాయపడ్డాడని విన్నాను"

"అవును ప్రిన్స్"

"సీరియస్ కేసా? "

"బుల్లెట్ పొట్టలోకి దూసుకుపోయింది. పరిస్థితి సీరియస్‌గానే వుంది"

"నేనిప్పుడు ఎక్కడికి వెళుతున్నానో తెలుసా? "

"తెలియదు"

"ఊహించగలవా? "

"లేదు"

"హాజీమురాద్ లొంగిపోయాడు. అతణ్ణి కలుసుకోవటానికి వెళుతున్నాం"

"అంటే? "

"అతడి తరపున రాయబారం తీసుకొని ఒక మనిషి నిన్న నా వద్దకు వొచ్చాడు" అన్నాడు వొరొంట్సోవ్. పెదాలమీద చిరునవ్వును అతడు దాచుకోలేకపోతున్నాడు.

"షాలిన్ తోపువద్ద నా కోసం నిరీక్షిస్తుంటాడు. చుట్టూ సైనికుల్ని కాపలా పెట్టి, తరువాత నా వద్దకు రా"

"అర్థమైంది" అంటూ గుర్రమెక్కి తన కంపెనీవైపు పరుగుతీశాడు పోల్టోరాట్‌స్కీ. సమావేశ స్థలానికి కుడివైపు కొందర్నీ ఎడమవైపు కొందర్నీ యుద్ధసన్నద్ధమై వుండమని ఆదేశించి అవ్డీవ్ గురించి వాకబు చేశాడు. ఇతర సైనికులు అతణ్ణి అప్పటికే దుర్గానికి తీసికెళ్లారు.

వొరొంట్సోవ్‌ను కలుసుకోవటానికి బయల్దేరినప్పుడు కొందరు అశ్వికులు అతివేగంగా తనను దాటుకొని వెళ్లటం గమనించాడు పోల్టోరాట్‌స్కీ. తెల్లటి గుర్రం మీద స్ఫురద్రూపి ఒకడు పాగా, బంగారు నగలు ధరించి స్వారీ చేస్తున్నాడు. అతడే

హాజీమురాద్. పోల్టోరాట్‌స్కీని సమీపించి టార్టార్ భాషలో ఏదో అడిగాడు. తనకర్థం కాలేదన్నట్లు చిరునవ్వు నవ్వాడు పోల్టోరాట్‌స్కీ. హాజీమురాద్ తిరిగి నవ్వాడు. అది పసిపిల్లల నవ్వులా వుంది. పర్వతాలలో ఉండే తెగల నాయకుడు అంత అందంగా, అమాయకంగా నవ్వగలడని పోల్టోరాట్‌స్కీ వూహించలేదు. మొహంలో కరకుదనం వుంటుందనుకున్నాడు. కాని అతడు తన చిన్ననాటి స్నేహితుడిలా కనిపిస్తున్నాడు. నల్లటి కనుబొమ్మల కింది అతడి కళ్లలో ఏదో శక్తి వుంది.

హాజీమురాద్ బృందంలో మొత్తం అయిదుగురున్నారు. అందులో ఒకడు ఖాన్ మహోమా. ఇతడే ప్రిన్స్ వొరొంట్సోవ్‌ను క్రితం రోజు రాత్రి కలిశాడు. మరొకతను ఆవర్ ఖనేఫీ. హాజీమురాద్ వ్యవహారాలన్నీ అతడే చూసుకుంటాడు. మరొకడు లెస్గియన్. యువకుడు, అందగాడు. ఆడపిల్లలా సుకుమారంగా వున్నాడు. వీళ్లేగాక ఎల్డార్ ఉన్నాడు. చివరివాడు గంజాలో. చిన్నగడ్డం, కనుబొమలే లేవు.

దూరంగా నిల్చున్న వొరొంట్సోవ్‌ను వేలితో చూపించాడు పోల్టోరాట్‌స్కీ. హాజీ మురాద్ వెళ్లి కుడిచేయి గుండెకానించుకుని టార్టార్‌లో ఏదో అన్నాడు. చెచెన్ దుబాసీ దాన్ని రష్యన్‌లోకి అనువదించాడు.

"రష్యన్ జార్ అధికారానికి లొంగిపోతున్నాను. ఇది నా చిరకాల వాంఛ. కాని ఇన్నాళ్లు షామిల్ నాకు అడ్డుపడ్డాడు"

దుబాసీ చెప్పింది విని, గ్లవ్స్ తొడిగిన చేతిని కరచాలనం కోసం ముందుకు చాపాడు వొరొంట్సోవ్.

హాజీమురాద్ మళ్లీ ఏదో అన్నాడు.

"అతడు నీకు మాత్రమే లొంగిపోవాలనుకున్నాడట. నువ్వు సర్దార్ కొడుకువు గనక, నువ్వంటే అతడికి ప్రత్యేకమైన గౌరవముంది"

కృతజ్ఞతలు చెప్పాడు వొరొంట్సోవ్.

"తన అనుచరులందరూ ఇక రష్యన్ పక్షమే అంటున్నాడు" అన్నాడు దుబాసీ.

ఆ తర్వాత హాజీమురాద్‌ను వెంట తీసుకుని వొరొంట్సోవ్ దుర్గంలోకి ప్రవేశించినప్పుడు సైనికులు పలురకాలుగా మాట్లాడుకున్నారు.

"దుర్మార్గుడు! ఎంతమందిని చంపాడో? ఇప్పుడేమో వాడికి స్వాగతమా!"

"అవును. ఒకప్పుడు వాడు షామిల్‌కు కుడిభుజం. ఇప్పుడు కాడుగా. ఇక భయం లేదు"

"ఏదేమైనా చూడటానికి ఎంత అందంగా వున్నాడో!"

"ఆ ఎర్రగా వున్నవాడెవడు? మెల్లకన్నుతో చూస్తున్నట్టుంది? "

కాసేపాగి, ఆసక్తిగా చూస్తున్న తన సైనికులతో వొరొంట్సోవ్ "ఇతడెవరో తెలుసా? " అని అడిగాడు.

"తెలియదు, ఎక్సెలెన్సీ"

"హాజీమురాద్! పేరు విన్నారా? "

"ఎన్నిసార్లు మనం అతణ్ణి యుద్ధాల్లో తిప్పికొట్టలేదని"

"అతడూ మనల్ని బాగానే సతాయించాడుగా"

"అవును, ఎక్సెలెన్సీ"

తన గురించే అందరూ మాట్లాడుకుంటున్నారని హాజీమురాద్‌కు అర్థమైంది.

వొరొంట్సోవ్ మనసు విజయోత్సాహంతో పురకలేసింది.

★ ★ ★

రష్యాకు కంటిలో నలుసు, ప్రధానశత్రువు షామిల్, చెచెన్ నాయకుడు. అతడి తర్వాతి ముఖ్యనాయకుడు హాజీమురాద్. ఇటువంటి పెద్దచేపను రష్యన్ సైన్యంలో ఇంతమంది ఉన్నతాధికారులుండగా తను మాత్రమే వలవేసి లొంగదీసుకోవటం గర్వంగా వుంది. అదీ వొరొంట్సోవ్ ఉత్సాహానికి కారణం. ఒక్క చిన్న విషయం గురించే సందేహంగా వుంది. వోడ్విజెన్‌స్కయ వద్ద సైన్యాన్ని కమాండ్ చేస్తున్న జనరల్ మెల్లర్ జకోమెల్‌స్కీ ఆధ్వర్యంలో ఆపరేషన్ జరగాల్సింది. ఎవరికీ రిపోర్ట్ చెయ్యకుండా, ఎవరి అనుమతి తీసుకోకుండానే, తనీ పని పూర్తిచేశాడు. ఈ ఆలోచనే అతడి వుత్సాహాన్ని కాస్త మసకబార్చింది. ఇంటికి చేరగానే హాజీమురాద్ అనుచరులను రెజిమెంటల్ అడ్జుటెంట్ (ఒక సైనిక హోదా)కు అప్పగించి అతణ్ణి తను స్వయంగా ఇంట్లోకి తీసికెళ్లాడు.

అందంగా అలంకరించుకున్న ప్రిన్సెస్ మార్యా వాసిలెవ్నా, తన ఆరేళ్ల కొడుకుతో ఎదురొచ్చింది. డ్రాయింగ్‌రూంలో కూర్చున్నారు. చేతులు గుండెల మీద పెట్టుకుని దుబాసీ ద్వారా ప్రిన్స్‌ను తన సోదరుడిగా భావిస్తున్నాననీ, తాను కూర్చున్న ఈ ఇల్లు తనకు పవిత్రస్థలం అనీ, అతడి కుటుంబమంతా తనకు గౌరవపాత్రులనీ చెప్పాడు హాజీమురాద్.

అతడి ప్రవర్తన, మర్యాద మార్యాను బాగా ఆకట్టుకున్నాయి. తన ముంజేతిని మర్యాదగా స్పృశించినప్పుడు, అతడి మొహం ఎరుపెక్కటం ఆమెకు మరీ నచ్చింది. కూర్చొమ్మని ఆప్యాయంగా ఆదరించి, కాఫీ తాగుతారా? అని అడిగి కప్పులో కొంత పోసింది. ఇంతా చేసి కప్పు అందిస్తే వద్దన్నాడు. రష్యన్ కొద్దికొద్దిగా అర్థమవుతుంది కాని మాట్లాడలేడు. ఎవరైనా తనకర్థం కాకుండా మాట్లాడినప్పుడు నవ్వుతాడు. పోల్టోరాట్‌స్కీలాగే, మార్యా కూడా అతడి నవ్వు చూసి అతడి మీద మంచి అభిప్రాయం పెంచుకుంది. తల్లి పక్కన నిల్చున్న పిల్లాడు, హాజీమురాద్ వైనుండి క్షణం కూడా దృష్టి మరల్చలేదు. అతడు గొప్ప పరాక్రమవంతుడని చెప్పుకోవడం వాడు విన్నాడు.

హాజీమురాద్‌తో మాట్లాడుతుండమని భార్యకు చెప్పి, అతడు లొంగిపోయి, రష్యన్ పక్షం చేరాడని రిపోర్ట్ చెయ్యటానికి బయల్దేరాడు వొరొంట్సోవ్. గ్రోజ్నీలో ఉన్న జనరల్ కొజ్లోవ్‌స్కీకి నివేదిక పంపి, తన తండ్రికి మరో ఉత్తరం రాసి హడావిడిగా ఇంటికి తిరిగివచ్చాడు. ఈ మొరటు మనిషిని తనతో వదిలి వెళ్లినందుకు భార్య కోపం తెచ్చుకుంటుందేమోనని భయపడ్డాడు. కానీ ఇంట్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్న హాజీమురాద్, ఆరేళ్ల బుల్కాతో ఆడుకుంటున్నాడు. వీడు తన భార్యకు మొదటి భర్తతో కలిగిన సంతానం. కుర్రాడు అతడి ఒళ్లో కూర్చున్నాడు. ఇల్లంతా నవ్వులతో మునిగి తేలుతున్నది. 'సోదరుడిని కదా అని అడిగిందల్లా ఇస్తానంటే ఒంటి మీద నూలు పోగు కూడా మీకు మిగలదు' అంటున్నది మార్యా.

ప్రిన్స్‌ను చూసి, హాజీమురాద్ ఒక్క ఉదుటన లేచి నిల్చున్నాడు. మీద కూర్చున్న బుల్కా కిందికి దూకి కోపం తెచ్చుకున్నాడు. వాడి మొహంలో నవ్వు మాయమైంది. కోపంగా చూశాడు. వొరొం

ట్సోవ్ కూర్చున్న తర్వాత కుర్చీలో తనూ కూర్చుని సంభాషణ కొనసాగిస్తూ "సోదరుడు ఇష్టపడింది, కోరింది ఏదైనా ఇచ్చేయటం తమ ఆచారం" అన్నాడు హాజీమురాద్.

"బుల్కాకు అతడి చురకత్తి నచ్చింది" అంది మార్యా.

గర్వంగా, అప్పటిదాకా దాచుకున్న చురకత్తి చూపించాడు బుల్కా.

"చాలా బాగుంది. నేనెలా ప్రత్యుపకారం చెయ్యగలనో అడుగు" అన్నాడు దుబాసీతో వొరొంట్సోవ్.

"నాకేమీ అక్కర్లేదు. నమాజు చేసుకోవటానికి చోటు కావాలి" అన్నాడు హాజీమురాద్.

సేవకులను పిలిచి, అవసరమైన ఏర్పాట్లు చెయ్యమన్నాడు వొరొంట్సోవ్.

ఆ తర్వాత కొద్దిసేపటికే ఏకాంతంలో హాజీమురాద్ ముఖకవళికలు మారిపోయాయి. పెదాల మీద ఆ చిరునవ్వు ఇప్పుడు లేదు. ఆందోళనగా అటూ ఇటూ పచారు చేశాడు. తను ఊహించిన దాని కన్నా సాదరంగా తన లొంగుబాటును అంగీకరించాడు వొరొంట్సోవ్. కాని ఆ 'అతిమర్యాద', 'అతిప్రేమ'లోనే ఏదో వ్యూహం దాగుంది. వొరొంట్సోవ్‌ను, అతని అధికారులను ఎంతవరకు విశ్వసించవచ్చు? అంతటి ధైర్యవంతుణ్ణి కూడా భయం వేధించింది. అరెస్టు చేసి, గొలుసులతో సైబీరియాకు తరలించరా? ఎందుకంత శ్రమ? సింపుల్‌గా చంపేసినా చంపేస్తారు. తన జాగ్రత్తలో తనుండాలి. ఎల్డార్ ప్రవేశించగానే, తన అనుచరులు ఎక్కడ ఉన్నారు? ఎలా ఉన్నారని అడిగాడు. ఆయుధాలు తమ దగ్గరే ఉన్నాయా? లేక వాళ్లు లాగేసుకున్నారా? గుర్రాలెక్కడ కట్టేశారు? అని అడిగాడు. ప్రిన్స్‌గారి అశ్వశాలలోనే తమ గుర్రాలు ఉన్నాయన్నాడు ఎల్డార్. ఆయుధాలు తమ దగ్గరే ఉన్నాయనీ, దుబాసీ స్వయంగా తమకు భోజనం, టీ అందచేస్తున్నాడని చెప్పాడు.

సందేహంగా తలూపాడు హాజీమురాద్. దుస్తులు మార్చుకుని, నమాజు ముగించి తన వెండి చురకత్తి తీసుకురమ్మని ఎల్డార్‌తో చెప్పాడు. మళ్లీ డ్రెస్ చేసుకుని బెల్ట్ పెట్టుకుని, ఏ అనూహ్య పరిణామానికైనా సిద్ధమన్నట్టు కూర్చున్నాడు.

నాల్గింటికి దుబాసీ వచ్చి, ప్రిన్స్‌తో కలిసి భోజనం చెయ్యటానికి ఆహ్వానించాడు.

కొద్దిగా పలావు తప్ప మరేమీ తినలేదు హాజీమురాద్. అదికూడా పళ్లెంలోంచి మార్యా వాసిలెవ్నా తీసుకున్న వైపు నుండే తనూ కొద్దిగా తీసుకున్నాడు.

"మనం విషం కలుపుతామేమోనని అతను అనుమానిస్తున్నాడు" అని మార్యా భర్తతో చెప్పింది. ఆ వెంటనే హాజీమురాద్ వైపు తిరిగి, దుబాసీ ద్వారా "మళ్లీ ఎప్పుడు ప్రార్థన చేస్తారు?" అని అడిగింది. హాజీమురాద్ అయిదువేళ్లు చూపించాడు. వొరొంట్సోవ్ తన వాచి స్ప్రింగ్ నొక్కి 'ఎక్కువసేపు లేదు' అన్నాడు. అప్పటికి టైం నాలుగుంపావు అయింది. ఆశ్చర్యపడి, తను కూడా వాచీ చూస్తానన్నాడు హాజీమురాద్.

వొరొంట్సోవ్ తన వాచీ అందించాడు హాజీమురాద్‌కు. పలుసార్లు చేతులు ఛాతీ మీద పెట్టుకుని, స్ప్రింగ్ ప్రెస్ చేసి గడియారం చెవిదగ్గర పెట్టుకుని విన్నాడు.

విందు ముగిసింది.

ఉన్నతాధికారి మెల్లర్ జకోమెల్‌స్కీ తరపున ఓ మనిషి వచ్చాడని చెప్పాడు సేవకుడు.

అసలు విషయమేమిటంటే హాజీమురాద్ లొంగిపోయిన విషయం తెలిసి మెల్లర్ జకోమెల్‌స్కీ కోపంగా ఉన్నాడు

ఇంతవరకూ ఈ ముఖ్య సమాచారం తనకు రిపోర్ట్ చెయ్యనందుకు. తక్షణమే లొంగిపోయిన వ్యక్తిని అతని ముందు ప్రవేశపెట్టాలి. జనరల్ గారి ఆదేశం శిర సావహించక తప్పదని వొరొంట్సోవ్‌కు తెలుసు. ఆ మనిషి వెంట మెల్లర్ వద్దకు వెళ్లాలని హాజీమురాద్‌తో దుబాసీ ద్వారా చెప్పించాడు.

జనరల్‌కు కోపం వచ్చిందని మార్యాకు కూడా తెలుసు. ఇది కాస్త ఇబ్బందికరమైన విషయమే. భర్త వారించినా వినకుండా, వాళ్ల వెంట తనూ జనరల్ వద్దకు వస్తా నంది.

"తర్వాత వెళ్లొచ్చుగా"

"ఇప్పుడే వస్తాను"

వొరొంట్సోవ్ అంగీకరించక తప్పలేదు.

★ ★ ★

ముగ్గురూ ప్రవేశించగానే మర్యాదగా, మార్యాను తన భార్యకు పరిచయం చేసి, హాజీమురాద్‌ను వెయిటింగ్ రూంలోకి వెళ్లమని, తదుపరి ఆజ్ఞలు ఇచ్చేంతవరకు అతణ్ణి బయటకి రానివ్వవద్దని అనుచరు లను ఆజ్ఞాపించాడు జనరల్ మెల్లర్ జకో మెల్‌స్కీ. ఆ తర్వాత వొరొంట్సోవ్‌ను తన స్టడీ రూంలోకి ఆహ్వానించాడు. కాని ఆ తర్వాత తలుపు మూసి అతణ్ని కనీసం కూర్చొమ్మని కూడా అనకుండా "ఈ ప్రాంతానికి అధికారిని నేను. నా ద్వారా మాత్రమే శత్రువుతో చర్చలు జరపాలి. హాజీమురాద్ మన పక్షం వచ్చి లొంగిపో యిన విషయం నాకెందుకు రిపోర్ట్ చెయ్య లేదు? " అడిగాడు.

"మధ్యవర్తి వచ్చి, అతడు కేవలం నాకే లొంగిపోదలచుకున్నాడని చెప్పాడు" అన్నాడు వొరొంట్సోవ్ ఉద్రేకాన్ని అణచు కుంటూ. జనరల్ పరుషంగా మాట్లాడబో తున్నాడని అతడికి తెలుసు.

"నాకెందుకు సమాచారమివ్వలేదని అడుగుతున్నాను? "

"బేరన్, మీకు రిపోర్ట్ చేద్దామనే అనుకు న్నాను కాని..."

"నన్ను బేరన్ అని కాదు, యువర్ ఎక్సె లెన్సీ అని సంబోధించాలి..." సరిగ్గా అక్కడ ఆయన కోపం కట్టలు తెంచు కుంది.

"ఇరవై ఏడేళ్లుగా నేను చక్రవర్తి సేవలో ఉన్నాను. కుటుంబ సంబంధాల వల్ల ని న్నగాక మొన్న సైన్యంలో చేరిన ఒక కుర్ర కుంక, తనకు సంబంధించని వ్యవహారాల్లో నన్ను ధిక్కరించి..."

"యువర్ ఎక్సెలెన్సీ.. మీరు అసత్యాలు పలుకకూడదు"

"నేను చెప్పేది సత్యమే. నా అనుమతి లేకుండా..."

సరిగ్గా అప్పుడు డ్రెస్సు రెపరెపలాడగా మార్యా గదిలోకి ప్రవేశించింది.

"బేరన్‌గారూ శాంతించండి. నా భర్తకు మిమ్మల్ని అవమానించే ఉద్దేశ్యం ఎంత మాత్రం లేదు.." అంటూ ప్రారంభించింది మార్యా.

"నేను దాని గురించి మాట్లాడటం లేదు ప్రిన్సెస్"

"సర్లెండి. అంతా మరచిపోదాం. ఎలాగ సాధించినా, యుద్ధంకన్నా శాంతి మేలు గద" అంటూ నవ్వింది మార్యా.

ఆ నవ్వుకు కరిగిపోయాడు జనరల్.

"నేను చేసింది తప్పే. కాని..." అనబోయాడు వొరొంట్సొవ్.

"నేను కూడా కొంచెం మాట జారానులే..." అంటూ కరచాలనం కోసం చేయి చాపాడు మెల్లర్.

శాంతి పునరుద్ధరించబడింది. ప్రస్తుతానికి హాజీమురాద్‌ను జనరల్ ఆధీనంలో వుంచటానికి ఆ తర్వాత సంబంధిత కమాండర్‌కు అప్పగించటానికి నిర్ణయించారు.

పక్కగదిలో కూర్చున్న హాజీమురాద్‌కు మాటలు వినిపించాయిగాని అర్థం కాలేదు. అయినా వాళ్లు తనగురించే పోట్లాడుకుంటున్నారని తెలిసింది. షామిల్‌ను వదిలి రష్యన్‌పక్షం రావటం, వ్యూహాత్మకంగా వీళ్లకు చాలా కీలకమైన విషయమే. తాను వాళ్ళకు చాలాముఖ్యం. అందువల్ల తనను చంపరు. నిజానికి డిమాండ్ చేసి వాళ్లనుండి బాగానే రాబట్టవచ్చు జనరల్ అయినప్పటికీ, మెల్లర్ జకోమెల్‌స్కీకి, తన కింది అధికారి వొరొంట్సొవ్‌కున్నంత పరపతిలేదు. అందువల్ల తర్వాత మెల్లర్ తనను ప్రశ్నించినప్పుడు, హాజీమురాద్ గర్వంగా, తన హోదా తగ్గించుకోకుండా సమాధానాలు చెప్పాడు. పర్వతాల్లోంచి మైదానాల్లోకి తను వచ్చింది జార్ చక్రవర్తి సేవలో తరించటానికి. కేవలం సర్దార్ అంటే కమాండర్-ఇన్-చీఫ్ అయినటువంటి ప్రిన్స్ వొరొంట్సొవ్ సీనియర్(కమాండర్ వొరొంట్సొవ్ తండ్రి)కి మాత్రమే లొంగిపోయాడు. వొరొంట్సొవ్ సీనియర్ టిఫ్లిస్ నగరంలో వుంటాడు.

★ ★ ★

గాయపడిన అవ్డీవ్‌ను ఆసుపత్రికి తీసికెళ్లారు. దుర్గం ముందరి భాగంలో చెక్క పలకలతో కట్టిన గదొకటుంది. అదే ఆసుపత్రి. జనరల్ వార్డ్‌లో ఒక బెడ్‌మీద పడుకోబెట్టారు క్షతగాత్రుణ్ణి. అతడుగాక, వార్డ్‌లో మరో నలుగురు పేషెంట్లున్నారు. ఒకడు టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాడు. మరొకడికి మలేరియా. ఎప్పుడూ ఆవలిస్తుంటాడు. మరో యిద్దరు మూడు వారాల క్రితం గాయపడినవాళ్లు. ఒకడికి చేతిలో, మరొకడికి భుజంలో గాయమైంది. టైఫాయిడ్ రోగి తప్ప మిగతా అందరూ కొత్త పేషెంటును పలకరించారు.

"కొన్నిసార్లు బుల్లెట్ల వర్షం కురుస్తుంది. అయినా ఒక్కటీ తగలదు. ఈసారి వాళ్లు అయిదు సార్లే పేల్చారు" అన్నాడొక పేషెంట్.

"అంతా అదృష్టం. ఎలా రాసుంటే అలా జరుగుతుంది"

మంచంమీద పడుకోబెట్టినప్పుడు నొప్పి భరించలేక పెద్దగా కేకేశాడు అవ్డీవ్. ఆ తర్వాత మూలగలేదుగాని కళ్లు చిట్లించి, కాళ్లు కదుపుతూ పడుకున్నాడు.

డాక్టరు వచ్చి, పేషెంట్‌ను పక్కకు తిప్పమని చెప్పి, బుల్లెట్ శరీరం గుండా ప్రయాణించిందేమోనని పరిశీలించాడు.

వాళ్లు అతడి చొక్కాపైకి లేపగానే "ఇదేమిటి?" అంటూ ఆశ్చర్యంగా చూశాడు.

వీపు మీదా, కాళ్ళమీద వాతలు పెట్టినట్లు తెల్లటి గీతలున్నాయి.

"అవిప్పటివి కావు సార్" అన్నాడు అవ్డీవ్.

కొంతకాలం క్రితం డబ్బు స్వంతానికి వాడుకున్నందుకు యజమాని అతణ్ణి కొరడాలతో కొట్టాడు.

మరోసారి అవ్డీవ్‌ను తిప్పారు. బుల్లెట్ కనిపించింది గాని దాన్ని తీయలేకపోయాడు డాక్టర్. గాయానికి డ్రెస్సింగ్ చేసి ప్లాస్టర్ వేసి వెళ్ళిపోయాడు. డాక్టరు పరీక్షించినంత సేపూ కళ్లు మూసుకుని, పళ్లు బిగపట్టిన అవ్డీవ్, అతడు వెళ్లిపోగానే కళ్లు

తెరిచి ఆశ్చర్యంగా అటూ ఇటూ చూశాడు. డాక్టరుగారి అసిస్టెంటునూ, యితర పేషెంట్లనూ ఎగాదిగా చూశాడు. కాని అతడు చూసింది వాళ్లను కాదు. మరేదో అతణ్ణి ఆకర్షించింది.

అతడి స్నేహితులు పానోవ్, సెరోజిన్ వచ్చారు. కాని అతడు రవ్వంతైనా కదల్లేదు. మొహంలోని ఆశ్చర్యమూ తగ్గలేదు. చాలాసేపటికి వాళ్లను గుర్తుపట్టినట్టుగా తలాడించాడు.

"మీ యింటి వాళ్ళకేమైనా చెప్పాలా?" అని అడిగాడు పానోవ్.

అతడివేపే చూసినా అవ్డీవ్ సమాధానం చెప్పలేదు.

"నిన్నే అడుగుతున్నాను. ఇంటివాళ్లకేమైనా చెప్పాలా?" మళ్లీ అడిగాడు పానోవ్ అతడి చేయితట్టి.

అప్పుడు ఈ లోకంలోకి వచ్చినట్టుగా "ఆ... పానోవ్!" అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు అవ్డీవ్.

"ఆఁ... నేనే. నీకోసం వచ్చాను. ఇంటి వాళ్లకేమైనా చెప్పాలా? సెరోజిన్ ఉత్తరం రాస్తాడు"

"సెరోజిన్!..." అంటూ అతడివైపు యిబ్బందిగా చూశాడు అవ్డీవ్.

"నువ్వు రాస్తావా... సరే రాయి. మీరం దరూ చిరకాలం సుఖంగా బతకాలి. మా అన్న...వాడు హాయిగా బతుకుతున్నాడు. సంతోషం! దేవుడందర్నీ చల్లగా చూడనీ...." అన్నాడతడు.

"ఇంకా?"

"ఇంకేం లేదు. కొవ్వొత్తి వెలిగించు. నేను చచ్చిపోతున్నాను" అన్నాడు అవ్డీవ్.

అప్పుడే పోల్టోరాట్స్కీ వచ్చాడు, వాకబు చెయ్యటానికి.

"ఎలా వుంది మై బాయ్?"

కళ్లు మూసుకుని అడ్డంగా తలూపాడు అవ్డీవ్. మొహం కళ తగ్గింది. మళ్లీ పానోవ్‌తో "కొవ్వొత్తి కావాలి. చచ్చిపోతున్నాను" అన్నాడు.

మైనం కాగితం అతడి వేళ్ళ మధ్యన

రచనావ్యాసంగమే కాలక్షేపం

ముక్తవరం పార్థసారథి

చాలాకాలంగా రాస్తూనేవున్నాను. నా తొలి నవల 'రంగులవల'కు 1969లో ఒక వారపత్రిక నిర్వహించిన ఉగాది నవలల పోటీలో మొదటి బహుమతి వచ్చింది. అంతకు ముందు, ఆ తర్వాతా వివిధ పత్రికల్లో నా కథలు చాలా అచ్చయ్యాయి.

నా యితర నవలలు.. నువ్వూ, నేను, చిన్నారావు; కౌగిలి, కలలనీడలు, దమయంతి, మలివెలుగు, మనసులోని చలి, కించిద్విషాదం, శూన్యం. 1978 మే 'చతుర'లో 'పరువు' ప్రచురితమైంది.

2003 నుండి పుస్తక పరిచయాలు, సాహిత్యవ్యాసాలు, అనువాదాలతో కాలక్షేపం.

కొన్నేళ్ల క్రితం చతురలో 'రచయితలకు ప్రత్యేకం' శీర్షిక నిర్వహించాను.

విశ్వవిఖ్యాత రష్యన్ రచయిత టాల్‌స్టాయ్ చివరి నవల 'హాజీమురాద్'ను చతుర ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేసే అవకాశమిచ్చిన సంపాదకులకు కృతజ్ఞతలు!

చిరునామా :
ముక్తవరం పార్థసారథి
411, ప్రభాత్‌కర్ అపార్ట్‌మెంట్స్,
విజయనగర్ కాలనీ,
హైదరాబాద్-500057

పెట్టారుగాని, దాన్ని కూడా మడవలేకపోయాడు అవ్డీవ్.

పోల్టోరాట్స్కీ వెళ్లిపోయాడు. ఒక ఆర్డర్లీ, అవ్డీవ్ గుండెమీద చెవిపెట్టి చూసి "అంతా అయిపోయింది" అన్నాడు.

టిఫ్లిస్‌కు పంపిన నివేదికలో అవ్డీవ్ మరణం గురించి యిలా రాశారు:

నవంబర్ 23: కురిన్ రెజిమెంట్‌కు చెందిన రెండు కంపెనీలు చెట్లు నరకటానికి బయల్దేరాయి. మధ్యాహ్నం పర్వతాల్లోంచి వచ్చిన తిరుగుబాటుదార్లు అనేక మంది కంపెనీల మీద దాడి చేశారు. తుపాకులున్న కంపెనీ వెనక్కు తగ్గినా, బాయ్‌నెట్లతో రెండవ కంపెనీ తిరుగుబాటుదార్లను దీటుగా ఎదుర్కొంది. ఈ ఘర్షణలో ఇద్దరు సైనికులు గాయపడ్డారు. ఒకడు మరణించాడు. తిరుగుబాటుదార్లలో వందమంది మరణించారు లేదా గాయపడ్డారు.

★ ★ ★

ఆసుపత్రిలో అవ్డీవ్ మరణించిన రోజున, స్వగ్రామం వోడ్విజెన్స్కయలో అతడి తండ్రి పొలంపనుల్లో తలమునకలుగా వున్నాడు. అన్నకు బదులుగా అవ్డీవ్ సైన్యంలో చేరాడు. పెళ్ళికెదిగిన కూతురితో మంచు గడ్డకట్టిన నేలమీద ఓట్స్ ధాన్యం తూర్పారబడుతున్నాడు.

క్రితం రాత్రి మంచు విపరీతంగా కురిసింది. తెల్లవారేసరికి రాయిలా, గట్టిపడింది. కోళ్లు మూడోసారి కూసినప్పుడు లేచాడు ముసలాయన, అవ్డీవ్ తండ్రి. మంచుపట్టిన కిటికీ అద్దాలమీద మెరుస్తున్న వెన్నెలను చూసి స్టౌ దిగి, (చలికి విశాలమైన స్టౌలమీదే పడుకుంటారు పేదలు) బూట్లూ, గొర్రెతోలు కోటూ తొడుక్కుని, టోపి పెట్టుకుని, ధాన్యం తూర్పారపట్టే చోటుకి నడిచాడు. అక్కడ రెండు గంటలు పనిచేసి, యింటికి తిరిగివచ్చి కొడుకునీ, ఆడవాళ్లనీ లేపాడు. కాసేపట్లో అందరూ పనిలో మునిగిపోయారు.

చంద్రుడు తూర్పున అదృశ్యమయ్యాడు. తెల్లవారింది. పని చాలా వరకు ముగిసింది. అప్పుడు ఆవలిస్తూ అక్కడికి చేరుకున్నాడు అతడి పెద్ద కొడుకు అకీం.

"ఇప్పటిదాకా ఎక్కడ పడి పొర్లుతున్నావురా? " అంటూ కసురుకున్నాడు ముసలాయన.

"గుర్రాలను చూసి వస్తున్నాను...."

"గుర్రాలట గుర్రాలు. ముసిల్ది కూడా ఆ పని చెయ్యగలదు. బాగా కొవ్వు బలిసింది తాగుబోతు వెధవా, ఆ కర్రతీసుకుని పని ప్రారంభించు" అంటూ అరిచాడు.

"నువ్వే తాగించినట్లు మాట్లాడతావేం" అంటూ గొణుక్కున్నాడు కొడుకు.

కోపంగా చూశాడు తండ్రి.

లయబద్ధంగా అందరి చేతులూ కలిశాయి.

"అమాయకుడు. నీకు బదులు నీ తమ్ముడు పీటర్ సైన్యంలోకెళ్లాడు. అక్కడ, నీలాంటి పనిదొంగలకు బాగా బుద్ధి చెప్పే వాళ్లు. నీలాంటివాళ్లు అయిదుగురితో వాడొక్కడు సమానం" అన్నాడు తండ్రి.

"చాల్లే, యింక మీ చదువుడాపండి" అంది కోడలు కాస్త విసుగ్గా.

"అవునవును. పనిచెయ్యని మీ ఆరుగుర్ని మేపటమేగా నా బాధ్యత! పీటర్, ఇద్దరు మనుషుల పని చేసేవాడు. వాడు వీడిలాగా కాదు"

నేలమీద చెల్లాచెదురుగా పడివున్న ధాన్యాన్ని ఒక చోటికి చేర్చారు. అప్పుడు నెమ్మదిగా నడిచి వచ్చింది ముసలాయన భార్య- కాళ్లకు ఉన్ని గుడ్డలు కట్టుకుని, చెట్ల బెరడుతో చేసిన పాదరక్షలతో. ఆమె నడకకు కింద మంచు పగిలింది.

"ఇటుకలు ఎక్కడికో తోలేదుందట, పెద్ద

రైతు రమ్మని కబురు పెట్టాడు" అందావిడ ధాన్యం దగ్గిరకు వూడ్చి.

"సరే, నువ్వు బండి కట్టుకుని పో. జాగ్రత్త, మళ్లీ నన్ను చిక్కుల్లోకి లాగకు. పీటర్ లేకపోవటంతో, చెయ్యి విరిగినట్టుగా వుంది" అంటూ అకీంను మందలించాడు వృద్ధుడు.

"ఇంట్లో వున్నంతకాలం వాణ్ణిమాత్రం దెప్పిపొడవలేదా ఏమిటి? ఇప్పుడు నన్నంటున్నావు" అన్నాడు అకీం.

"నిన్నెంత తిట్టినా తక్కువే. పీటర్‌కూ నీకూ పోలికేమిటి? " అంది తల్లి.

"సరేలే, పోతున్నాను" అన్నాడు కొడుకు.

"తాగుబోతా, సరేలే అంటున్నావా!"

"ఇక మీ సాధింపులు ఆపుతారా? " అంటూ విసుక్కుంది కోడలు.

పీటర్ యిల్లు వదిలినప్పటి నుండీ, తండ్రీకొడుకుల మధ్య ఈ సూటి పోటీ మాటలు కొనసాగుతూనే వున్నాయి. అప్పుడు కూడా గొడ్డులా పనిచేసే కొడుకును దూరం పంపి, పనికి బద్ధకించే అడ్డగాడిదను యింట్లో పెట్టుకున్నాననే అనుకున్నాడు. అయితే యిలా చెయ్యటానికి ఒకే ఒక్క కారణముంది. పెద్దవాడికి నలుగురు పిల్లలున్నారు. పీటర్‌కు ఒక్కడే చంటిపిల్లాడు. కాని వాడు మహా పనిమంతుడు.



క్షణం విరామమెరుగక, రోజంతా పనిచేస్తాడు. ఇతర్ల పనికూడా తనమీద వేసుకుంటాడు. చెట్లు నరకాలన్నా, కట్టెలు కొట్టాలన్నా నాగలి పట్టాలన్నా, బండిలో ధాన్యం నింపి పక్కవూళ్లకు తోలాలన్నా, అన్నీ తానే చేస్తాననేవాడు. చేతికంది వచ్చిన కొడుకును వదులుకున్నందుకు ముసలాయన నిట్టూర్చాడు. సైన్యంలో చేరటమంటే ఆ రోజుల్లో చావుతో సమానం. సైనికుడంటే విరిగిన కొమ్మ. తలచుకొంటే గుండె చెరువవుతుంది. పెద్దకొడుకును మందలించటానికి ములుగర్రలా మాత్రమే వాణ్ణిప్పుడు తలచుకుంటున్నాడు. తల్లి కూడా కొడుకును తలచుకుని దుఃఖించని రోజులేదు. ఇప్పటికి ఏడాది దాటింది. అక్కడ ఎలాగుంటున్నాడో, కాసింత డబ్బు పంపించమని చాలాసార్లు చెప్పి చూసింది. కాని ముసలాయన 'చూద్దాంలే' అంటూనే వున్నాడు.

వాళ్లు సంపన్న రైతులే. ముసలాయన పొదుపుగా బతికి బాగానే వెనకేశాడు. కాని ఎంత అవసరమొచ్చినా సరే, పైసా విదల్చడు.

ఇప్పుడు మళ్లీ చిన్నకొడుకు ప్రస్థావన రావటంతో, ఎలాగైనా ఓట్స్ అమ్మిన తర్వాత, వాడికి ఓ రూబుల్ పంపించమని పట్టుబట్టాలనుకుంది. అందరూ ఎవరి పనులమీద వాళ్లు వెళ్ళిపోయిన తర్వాత భర్తతో మొండికేసి, పంట అమ్మిన తర్వాత రూబుల్ పంపటానికి ఒప్పించింది. మూడు స్లెడ్జిబళ్లలో తొంభై ఆరు బుషెల్‌ల ధాన్యం నింపి, పైన గోతాంగుడ్డ కప్పి, ప్రయాణానికి సిద్ధం చేసినప్పుడు చర్చి గుమస్తాతో తను

రాయించిన ఉత్తరం భర్త చేతికిచ్చి, టౌనుకు చేరగానే, ఆ వృత్తరంతోపాటు రూబుల్ కూడా సరైన చిరునామాకు చేరే టట్టుగా చూడాలని చెప్పింది.

కొత్త గొర్రెతోలు అంగరఖా తొడుక్కుని, దానిమీద ఇంట్లోనేసిన మరో గుడ్డ చుట్టుకుని, కాళ్లకు తెల్లటి పట్టీలు కట్టుకుని వృత్తరం పర్సులో పెట్టుకుని, ప్రార్థన చేసి ముందరి స్లెడ్జిబండిలో కూర్చుని టౌనుకు బయల్దేరాడు ముసలాయన. చివరి బండిలో అతడి మనవడు కూర్చున్నాడు. టౌను చేరుకుని, సత్రం యజమాని చేత వృత్తరం చదివించుకుని విని సంతోషించాడు.

ఉత్తరంలో తల్లి మొదట అతణ్ణి ఆశీర్వదించి, తర్వాత అభినందించి, చిన్న చిన్న యింటి విషయాలు రాసి, అతడి భార్య అక్సిన్యా తమ దగ్గర వుండటానికి యిష్టపడలేదనీ, మరోచోట ఎక్కడో పనిచేసుకుని బతుకుతున్నా చక్కగా కట్టుబాట్లలోనే వుంటున్నదనీ చెప్పింది. ఆ తర్వాత రూబుల్ పంపిస్తున్న విషయం కూడా చెప్పి 'తనను తలచుకుంటూ బోరుమంది' అని రాశాడు చర్చి గుమాస్తా. కానీ పీటర్‌కే వృత్తరం చేరలేదు. భార్య వేరుగా వుంటున్న విషయం తెలియదు. రూబుల్ అందలేదు. ఉత్తరంతో సహా అదికూడా తిరిగి వచ్చింది. జార్ చక్రవర్తినీ, మాతృభూమినీ, సనాతన క్రైస్తవమతాన్నీ రక్షించే మహాకార్యంలో పీటర్ యుద్ధంలో మరణించాడు. అదీ వాళ్ళకు చేరిన సందేశం.

వార్త విని తల్లి శోకాలు పెట్టింది. గుండెలు బాదుకుని ఏడ్చింది- తీరిక దొరికినప్పుడల్లా. కాని పని ఆగదు. మరుసటి

ఆదివారం, చర్చిలో పీటర్ పేర ప్రత్యేక ప్రార్థనలు చేయించింది. అందరికీ రొట్టె ముక్కలు పంచిపెట్టింది.

ఏడాదిపాటే కలిసి సంసారం చేసినా, అక్సీన్యా కూడా వెక్కివెక్కి ఏడ్చింది. అతడి అందమైన రూపాన్ని, ప్రేమను తలచుకుని కుమిలిపోయింది. తన కొడుకు వంకాను అనాథను చేసినందుకు కోపం తెచ్చుకుంది. అన్నమీద వున్న ప్రేమ, కట్టుకొన్న పెళ్లాం మీద, కన్నకొడుకుమీద లేదా! ఊరూపేరూ తెలియని కొత్త మనుషుల మధ్య తాను బతకాలా?

అయినా ఒకందుకు ఆమె సంతోషించింది. కిరాణాకొట్టు యజమానివల్ల తను రెండోసారి గర్భం దాల్చింది. ఈ పనిచేసినందుకు యిప్పుడు తననెవరూ నిందించరు. భర్త మరణించాడని చెబితే అతడు తనను తప్పక పెళ్లి చేసుకుంటాడు.

మైఖేల్ సెమెనోవిచ్ వొరొంట్సోవ్ (ఇప్పటికే మనకు తెలిసిన సైమన్ వొరొంట్సోవ్‌కు తండ్రి) రష్యన్ రాయబారిగా పనిచేశాడు. ఇంగ్లండులో చదువుకున్నాడు. ఇలా విదేశీ విద్యనభ్యసించడం, ఆనాటి రష్యన్ అధికారుల్లో ఒక అపురూపమైన విషయం. అతడికి అధికారదాహం ఎక్కువ. కిందివాళ్లతో దయగా, ప్రేమగా, పైవాళ్లతో వినయంగా వుంటాడు. అధికారానికి లొంగివుండాలి. లేదా అధికారం చలాయించాలి. ఇలా తప్ప, అతడికి ఈ జీవితం మరోలా అర్థం కాదు. అత్యున్నత పదవులు, గౌరవాలు అతణ్ణి వరించాయి. క్రాస్నో వద్ద నెపోలియన్‌ను పరాజితుడిని చేసిన కమాండర్‌గా అతడికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

1852లో అతడికి డెబ్భై దాటాయి. అయినా అంత వయస్సున్నట్టు కనిపించడు. వైస్‌రాయ్‌గా పెద్దజేతం వస్తుంది. తన ఆస్తి, తన భార్య (కౌంటెస్ బ్రాంటిస్కీ) ఆస్తి కలిసి ఎంతుంటుందో ఎవరికీ తెలియదు. క్రిమియాలో సముద్రతీరాన, విశాలమైన గార్డెన్‌లో ఒక రాజమహల్ లాంటిది కట్టించాడు.

డిసెంబర్ 4 నాటి సాయంత్రం, మూడు గుర్రాలు లాగిన ఒక బండీ వచ్చి, టిఫ్లిస్‌లోని అతడి మహల్ ముందు ఆగింది. దుమ్ము కొట్టుకుపోయిన ఒక అధికారి, కోచ్‌లోంచి దిగి ఒళ్లు విరుచుకున్నాడు. దూరప్రయాణం చేసివచ్చాడేమో అలసటగా వుంది. హాజీమురాద్‌ను అప్పగించటానికి, జనరల్ కొజ్లోవ్‌స్కీ పంపగా వచ్చాడతడు. అప్పటికి ఆరైంది. వొరొంట్సోవ్‌కది డిన్నర్ టైం. ఆగంతకుడి విషయం తెలిసింది. మొదట వ్యవహారం ముగించాడు. భోజనం కాస్త ఆలస్యమైనా ఫరవాలేదు.

అతడు డ్రాయింగ్ రూంలోకి ప్రవేశించగానే తను డిన్నర్‌కు ఆహ్వానించిన ముప్ఫైమంది అతిథులూ, ప్రిన్సెస్ సవెరెవ్నా వొరొంట్సోవ్నా అభివాదం చేశారు. నల్లటి మిలిటరీ దుస్తుల్లో హుందాగా కనిపించాడు వొరొంట్సోవ్.

షేవ్ చేసుకున్న అతని మొహంలో చిరునవ్వు వెలిగింది. కళ్లు అందర్నీ ప్రేమగా పలకరించాయి. ఆహూతులను లోపలికి ఆహ్వానించి, డైనింగ్ టేబుల్

వద్ద ఆసీనులుకమ్మని అర్థించాడు.

విందు ప్రారంభమైంది. అందరూ సూప్ తాగుతున్నారు. అప్పుడు సంచలన ప్రకటన చేశాడు ఒక జనరల్. కొన్నాళ్లుగా మంతనాలు జరుగుతున్న విషయం తనొక్కడికే తెలుసు. అదేమంటే చెచెన్ నాయకుడు షామిల్‌కు నమ్మినబంటు, అత్యంత ధైర్యవంతుడు, అత్యంత ప్రముఖుడు అయినటువంటి హాజీమురాద్ రష్యన్ పక్షం వచ్చి చేరాడు.

ఆశ్చర్యంగా తలెత్తి చూశారు అతిథులు.

"జనరల్, ఇంతవరకు మీరెప్పుడైనా హాజీమురాద్‌ను కలిశారా? " అంటూ ముద్దముద్దగా ప్రశ్నించిందో ప్రిన్సెస్.

"ఓ యస్. చాలాసార్లు"

1843లో చెచెన్లు గెర్గెబెల్ మీద పట్టు సాధించిన తర్వాత జనరల్ పాలెన్ సేనలను తరిమికొట్టి, తన కళ్లముందే జోలోటూఖిన్‌ను హాజీమురాద్ ఎలా చంపిందీ కళ్లక్కట్టినట్టు చెప్పాడు జనరల్.

మౌనంగా అంతా విన్నాడు వొరొంట్సోవ్. అప్పుడప్పుడూ మర్యాదగా నవ్వాడు. కాని తరువాత ముఖ కవళికలు మారిపోయాయి. అతడి వైపే చూస్తూ, హాజీమురాద్‌తో తన రెండవ ఎన్‌కౌంటర్ వివరించాడు జనరల్.

"మీకు బాగా జ్ఞాపకముండేవుంటుంది. మొన్నటికిమొన్న మీమీద దాడిచేయించింది అతడే. మిమ్మల్ని రక్షించటానికి వచ్చిన సైనికదళం కూడా బాగా నష్టపోయింది"

"ఎక్కడ? " అన్నాడు వొరొంట్సోవ్ అర్థం కానట్టు. దార్గో యుద్ధాన్ని ప్రస్తావించాడు జనరల్. అదనపు సైన్యం రాకపోయుంటే వొరొంట్సోవ్ బలగాలు మిగిలివేకావు. వొరొంట్సోవ్ సిగ్గుతో, అవమానంతో తల దించుకోవాల్సిన క్షణమది. కాని ఆ దార్గో యుద్ధంలో తాము విజయం సాధించామని జార్ చక్రవర్తికి నివేదిక పంపాడు వొరొంట్సోవ్. అసలు విషయం అందరికీ అర్థమైనా, అర్థంకానట్టు జనరల్ వైపు చూశారు అతిథులు.

తర్వాత ఆ యుద్ధంలో హాజీమురాద్ ఏవిధంగా పైచేయి సాధించాడో సవిస్తరంగా వివరించాడు. ప్రతిసారీ 'రక్షణకు అదనపు బలగాలు సకాలంలో చేరనట్లయితే' అని నొక్కి పలికాడు.

వొరొంట్సోవ్‌కు ముళ్లమీద కూర్చున్నట్లుగా వుంది. ఎలాగైనా విషయం మార్చాలని "టిఫ్లిస్‌లో తన అధికార నివాసం సుఖంగా వుందా? " అని అడిగిందో ప్రిన్సెస్. ఈ వూహించని ప్రశ్నకు ఆశ్చర్యపోయి, ఏం చెప్పాలో తెలియక, అందరి మొహాలూ ఒకసారి పరిశీలించి, తన ముందు ప్లేట్‌లో వున్నదేదో గబగబా మింగేశాడు జనరల్.

అందరూ కాస్త యిబ్బందిగానే చూశారు. పెద్దాయన మాటలకు అడ్డుపడటం మర్యాద కాదు. అయితే జార్జియాకు చెందిన ఒక ప్రిన్స్- మహా మూర్ఖుడు. ఎప్పుడేం మాట్లాడాలో తెలియదు. అతడు అత్యుత్సాహంగా ఓ పిట్టకథ చెప్పటంతో వాతావరణం కాస్త తేలికపడింది. ఒకసారి అహమద్ ఖాన్‌కు చెందిన వితంతువును హాజీమురాద్ ఎలా ఎత్తుకెళ్లాడో రసవత్త

రంగా వినిపించాడతడు.

"ఒకరాత్రి మెహతులి గ్రామానికి వచ్చి, తనక్కావలసిన మనిషిని అలా చేతుల్లో ఎత్తి పట్టుకుని, తన అనుచరులతో గుర్రం మీద ఉడాయించాడు"

"ఆవిడ మీదే ఎందుకు మనసుప డ్డాడు? " అని అడిగింది ప్రిన్సెస్.

"ఆవిడ భర్త అతడి శత్రువు. అతడిపై విజయం సాధించలేని హాజీమురాద్ తన ప్రతీకారం అలాగ తీర్చుకున్నాడు"

ప్రిన్సెస్, ఈ మాటల్ని తన పక్కన కూర్చున్న కౌంటెస్‌కు, ఫ్రెంచిలోకి అనువ దించి చెప్పింది.

"ఆమెనేం చేశాడింతకూ? " అని ఫ్రెంచిలో అడిగింది కౌంటెస్.

"ఆమెతో చాలా మర్యాదగానే ప్రవర్తిం చాడు. తరువాత విడుదల చేశాడని కూడా తెలిసింది" అన్నాడు వొరొంట్సోవ్ చిరున వ్వుతూ.

"అవును, విడుదల కోసం డబ్బులు బాగానే డిమాండ్ చేశాడు"

"మొత్తంమీద గౌరవప్రదంగానే వ్యవహ రించాడు"

అలా వొరొంట్సోవ్ మాటలతో సంభా షణ కొత్తదారి పట్టింది. హాజీమురాద్‌కు ప్రాముఖ్యం పెంచి మాట్లాడితే, పెద్దాయన సంతోషిస్తాడని టేబుల్ వద్ద కూర్చున్న వాళ్లు తెలుసుకున్నారు.

"కాని, మహా మొండిమనిషి. ఆత్మాభి మానం మెండు. మొత్తం మీద గట్టి వాడు"

"అంతెందుకూ 1849లో అతడు 'తెమిర్ ఖాన్‌షురా' గ్రామం మీద దాడిచేసాడు. పట్టపగలే దుకాణాల మీద పడి, దొరికిం దల్లా దోచుకెళ్లాడు"

ఆ సమయంలో తెమిర్‌ఖాన్‌షురాలో వున్న ప్రత్యక్ష సాక్షి ఒకరు (ఇతడో ఆర్మీ నియన్) పూసగుచ్చినట్టు ఆనాటి దాడిని వర్ణించాడు.

నిజానికి విందులో హాజీమురాద్ గురించి తప్ప మరొక విషయమే ప్రస్తా వించలేదెవరూ.

అందరూ అతడి ధైర్యాన్ని, శౌర్యపరాక్ర మాలను, ఉదాత్త స్వభావాన్నీ పొగిడిన వాళ్లే. ఒకరెవరో ఇరవయ్యారుమంది బం దీలను నిర్దాక్షిణ్యంగా చంపించాడన్నారు. కాని మిగతావాళ్లు "అవును మరి, అలాంటి పరిస్థితుల్లో ఎవరు మాత్రమేం చేస్తారు? " అంటూ అతణ్ణే సమర్థించారు.

"అతడు మహానుభావుడు!"

"యూరోపులో గనక జన్మించి వుంటే నెపోలియన్ అంత గొప్పవాడయ్యేవాడు" అంటూ జార్జియన్ ప్రిన్స్ అతణ్ణి ఆకాశాని కెత్తేశాడు.

'నెపోలియన్' అనేమాటను వొరొం ట్సోవ్ బాగా యిష్టపడతాడని అతడికి తెలుసు. నెపోలియన్‌ను పరాజితుణ్ణి చేసి నందుకు చిహ్నంగా మెడమీద 'తెల్లక్రాస్' ధరిస్తాడు వొరొంట్సోవ్.

"నెపోలియన్ అంత కాకపోయినా, గొప్ప కమాండర్ అనొచ్చు" అన్నాడు వొరొంట్సోవ్.

"నెపోలియన్ కాకపోతే మురాద్"

"అతడి పేరు హాజీ మురాద్"

"హాజీమురాద్ లొంగిపోయాడు. ఇక త్వరలోనే షామిల్ కథ కూడా ముగుస్తుంది"

"త్వరలో కాదు. అతి త్వరలో"

ఇలా వ్యాఖ్యానించటంలో అతని ఉద్దేశం 'వొరొంట్సోవ్ నాయకత్వంలో' అని

పొగడ్తలు ఆగలేదు. వొరొంట్సోవ్ దీనికి అడ్డుకట్ట వెయ్యాలనుకున్నాడు. కాని అలాంటి కబుర్లు వినటం సరదాగానే వుంది. తృప్తిగా భార్యతో కలిసి డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు.

డిన్నర్ తర్వాత కాఫీ సర్వ్ చేశారు. ఆ తర్వాత పేకాట ప్రారంభమైంది. బంగారపు నశ్యపు డబ్బా మీద అలెగ్జాండర్ బొమ్మ వున్న మూత తీయబోతున్నప్పుడు వొరొంట్సోవ్‌నెవరో పిలిచారు. తను ఇక పేకముక్కలు పంచటమే తరువాయి.

ఇటాలియన్ సేవకుడు "మరో ఆగంతుకుడు, యువర్ ఎక్సెలెన్సీ" అంటూ ప్రకటించాడు.

పేకముక్కలు కిందపడేసి తనకు వచ్చిన లేఖను తెరిచి చూశాడు వొరొంట్సోవ్. అది కొడుకు రాసింది. హాజీమురాద్ లొంగుబాటు, అంతకుముందు జరిగిన ఘర్షణ గురించి సుదీర్ఘంగా వివరించాడందులో.

ఏం రాశాడంటూ అడిగింది అతడి భార్య.

"అదే విషయం. అంతా మనమంచికే అనుకోవాలి" అంటూ వుత్తరాన్ని భార్యకు అందజేశాడు.

మనసు తేలికగా వుంది. సంతోషం చెప్పలేనట్టుగా వుంది. అలాంటప్పుడతడు చిటికెడు ఫ్రెంచి నశ్యం పీలుస్తాడు.

★ ★ ★

మరుసటి రోజు ఉదయం హాజీమురాద్ చేరుకునేటప్పటికే వొరొంట్సోవ్ వెయిటింగ్ రూం వివిధ విజ్ఞప్తులతో వచ్చిన జన సందోహంతో కిటకిటలాడుతోంది. నిన్న సరదాగా, పూలరంగడిలా కనిపించిన మనిషి ఈరోజు యూనిఫాంలో, సైనిక లాంఛనాలతో అధికార దర్పంతో కనిపించాడు. ప్రభుత్వ నిధులను స్వంతానికి వాడుకుని కోర్ట్ మార్షల్‌కు రెడీగావున్న కమాండర్ ఒకడు దిగులుగా నిల్చున్నాడు. వోడ్కా అమ్మకం మీద తనకే గుత్తాధిపత్యం ఇచ్చిన అనుమతిని కొనసాగించాలని అభ్యర్థిస్తూ వచ్చిన ఆర్మీనియన్ కూడా ఏలిన వారి దర్శనం కోసం నిరీక్షిస్తున్నాడు.

యుద్ధంలో మరణించిన ఒక ఆఫీసర్ భార్య పెన్షన్ ఇంకా మంజూరు కాలేదని వచ్చింది. పిల్లలకు స్కూలు ఫీజు కూడా కట్టలేకపోతున్నది! చర్చి ఆస్తులను కొన్ని తనకు బదలాయించాలని (ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తులు) అర్జీ పెట్టుకోవటానికి వచ్చాడొక జార్జియన్ ప్రిన్స్. కాకసస్ ప్రాంతంలో అల్లర్లు అణిచి, లొంగదీసుకోవటానికి సరికొత్త ప్రణాళికతో నిరీక్షిస్తున్నాడొక అధికారి. వొరొంట్సోవ్ దర్శనం లభించిందని ఇంటివద్ద చెప్పుకోవచ్చనే ఒకే ఒక కారణంతో వచ్చాడొక ఖాన్.

అందరూ తమ వంతుకోసం నిరీక్షిస్తూ ఉన్నారు. ఒక వైపు నుండి అతని ఛేంబర్‌లోకి ప్రవేశించి, మరోవైపు నుండి వచ్చేస్తున్నారు.

హాజీమురాద్ వెయిటింగ్ రూంలోకి ప్రవేశించగానే అందరూ అతడి మీదే దృష్టి కేంద్రీకరించారు. అతడు కొద్దిగా కుంటుతాడు. అది కూడా వాళ్లను ఆకర్షించింది. గుసగుసలాడుతున్నారు.

మెడచుట్టూ వెండి లేసుతో అల్లిన బియన్‌మీద తెల్లటి, పొడుగాటి సర్కేషియన్ కోటూ, కాళ్లకు నల్లటి మేజోళ్లూ (లెగ్గింగ్స్) అవే రంగుబూట్లూ వేసుకుని వచ్చాడు. తలమీది టోపీ టర్బన్‌లా కనిపించింది. అతడి జీవితం మలుపు తిరిగింది ఈ టర్బన్ వల్లే. ఇది పెట్టుకున్నందుకు అహమద్‌ఖాన్ అతణ్ణి నిందించాడు. తరవాత ఇదే కారణంగా జనరల్ క్లూగనౌ అరెస్టు చేశాడు. వీళ్లమీది కోపంతో తను షామిల్ పక్షం చేరిపోయాడు.

వెయిటింగ్ హాల్‌లో ఠీవిగా నడిచాడు హాజీమురాద్. అతడి కుంటి నడకలో కూడా ఒక రాజసం వుంది. అతడి కళ్లు వొరొంట్సోవ్ ఛేంబర్ మీద వున్నాయి. హాల్లో వున్న అంతమందీ తననే చూస్తున్నారన్న సంగతి అతడికి పట్టలేదు.

ప్రిన్స్ సహాయకుడు లారిస్ మెలికోవ్ ఛేంబర్ నుండి బయటికి వచ్చి స్వయంగా హాజీమురాద్‌ను వెంటతీసుకుని లోపలికి వెళ్లాక, తన స్థానంలో లేచి నిల్చుని అతిథిని ఆహ్వానించాడు వొరొంట్సోవ్. అతను కమాండర్-ఇన్-చీఫ్ కూడా. మొహంలో నిన్నటి చిరునవ్వు లేదు, అధికారుల్లో కనిపించే కాఠిన్యమే తప్ప.

ఛేంబరులో కిటికీలకు ఆకుపచ్చ వెనెషియన్ బ్లైండ్‌లున్నాయి. ఛాతీమీద రెండు చేతులూ పెట్టుకుని, కళ్లు వాల్చుకుని, నెమ్మదిగా స్పష్టంగా, తన కుమిక్ మాండలికంలో మాట్లాడాడు హాజీమురాద్.

"మహా ఘనత వహించిన, మహాపరాక్రమశీలి అయిన జార్ చక్రవర్తికి నన్ను నేను సమర్పించుకుంటున్నాను. ఇక నుండీ ఆయన రక్షణలో వుంటాను. ఆయన సేవలోనే శేషజీవితం గడుపుతాను. నా చివరి నెత్తుటి బొట్టు కూడా ఆయన కోసమే అర్పిస్తాను. ఇకనుండీ షామిల్ - మీకూ, నాకు కూడా శత్రువే. అతనితో జరిగే యుద్ధంలో నేను నా ప్రాణాలొడ్డటానికి సిద్ధంగా వున్నాను"

దుబాసీ రష్యన్‌లోకి అనువదించాడు. వొరొంట్సోవ్, హాజీమురాద్ ఒకర్నొకరు చూసుకున్నారు.

మాటల్లో చెప్పలేనిదీ, దుబాసీ అనువదించలేనిదీ ఆ చూపుల్లో వ్యక్తమైంది. వాస్తవమేమిటో ఇద్దరికీ తెలుసు. 'హాజీ మురాద్ చెప్పిన మాట ఒక్కటీ నమ్మలేదు వొరొంట్సోవ్. రష్యన్‌లకు అతడెప్పుడూ శత్రువే. అనివార్యమైన పరిస్థితుల్లో లొంగిపోయాడు. అనివార్యమైన పరిస్థితుల్లో తామూ ఆ లొంగుబాటు అంగీకరించక తప్పలేదు' అన్నాయి వొరొంట్సోవ్ కళ్లు. తనను నమ్మవచ్చునన్నాయి హాజీమురాద్ కళ్లు. 'వయసుమీరిన ఈ జనరల్ మరణం గురించి ఆలోచించక, యుద్ధ వ్యూహాలెందుకు రచిస్తున్నాడు? ఈ జిత్తులమారితో జాగ్రత్తగా వ్యవహరించాలి' అనుకున్నాడు హాజీమురాద్. వొరొంట్సోవ్‌కి ఈ విషయం కూడా బాగానే అర్థమైంది. కాని యుద్ధసన్నాహాలు చేస్తున్నప్పుడు పరస్పర విశ్వాసం ప్రకటించుకోక తప్పదు.

'చక్రవర్తిగారు మహా దయాళువు. నేను అభ్యర్థిస్తే సైన్యంలో చేర్చుకుంటాడు' అని చెప్పమని దుబాసీని ఆదేశించాడు వొరొంట్సోవ్. ఆ తర్వాత హాజీమురాద్ వైపు చూస్తూ "చక్రవర్తిగారి నిర్ణయం వచ్చేదాకా అతడు నా అతిథిగా వుంటాడు. అతిథికి జరగవలసిన మర్యాదలన్నీ జరుగుతాయి" అన్నాడు.

చేతులు ఛాతీకి నొక్కుకుని హాజీమురాద్ వుద్రేకంగా ఏదో చెప్పగా దుబాసీ ఇలా అనువదించాడు.

"1839లో అవేరియాకు అధికారిగా వున్నప్పుడు రష్యన్లకు సేవ చేశాను. అహమద్‌ఖాన్ నా గురించి జనరల్ క్లూగెనౌకు పితూరీలు చెప్పకుండా వుంటే షామిల్‌తో జతకట్టేవాణ్ణే కాను"

"తెలుసు, తెలుసు" అంటూ ప్రిన్స్ సోఫాలో కూర్చొమ్మని చేయి చూపించాడు. కాని హాజీమురాద్ కూర్చోలేదు. అంత పెద్దవాడి ముందు తను కూర్చోలేనన్నట్లుగా భుజాలు ఎగరేసి తల వంచుకున్నాడు.

కాసేపటికి మళ్లీ "అహమద్‌ఖాన్, షామిల్ ఇద్దరూ నా శత్రువులు. ఇప్పుడు అహమద్‌ఖాన్ లేడు. అందువలన అతడి మీద ప్రతీకారం తీర్చుకోలేను. కాని షామిల్ బతికేవున్నాడు. అతణ్ణి చంపే దాకా నా పగ చల్లారదు" అన్నాడు.

"ఇంతకూ ఎలా పగ తీర్చుకుంటాడు? కూర్చొమ్మను" అన్నాడు ప్రిన్స్, దుబాసీతో.

కూర్చొనటానికి నిరాకరించి 'నేను రష్యన్లతో చేరిందే, షామిల్ మీద ప్రతీకారం తీర్చుకోవటానికి' అన్నాడు హాజీమురాద్.

"అంతా బాగానే వుందిగాని, ఏం చెయ్యదలుచుకున్నాడో చెప్పడం ముఖ్యం" అన్నాడు ప్రిన్స్.

ఈసారి హాజీమురాద్ సోఫాలో కూర్చుని, తనకు రష్యన్ సైన్యం తోడుగా వుంటే దాగెస్తాన్‌లో అల్లకల్లోలం సృష్టించి, షామిల్‌కు నిలువనీడ లేకుండా చేయటం ఖాయమని చెప్పాడు.

"ఎక్సెలెంట్! ఆలోచిస్తాను" అన్నాడు ప్రిన్స్.

"సర్దార్ వొరొంట్సోవ్‌కు మరో మాట కూడా చెప్పండి.. నా కుటుంబం షామిల్ ఆధీనంలో ఉంది. వాళ్ళక్కడ వున్నంత వరకూ, నేను మీకు సేవ చేయలేను. నేను

బహిరంగంగా అతడి మీద తిరుగుబాటు చేస్తే షామిల్ నా భార్యనూ, తల్లినీ, పిల్లల్నీ చంపేస్తాడు. మనం పట్టుకున్న షామిల్ తరపు బందీలను, నా కుటుంబ సభ్యులను మార్చుకుంటే, ఆ తర్వాత నేను షామిల్‌ను తప్పక చంపుతాను. లేదా చస్తాను" అన్నాడు హాజీమురాద్.

"ఆలోచిస్తాను"

వొరొంట్సోవ్‌తో హాజీమురాద్ తొలి యింటర్వ్యూ అలా ముగిసింది.

ఆ సాయంత్రం వొరొంట్సోవ్ ఓ ఇటాలియన్ ఒపెరాను ఆనందిస్తున్నప్పుడు, హాజీమురాద్ కూడా వచ్చి ముందు వరుసలో కూర్చున్నాడు. కాని ఆ నృత్యనాటికలో ఆసక్తి కనపర్చలేదు. మధ్య మధ్య లేచి నిలబడి అందరి దృష్టినీ ఆకర్షించాడు.

మరుసటి రోజు సాయంత్రం వొరొంట్సోవ్ నివాసంలో యథావిధిగా మరో విందుపార్టీ జరిగింది. అందమైన పడతులు కురుచ దుస్తులతో అర్ధనగ్నంగా వచ్చారు. మెడ, చేతులు, వక్షోజాల మీద ఆచ్ఛాదన సరిగా లేదు. యువకులు వాళ్ళను ఆలింగనం చేసుకున్నారు. బఫె ప్రారంభమైన తర్వాత షాంపేన్ ప్రవహించింది. స్త్రీలకు మిఠాయి అందించారు. వృద్ధురాలైన 'సర్దార్' భార్యకూడా అర్ధనగ్నంగా వచ్చి అందరితో కలిసిపోయింది. పరిస్థితిని హాజీమురాద్‌కు వివరించి చెప్పటానికి ప్రయత్నించాడు దుబాసీ. అయినా ఆ వాతావరణం అతడికి నచ్చలేదు. దుస్తులు సరిగా ధరించని పడతులు, అతడికి సమీపంగా వచ్చి నిలబడి పరిచయం చేసుకోవాలన్నట్టుగా చిరునవ్వు నవ్వారు! 'తామంటే ఇష్టమేనా?' అని వాళ్ల ప్రశ్న. తనకు వీళ్ళంటే ఇష్టమా? భుజాలమీదా, ఛాతీ మీదా బంగారు పతకాలు ధరించిన జనరల్ వొరొంట్సోవ్ కూడా చివరికి అదే అడిగాడు. "ఈ పార్టీ నీకు నచ్చలేదా?" ఇంత సంపద, విలాస జీవితం, సుందరాంగనల సాంగత్యం, మధువు నచ్చని మనుషులుంటారా? అనేది ఆయన ఉద్దేశం కాబోలు. తన అభిప్రాయం చెప్పకుండా "మా ఇళ్లల్లో ఇలాంటివి వుండవు" అన్నాడు హాజీమురాద్.

విందులో సరదాగా గడుపుతున్న వొరొంట్సోవ్‌తో మరోసారి తన కుటుంబాన్ని రక్షించాలని ప్రస్తావించాడు. అయితే వొరొంట్సోవ్ ఆ మాటలు వినిపించనట్టుగా మరెవరితోనో మరేవో కబుర్లలో మునిగిపోయాడు.

రాత్రి పదకొండు దాటింది. 'తను నిష్క్రమించవచ్చా?' అని లారిస్ మెలికోవ్‌ను అడిగాడు హాజీమురాద్. 'వెళ్లితే ఫరవాలేదుగాని ఉంటే బాగుంటుంది' అన్నాడతడు. అయినప్పటికీ తన కోసం నిరీక్షిస్తున్న బండి ఎక్కి నివాసానికి చేరుకున్నాడు హాజీమురాద్.

★ ★ ★

హాజీమురాద్ అప్పటికి టిఫ్లిస్‌కు చేరి అయిదురోజులు. ఒక ఉదయం వొరొంట్సోవ్ ఆదేశానుసారం లారిస్ మెలికోవ్ వచ్చి పలకరించాడు.

"సర్దార్‌కు సేవచేసే అవకాశంకోసం నిరీక్షిస్తున్నాను" అన్నాడు హాజీమురాద్ వినయంగా, లౌక్యంగా. ఆ తర్వాత మరోసారి తలదించుకుని "ఆజ్ఞాపించండి" అన్నాడు.

కుర్చీ హాజీమురాద్‌కు సమీపంగా జరుపుకుని "నీ గత జీవితం గురించిన పూర్తి సమాచారం తెలుసుకోవాలనుకుంటున్నారు వైస్‌రాయ్. అతనికిప్పటికే తెలియదని కాదు. కాని నీ నోటితో నువ్వు చెబితే మరోసారి తెలుసుకోవాలనుకుంటున్నారు. అన్నాడు లారిస్ మెలికోవ్. అతడు టార్టార్ భాష ధారాళంగా మాట్లాడగలడు.

"నువ్వు చెబితే నేను దాన్ని రష్యన్‌లో రాసుకుని ఆయనకు చూపిస్తాను. ఆ తర్వాత ఆయన దాన్ని చక్రవర్తికి పంపుతారు"

ఎవరి మాటకూ అడ్డుపడకపోవటం హాజీమురాద్ ప్రత్యేకత. అతడు చెప్పిందంతా ఓపిగ్గా విని "చెబుతాను" అన్నాడు. తన జీవితకథ చక్రవర్తి కూడా చదువుతాడంటే గర్వంగా ఉంది.

"ఏదీ వదిలిపెట్టకుండా ఉన్నదున్నట్టుగా చెప్పాలి" అంటూ జేబులోంచి నోట్‌బుక్ తీశాడు లారిస్-మెలికోవ్.

"మొదటి నుండీ చెప్పనా? "

"మొట్టమొదటి నుండీ.. ఎక్కడ పుట్టావు? ఎప్పుడు పుట్టావు? "

సోఫాలో వెనక్కువాలి కూర్చుని, ఓ పొడుగాటి కర్ర తీసుకుని చాకుతో దాన్ని చెక్కుతూ తన కథ ప్రారంభించాడు హాజీ మురాద్.

"రాసుకోండి, పుట్టింది సెల్మెస్‌లో. అదో కుగ్రామం. మా భాషలో చెప్పాలంటే గాడిద తలకాయంతుంటుంది. కుంజాక్ నుండి కొద్ది దూరంలో. కుంజాక్‌లో ఖాన్‌లుంటారు. వాళ్లకూ మాకూ దగ్గర సంబంధాలుండేవి. మా పెద్దన్న ఉస్మాన్ పుట్టినప్పుడు, మా అమ్మ ఖాన్‌లలో పెద్దవాడు అబునట్సల్ ఖాన్‌కు పాలదాయిగా ఉంది. ఆ తర్వాత రెండవవాడు ఉమ్మాఖాన్‌కు పాలిచ్చి పెంచింది. కాని మా రెండో అన్న అహ్మద్ చనిపోయాడు. నేను పుట్టినప్పుడు, వాళ్లకు బులాచ్‌ఖాన్ పుట్టాడు. ఈసారి మా అమ్మ వాళ్లింటికి పాలదాయిగా పోలేదు. మా నాన్న ఆజ్ఞాపించినా సరే, ఆమె ససేమీరా అంది. పరాయివాళ్ల పిల్లలకు పాలిచ్చి, నా కొడుకును చంపుకోలేను" అంటూ మొండికేసింది. పిచ్చి కోపంతో మా నాన్న, ఆమెను పొడిచి చంపబోయాడు. గాని ఇరుగుపొరుగులు వచ్చి రక్షించారు. ఆ తర్వాత ఆమె నా కోసం ఓ పాట కట్టింది. అదినేను చెప్పక్కర్లేదు..."

"అన్నీ చెప్పాల్సిందే నేను రాసుకుంటున్నాను."

హాజీమురాద్ ఆ రోజులు గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు. మట్టితో కట్టిన చిన్న ఇల్లు. తల్లి తనను ఫర్‌కోట్ మీద పడుకోబెట్టింది. తండ్రి బాకుతో ఎక్కడ గాయం చేశాడో చూపించమని అడిగాడు తల్లిని. అలా గుర్తుకువచ్చింది పాట.

'తళతళ మెరిసే బాకు నా గుండెల్లో దిగింది/ నా బాలభానుడు, నా బంగారు కొండను అక్కడే హత్తుకున్నాను/ ధారగా

కారిన నెత్తుటితో వాడు స్నానమాడాడు/ మందులు, మాకులు లేకుండానే ఆ గాయం మానింది/ చావంటే నాకు భయంలేదు/ నా కొడుకునూ అది భయ పెట్టలేదు'

మా అమ్మ యిప్పుడు షామిల్ చెరలో వుంది. ఆమెను రక్షించాలి" ఒక్కొక్కటీ జ్ఞాపకం వస్తున్నాయి.

కొండ కింద ఎప్పుడూ వూరే జలధార. తల్లి వేసుకున్న వదులు పైజామాను పట్టు కుని వెంట నడిచేవాడు. ఆమె నీళ్లకోసం వెళ్ళినప్పుడల్లా తను వెంట వుండాల్సిందే. మొదటిసారి ఆమె తన తలగొరిగినప్పుడు, తళతళా మెరిసే ఇత్తడి గిన్నెలో, తన ప్రతి బింబం చూసి, తనిలా ఉంటాడా అనుకుని ఆశ్చర్యపోయాడు. బక్కచిక్కిన కుక్క ఒక నాడు తన మొహం నాకింది. ఆకలిగా ఉన్నప్పుడు తల్లి యిచ్చిన తియ్యటి రొట్టెవాసన. బుట్టలో తనను పెట్టుకుని తల్లి తాత గారింటికి తీసికెళ్లిందొకసారి. ఆ నెరసిన జుత్తూ, ముడతలు పడిన తాత మొహం. ఆ వయసులోనూ సుత్తితో కొడుతూ వెండి రేకులు తయారు చేస్తున్నాడాయన.

మొత్తం మీద మా అమ్మ పాలదాయిగా పోలేదు. ఖాన్‌లు కొత్త పాలదాయిని పెట్టుకున్నారు. అయినా వాళ్లకు మా అమ్మంటే ప్రేమే. అప్పుడప్పుడూ మమ్మల్ని వాళ్లింటికి తీసుకెళ్లేది. అక్కడ వాళ్లపిల్లల తో ఆడుకునేవాళ్లం.

నాకు పదహారేళ్లున్నప్పుడు మురిద్‌లు మా వూళ్లకు రావటం ప్రారంభమైంది. 'ముసల్మాన్‌లారా! నాస్తికులకు, అవిశ్వాసు లకు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధం చెయ్యండి' ఇదీ వాళ్ల నినాదం. ఇదేవాళ్ల ప్రచారం. మొదట చెచెన్‌లు వాళ్లవైపు వెళ్లి పోయారు. తరువాత అవర్‌లుకూడా వాళ్ల ననుసరించారు. అప్పుడు నేను ఖాన్‌ల ఇంట్లో, వాళ్లలో ఒకడిగా బతుకుతున్నాను. వాళ్ళు బాగా సంపన్నులు. నాకూ బోలెడు డబ్బుండేది. అప్పటికే స్వంత గుర్రాలూ, ఆయుధాలూ ఉండేవి. ఇమాం కాజీమల్లా హత్య జరిగి, హంజద్ కొత్త ఇమాంగా వచ్చిందాకా ఆ విలాస జీవితం కొనసాగింది. ఒకనాడు హంజద్ తన మనుషులతో ఖాన్‌లకో సందేశం పంపాడు. అది సందేశం కాదు, బెదిరింపు. ఖాన్‌లందరూ పవిత్ర యుద్ధంలో చేరకపోతే వంశనాశనమే.

ఇది నిజంగా కీలక విషయమే. ఖాన్‌లకు రష్యన్లంటే భయం. పవిత్ర యుద్ధంలో చేరితే పరిణామాలు మరెంత భయంకరంగా వుంటాయో తెలియదు. ఇంటి యజమాని నన్నూ, తన రెండో కొడుకు ఉమ్మాఖాన్‌నూ టిఫ్లిస్ పంపించాడు. అక్కడ మేం రష్యన్ కమాండర్-ఇన్-చీఫ్ బేరన్ రోసెన్‌ను, హంజద్‌కు వ్యతిరేకంగా పని చెయ్యటంలో సహాయం కోసం అర్థించాలి. అతడు మమ్మల్ని చూడలేదు. సహాయం చేస్తానని కబురు పంపించాడు గాని ఏమీ చెయ్యలేదు. రష్యన్ ఆఫీసర్లు వచ్చి, ఉమ్మాఖాన్‌తో పేకాట ఆడి వెళ్లిపోయారు. అతడికి తాగుడు అలవాటు చేశారు. వెళ్లకూడని చోట్లకు తీసికెళ్లారు. పేకాటలో, యితర వ్యసనాలలో వున్నదంతా పోగొట్టుకున్నాడు ఉమ్మాఖాన్. అతడి శరీరం గట్టిదే. కాని ఆత్మ బలహీనం. తన గుర్రాలను, ఆయుధాలను కూడా పేకాటలో పోగొట్టుకునేవాడే- నేను అడ్డుపడకపోతే.

టిఫ్లిస్ అనుభవంతో నా అభిప్రాయాలు మారిపోయాయి. ఖాన్‌లను పవిత్ర యుద్ధంలో చేరవలసిందేనని సలహా యిచ్చాను"

"అభిప్రాయాలెందుకు మార్చుకున్నావు? రష్యన్ల ప్రవర్తన నీకు నచ్చలేదా? "

కాసేపు ఆలోచించి "నచ్చలేదు. అంతే

కాదు. పవిత్ర యుద్ధంలో చేరాలనుకోవటానికి మరో కారణం కూడా వుంది"

"ఏమిటది? "

"మా వూరి దగ్గర నేనూ, ఖాన్ కలిసి తిరుగుతున్నప్పుడు ముగ్గురు మురిద్‌లు తారసపడ్డారు. ఇద్దరు పారిపోయారు గాని ఒకణ్ణి నేను నా పిస్టల్‌తో కాల్చాను.

ఆయుధాలు తీసుకోవటానికి సమీపించినప్పుడు అతడింకా ప్రాణాలతో వున్నాడు. నువ్వు నన్ను చంపావు. సంతోషమే. నువ్వు కూడా ముసల్మాన్‌వేగా. గజావత్ (పవిత్ర యుద్ధం)లో చేరిపో. ఇది దేవుడి ఆజ్ఞ అంటూ శ్వాస వదిలాడు"

"చేరిపోయావా మరి? "

"లేదు, కాని ఆలోచించాను. హంజద్ మనుషులు కుంజాక్‌కు వచ్చినప్పుడు మేం 'గజావత్'లో చేరటానికి సుముఖమేననీ, కాని అంతకుముందు ఇమాం ఎవరైనా పండితులను పంపించి, ఈ పవిత్ర యుద్ధ మంటే ఏమిటో, ఎందుకు చెయ్యాలో తెలియచెబితే బాగుంటుందనీ మా గ్రామపెద్దల ద్వారా సమాచారం పంపించాం. ఇందుకు ప్రతిగా హంజద్ ఏం చేశాడో తెలుసా? మా గ్రామపెద్దల మీసాలు గొరిగించి, ముక్కులు కుట్టించి, వాటికి బరువులు వేళ్లాడదీసి పంపించాడు. అయితే హంజద్, మాకు పవిత్ర యుద్ధం గురించి బోధించడానికి ఒక షేక్‌ను పంపించటానికి సిద్ధంగా వున్నాడనీ, ఖాన్‌లు తమ చిన్న కొడుకును తమకు బందీగా పంపించాలనీ షరతు విధించాడు. ఖాన్‌ల తల్లి (ఖాన్షా) తన చిన్న కొడుకు బులాక్ ఖాన్‌ను పంపింది. 'మిగతా యిద్దరు కొడుకులను కూడా పంపించండి. అందర్నీ ప్రేమగా చూసుకుంటాను. వాళ్లకు తండ్రి లాంటి వాణ్ణి' అన్నాడు హంజద్. ఖాన్షా మూర్ఖురాలు. ఉమ్మాఖాన్‌నూ, నన్నూ పంపింది. కొందరు దారిలోనే ఎదురువచ్చి మమ్మల్ని హంజద్ వద్దకు తీసికెళ్లారు. గుడారంలో వుంటున్నాడతడు. 'నేను మీ కుటుంబానికి ఏ అపకారమూ తలపెట్టలేదు. తలపెట్టను కూడా. పవిత్ర యుద్ధానికి జనాన్ని ప్రేరేపించటమే నా లక్ష్యం. నా తండ్రి, మీ తండ్రికి సేవ చేసినట్టుగానే, నేను మీకు సేవ చేస్తాను. నన్ను మీ యింట్లో వుండనివ్వు. మీకు మంచి సలహాలు ఇస్తాను' అంటూ ప్రేమగా మాట్లాడాడు హంజద్.

ఉమ్మాఖాన్ ధైర్యంగా మాట్లాడలేదు. ఏం జవాబు చెప్పాలో తెలియక మౌనంగా వుండిపోయాడు. ప్రతిపాదన బాగానే వుంది గనక, హంజద్‌ను కుంజాక్‌కు రమ్మనీ, అక్కడ ఖాన్షా, ఆమె పిల్లలూ అతనికి స్వాగతం పలుకుతారని చెప్పబోయాను. కాని నన్ను మధ్యలోనే ఆపి- అదే షామిల్‌ను మొదటిసారి చూడటం- 'అడిగింది నిన్ను కాదు. ఖాన్‌ను' అన్నాడతను.

నేను మాట్లాడలేదు. ఉమ్మాఖాన్‌ను గుడారంలోకి తీసికెళ్లాడు హంజద్. ఆ తర్వాత, తన మనుషులతో కలిసి కుంజాక్‌కు వెళ్ళమని ఆదేశించాడు. అతని వెంటవచ్చిన హంజద్ మనుషులు తన పెద్ద కొడుకును పంపించమని ఖాన్షాను వేధించారు. ఇందులో ఏదో కుట్ర వుందని

అర్థమైపోయింది. పంపించవద్దని ఖాన్వాకు నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. కాని 'గుడ్డుకు వెంట్రుకలుండనట్టే, ఆమెకు బుద్ధి లేదు' కొడుకును వెళ్లమని ఆదేశించింది. అబు నట్సల్ ఖాన్‌కు వెళ్లటం యిష్టం లేదు. అతణ్ణి చూసి 'భయపడుతున్నావా? ' అని అడిగిందామె. మగాళ్లను ఎలా గాయపరచాలో ఆమెకు బాగా తెలుసు- కందిరీగకు కుట్టడం తెలిసినట్టుగా. తల్లికి జవాబు చెప్పలేదు గాని గుర్రానికి జీను సిద్ధం చెయ్యమని సేవకుణ్ణి ఆదేశించాడు అబునట్సల్ ఖాన్. నేనూ అతడి వెంట వెళ్లాను.

హంజద్ మాకు యిదివరకటికన్న ఘనంగా స్వాగతం పలికాడు. సగం దూరంలోనే మాకెదురొచ్చి స్వయంగా వెంటపెట్టుకుని వెళ్లాడు. అనేక మంది అశ్వికులు, రంగురంగుల జెండాలతో, స్వాగత గీతాలతో గాలిలో తుపాకులు పేలుస్తూ మమ్మల్ని ఆహ్వానించారు.

నివాస స్థలానికి చేరగానే హంజద్, అబు నట్సల్ ఖాన్‌ను గుడారంలోకి తీసికెళ్లాడు. నేను గుర్రాల వద్ద నిరీక్షించాను.

ఎంతసేపటికీ అతను వెలుపలికి రాకపోవడంతో కొండల్లో తిరిగి వద్దామనుకున్నాను. నేను సగం దూరం వెళ్లానో లేదో గుడారం లోపల తుపాకీ పేలిన శబ్దాలు వినిపించాయి. పరిగెత్తి చూద్దునుకదా, ఉమ్మాఖాన్ నెత్తుటి మడుగులో పడున్నాడు.

అబు నట్సల్‌ఖాన్ మురిద్‌లతో యుద్ధం చేస్తున్నాడు. కత్తి గాటుకు కాబోలు అతని చెక్కిలి మాంసం వెళ్లాడుతోంది. ఒక చేత్తో దాన్ని నొక్కుకుంటూ, మరొక చేత్తో ఎదుట ఉన్నవాళ్లను చాకుతో పొడుస్తున్నాడు. హంజద్ సోదరుణ్ణి మట్టి కరిపించి, మరొకడి మీదికి లంఘించాడు. సరిగా అప్పుడే మురిద్‌లు అతడి మీద గుళ్ల వర్షం కురిపించారు. మరుక్షణం అతనూ నేలకొరిగాడు"

దాంతో చెబుతున్న హాజీమురాద్ మొహం ఎర్రబడింది. కళ్లలో నెత్తురు కమ్ముకుంది.

"భయంతో పలాయనం చిత్తగించాను"

"నిజంగా? నీకు భయమంటే తెలియదంటారు"

"ఆ తర్వాత, మరెప్పుడూ భయపడలేదు. ఆనాడు మాకు జరిగిన అవమానాన్ని ఎప్పటికీ మరచిపోను. ఇంక దేనికి భయం? "

"చాలా చెప్పాను. నాకు నమాజు సమయమయింది" అన్నాడు హాజీమురాద్, వొరొంట్సొవ్ తనకు కానుకగా యిచ్చిన రిపీట్ వాచ్‌స్ప్రింగు నొక్కి చూస్తూ. పన్నెండుంబావయింది. గడియారాన్ని చెవి దగ్గర పెట్టుకుని చిన్న పిల్లాడిలా వాచీ చప్పుడు వింటూ "సోదరుడు వొరొంట్సొవ్ బహుమతి" అన్నాడు.

"మంచి వాచ్. మీ నమాజు తర్వాత కలుస్తాను" అన్నాడు లారిస్ మెలికొవ్.

హాజీమురాద్ తన పడక గదిలోకి నిష్క్రమించాడు.

హాల్లో ఒంటరిగా కూర్చున్న లారిస్ మెలికొవ్ హాజీమురాద్ చెప్పినవన్నీ సరిగా రాసుకున్నానో లేదోనని మరోసారి చెక్ చేసుకుని సిగరెట్ వెలిగించాడు. పక్క గదిలో ఏదో చప్పుడైంది. దగ్గరగా వెళ్లాడు. లోపల్నించి టార్టార్ భాషలో మాటలు వినిపిస్తున్నాయి. వాళ్లు హాజీమురాద్‌కు సంబంధించిన మురిద్‌లు కావచ్చు గది తలుపు తెరిచి లోపలికెళ్లాడు.

పర్వతాలలో నివాసముండేవాళ్ల వద్ద వచ్చే ఒక ప్రత్యేకమైన వాసనతో నిండింది గది. నేల మీద బురఖా పరచివున్నది. మాసిన బనియన్ తొడుక్కుని ఒంటి క

న్ను గంజాలో దాని మీద కూర్చుని వున్నాడు. అతడు కళ్లెంతాడు అల్లుతున్నాడు. ఏదో మాట్లాడుతున్నట్టుంది. గొంతు బొంగురుగా వుంది. కొత్త మనిషి గదిలోకి ప్రవేశించటం చూసి మాటలాపి తన పని కొనసాగించాడు.

గంజాలో ముందర నిల్చుని నవ్వుతున్నాడు ఖాన్ మహోమా. అతడి తెల్లటి పళ్లు మెరుస్తున్నాయి. కనుబొమ్మలు లేని నుదురు వింతగా కనిపిస్తున్నది. చొక్కా చేతులు పైకి మడుచుకుని జీను పట్టీలకు పాలిష్ పెడుతున్నాడు ఎల్డార్. అందర్లోకీ ముఖ్యుడు ఖనేఫీ అక్కడ కనిపించలేదు.

అతడు వంటింట్లో డిన్నర్ తయారు చేస్తున్నాడు.

"దేని గురించి వాదులాడుకుంటున్నారు? " అని అడిగాడు లారిస్‌మెలికొవ్.

"అతడు (హాజీమురాద్) షామిల్‌ను పొగుడుతుంటాడు. రాత్రిపగలూ షామిల్ చాలా గొప్పవాడు, పండితుడు, మహా పవిత్రుడు, మహా ధైర్యశాలి అంటూ..." అన్నాడు ఖాన్‌మహోమా.

"అతణ్ణి వదిలి వచ్చి యింకా పొగడటం దేనికి? "

"అదేగదా, అక్కడ వుండలేకనే యిక్కడి కొచ్చాడు. అయినా అతడంటే ఎక్కడ లేని గౌరవం" అన్నాడు ఖాన్ మహోమా మళ్లీ మొహం చిట్లించి.

"అతడు నిజంగా అంత సాధుపుంగవుడనుకుంటున్నాడా? "

"మహాత్ముడు కాకపోతే జనం అతడు చెప్పిన మాట ఎందుకు వింటున్నారు మరి? "

"షామిల్‌లో అలాంటిదేమీ లేదుగాని, మన్సూర్ మాత్రం నిజంగా సాధుపుంగవుడు. అతడు ఇమాంగా వున్నప్పుడు జనం యిలా లేరు. అతడు గుర్రం మీద వూళ్లలోకి వచ్చినప్పుడు, జనం అతడి కోటు కొసలను ముద్దాడేవారు. తాము చేసిన పాపాలు చెప్పుకొని, యికముందర అలా చెయ్యమని ఒట్టు పెట్టుకునేవారు. అప్పుడు మా ప్రజలందరూ సాధువులలాగే బతికారని చెబుతారు పెద్దవాళ్లు. ఆ కాలంలో తాగుడు లేదు. చుట్ట కాల్చటం లేదు. నమాజును అశ్రద్ధ చేయటం లేదు. ఎవరైనా తప్పుచేసినా పెద్ద మనసుతో క్షమించేవాళ్లు. ఒకరికోసం ఒకరు ప్రాణాలర్పించటానికైనా సిద్ధంగా వుండేవారు. ఎవరికైనా దారిలో డబ్బు కనిపిస్తే దాన్నో కర్రకు కట్టి అక్కడే వదిలివెళ్లేవారు. అది ధర్మకాలంగనకే దేవుడు అందర్నీ చల్లగా చూశాడు. ఇప్పటిలా కాదు" అన్నాడు ఖాన్ మహోమా.

"మా పర్వత ప్రాంతాల్లో యిప్పుడు కూడా ఎవరూ తాగరు. చుట్ట కాల్చరు" అన్నాడు గంజాలో.

"నీ షామిల్‌కు నాగరికత తెలియదు. వాడో రెండుకాళ్ల జంతువు" అన్నాడు ఖాన్ మహోమా.

"అవును. పర్వత ప్రాంతాల్లో వుండే వాళ్లు కాస్త మొరటుగానే వుంటారు" అన్నాడు గంజాలో.

"పర్వతాల్లో గద్దలుంటాయి"

"మాటకు మాట బాగా చెప్పావు" అన్నాడు ఖాన్ మహోమా, తిట్టిన తన

మిత్రుణ్ణి మెచ్చుకుంటూ ఆ తర్వాత.

లారిస్ మెలికోవ్ చేతిలో వెండి సిగరెట్ కేసు చూసి "ఓ సిగరెట్ ఇవ్వు" అన్నాడు.

"మీరు సిగరెట్లు కాల్చకూడదు గదా? " అన్నాడు లారిస్ మెలికోవ్.

హాజీమురాద్ పడకగది వైపు చూస్తూ, "ఎవరూ చూడనప్పుడు కాలిస్తే ఫరవాలేదు" అన్నాడు ఖాన్ మహోమా. కాని ఆ తర్వాత సిగరెట్ వెలిగించి పొగ లోపలికి పీల్చకుండా వదిలేశాడు.

"ఇది చాలా తప్పు" అంటూ కోపంగా గదిలోంచి వెళ్లిపోయాడు గంజాలో.

లారిస్ మెలికోవ్ అతడి వైపే చూశాడు. ఆ వూళ్లో సిల్క్ బనియన్లు, టోపీలు ఎక్కడ దొరుకుతాయని అడిగాడు ఖాన్ మహోమా.

"ఏం, అన్ని డబ్బులున్నాయా? " అన్నాడు లారిస్ మెలికోవ్.

"ఎంతోకొంత వుందిలే"

"ఆ డబ్బు ఎక్కణ్ణించి వచ్చిందో అడగండి" అన్నాడు ఎల్డార్, లారిస్ మెలికోవ్‌తో.

"ఆటలో గెల్చుకున్నాను" అని తను క్రితం రోజు టిఫ్లిస్‌లో తిరుగుతున్నప్పుడు రష్యన్లు, ఆర్మీనియన్లు బొమ్మాబొరుసూ ఆడటం చూసి తనూ పందెంకాసి గెలిచానని చెప్పాడు. "వాళ్లు బంగారు, వెండి నాణాలతో ఆడుతున్నారు. నేను రాగి నాణాలతో ఆడాను. అయినా గెలిచాను"

"భలేగా వుందే. ఎలా ఆడావు? ఎంత డబ్బు పణంగా పెట్టావేమిటి? "

"పన్నెండు కోపెక్కులే"

"పోయుంటే? "

"ఇదుందిగా!" అంటూ తన పిస్టల్ చూపించాడు ఖాన్ మహోమా.

"అది కూడా యిచ్చేసేవాడివా? "

"ఇవ్వటమే? కాలికి బుద్ధి చెప్పేవాణ్ణి. ఎవరన్నా ఆపటానికి ప్రయత్నిస్తే దీంతో కాల్చి చంపేవాణ్ణి"

"నిజంగా గెలిచావా? "

"మొత్తం గెలుచుకున్నాను"

ఖాన్ మహోమా, ఎల్డార్‌లు ఎలాంటి వాళ్లో లారిస్ మెలికోవ్‌కు బాగా అర్థమైంది. ఖాన్ మహోమాకు పైలాపచ్చీసు జీవితం యిష్టం. తన జీవితమే కాదు- ఎవరి జీవితమూ అతడికి ముఖ్యం కాదు. ఇలా చీకూ చింతాలేకుండా తిరగవచ్చుననే అతడు రష్యన్ పక్షం వచ్చాడు. ఇలా బతకగలిగే అవకాశమిస్తానంటే అతడు తిరిగి షామిల్ వైపు పొమ్మన్నా పోతాడు. ఎల్డార్‌ను మాత్రం అర్థం చేసుకోవటం కష్టం. అతడికి నియమనిష్ఠలెక్కువ. శారీరకంగానూ, మానసికంగానూ బలవంతుడు.

గంజాలో ఒక్కడే అతడికి అంతు చిక్కలేదు. వాడికి షామిల్ అంటే ఆరాధనా భావం, రష్యన్లంటే ద్వేషం, అసహ్యం. ఇలాంటి వాడు మరి హాజీమురాద్‌తో కలిసి తమవైపు ఎందుకొచ్చాడు? తమ వున్నతోద్యోగులు కొందరు అనుమానం వ్యక్తం చేసినట్టుగా షామిల్ పట్ల అతడు చూపించింది కపట వైరమేమో? అతడు లొంగిపోయినట్టుగా నటిస్తున్న షామిల్ తరపు గూడాచారి కావచ్చు

ఇక హాజీమురాద్! గంజాలోతో మాట్లాడిన తర్వాత అనుమానం బలపడింది. హాజీమురాద్ బాగా నటించగలడు. ద్వేషం దాచుకొని ప్రేమ చూపించగలడు.. కాని అంత సమర్థుడు కాదు గంజాలో.

లారిస్ మెలికోవ్ మరి కొంతసేపు అతణ్ణి అవీయివీ అడిగాడు. కాని గంజాలో నోరు మెదపకుండా తన పని చేసుకుంటూ అవును, కాదంటూ తలూపాడు.

కాసేపటికి హాజీమురాద్ మరొక అనుచరుడు ఆవర్ ఖనేఫీ అక్కడికి వచ్చాడు. అతనూ బలాఢ్యుడే. ఎప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నమై వుంటాడు. హాజీము

రాద్ నమ్మినబంట్లలో ముఖ్యుడితడు.

బియ్యం తీసుకుపోవడానికి గదిలోకి ప్రవేశించగానే లారిస్‌మెలికోవ్ అతణ్ణాపి "ఎక్కడి నుంచి వచ్చావు? ఎన్నాళ్లుగా హాజీమురాద్‌తో వుంటున్నావు? " అని ప్రశ్నించాడు.

"నాదీ, అతన్దీ ఒకే వూరు. అయిదేళ్లుగా కలిసి వుంటున్నాం. నా తండ్రి, అతడి అంకుల్ని చంపాడు. వాళ్లు నన్ను చంపాల నుకున్నారు. నన్ను తన పెంపుడు తమ్ముడిగా స్వీకరించమని అతణ్ణడిగాను" అంటూ తన కథ చెప్పాడు ఖనేఫీ.

"పెంపుడు తమ్ముడంటే? "

"రెండు నెలల పాటు జుత్తు, గోళ్లు కత్తిరించుకోలేదు అప్పుడు. హాజీమురాద్ యింటికెళ్లి ఆయన తల్లిని శరణుగోరాను. ఆమె నన్ను క్షమించింది. అలా, అతడికి తమ్ముణ్ణయ్యాను"

పక్కగదిలోంచి హాజీమురాద్ గొంతు వినిపించింది. ఎల్డార్ వెంటనే చేతులు తుడుచుకుని పెద్ద పెద్ద అంగలతో గది విడిచి వెళ్లాడు. ఆ వెంటనే తిరిగి వచ్చి "మిమ్మల్ని లోపలికి రమ్మంటున్నాడు" అని చెప్పాడు.

ఖాన్ మహోమాకు మరో సిగరెట్టిచ్చి హాజీమురాద్ గదిలోకి వెళ్లాడు లారిస్ మెలికోవ్.

★ ★ ★

గదిలోకి ప్రవేశించిన లారిస్ మెలికోవ్‌ను నవ్వుతూ ఆహ్వానించిన హాజీమురాద్ "ప్రారంభించనా? " అన్నాడు.

"తప్పకుండా ఇప్పటిదాకా మీ వాళ్లతో మాట్లాడాను. ఒకడు భలే సరదాగా వున్నాడు"

"వాడు ఖాన్ మహోమా, చిల్లర వెధవ" అన్నాడు హాజీమురాద్.

"మరొకడు చూడటానికి భలే అందంగా వున్నాడు"

"ఎల్డార్. అలా కనిపిస్తాడు గాని, వాడు వుక్కు మనిషి"

కాసేపిద్దరూ మౌనంగా వున్నారు.

"ప్రారంభించనా? ఖాన్‌లు ఎలా హత్యకు గురయ్యారో చెప్పాను గదా! ఆ తర్వాత కుంజాక్‌కు వచ్చిన హంజద్ వాళ్ల భవంతిలో తిష్టవేశాడు. ఖాన్షా ఒక్కతే యింకా బతికున్నది. ఆమెకు కబురు పెట్టాడు హంజద్. 'ఇంత అవమానమా!' అంటూ నానా తిట్లూ తిట్టింది ఖాన్షా. హంజద్ తన 'మురిద్' అసెల్దార్‌కు సైగ చేశాడు. వాడు వెనకనుండి ఆమె తలనరికాడు"

"ఆమెనెందుకు చంపాల్సి వచ్చింది? "

"ముందు కాళ్లెక్కడికి తీసుకెడితే వెనక్కాళ్లు అక్కడికే పోతాయి. మొత్తం కుటుంబాన్ని నాశనం చేశాడు. అందరికన్నా చిన్నవాణ్ణి, ఓ కొండపై నుంచి తోసి చంపేశాడు షామిల్"

"అలా అవేరియా అంతా హంజద్‌కు లొంగిపోక తప్పలేదు. కాని నేనూ, నా తమ్ముడు మాత్రం లొంగిపోవటానికి నిరాకరించాం. ఖాన్‌ల హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాం. లొంగిపోయినట్టు నటించాం. కాని లోపల వాడిని ఎలా చంపాలా? అని ఆలోచిస్తూనే ఉన్నాం. నెత్తురు సలసలా కాగింది. మా తాత సలహాతో ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. అతడు భవంతి వెలుపలి కొచ్చినప్పుడు చుట్టుముట్టి చంపెయ్యాలి. ఈ విషయం హంజద్‌కు చేరవేశారెవరో. మా తాతను పిలిచి 'నీ మనవలు నా మీద కుట్ర చేస్తున్నారని తెలిసింది. అదే నిజమయితే, నువ్వూ, వాళ్లూ ఒకే ఉరికంబానికి వేళ్లాడతారు. నేను దేవుడి మనిషిని. దేవుడి పని చేస్తున్నాను. నాకెవరూ అడ్డుతగలకూడదు. అర్థమైందా? ' అని హెచ్చరించి పంపాడు.

తాత, తిరిగివచ్చి మాకీ విషయం చెప్పాడు.

ఇక నిరీక్షించకూడదు. పని త్వరగా పూర్తి చెయ్యాలి. మనీదులో తొలిరోజు విందు నాటికి ముహూర్తం పెట్టుకున్నాం. మిగతా కామ్రేడ్‌లు అందుకు అంగీకరించ లేదు గాని నేనూ, నా తమ్ముడూ మొండి కేశాం. ఇద్దరం రెండేసి పిస్టల్‌లని మా బుర్ఖాలలో దాచుకుని మనీదుకెళ్లాం. ముప్ఫైమంది మురిద్‌లు వెంటరాగా, మనీదులోకి ప్రవేశించాడు హంజద్. అందరి చేతుల్లోనూ ఖడ్గాలు తళతళా మెరుస్తున్నాయి. అసెల్దార్ (ఖాన్షా శిర చ్ఛేదం చేసినవారు) మమ్మల్ని చూసి, బుర్ఖాలు తీసి ముందుకు రమ్మన్నాడు. నా చాకుతో వాడిని పొడిచి చంపి, హంజద్ వైపు పరిగెత్తాను నేను. కాని అప్పటికే నా తమ్ముడు ఉస్మాన్ హంజద్‌ను కాల్చాడు. బులెట్ తగిలినా, హంజద్ మావాడి పైకి లంఘించాడు. కాని నేను మరొక్క వేటుతో అతడి కథ ముగించాను. వాళ్లు ముప్ఫైమంది. మేం ఇద్దరం. వాళ్లు ఉస్మాన్‌ను చంపేశారు. నేను కిటికీ లోంచి దూకి పారిపోయాను.

హంజద్ మరణించాడని తెలిశాక, జనం తిరగబడ్డారు. చాలామంది మురిద్‌లు పలాయనం చిత్తగించారు. మిగిలిన వాళ్లను జనం చంపేశారు"

హాజీమురాద్ ఆగి ఊపిరి తీసుకుని, తిరిగి ప్రారంభించాడు.

"అప్పటికి సమస్య పరిష్కారమైనట్టేనని అనిపించింది. కాని త్వరలోనే కథ మళ్లీ మొదటికొచ్చింది. హంజద్ తర్వాత షామిల్ అధికారం చేపట్టాడు. రష్యన్లను ఎదిరించటానికి, నేను తనతో చేయి కలపాలని కోరుతూ నా వద్దకు తన దూతలను పంపాడు. నేను నిరాకరిస్తే, నన్ను చంపటమే కాక, కుంజాక్ గ్రామాన్నే నేలమట్టం చేస్తానని బెదిరించాడు.

నేనతనకి ఎలాంటి సహాయమూ చెయ్యను. అతణ్ణి మా గ్రామానికి కూడా రానివ్వనని నిర్ణయం తెలియచేశాను"

"నువ్వతనితో ఎందుకు చేతులు కలప లేదు? "

నుదురు చిట్లించి కాసేపు మౌనంగా ఉన్నాడు హాజీమురాద్.

"ఎలా కలపగలను? నా తమ్ముడు ఉస్మాన్, అబు నట్సల్‌ఖాన్‌లను చంపిన వాడికి ఎలా సహకరిస్తాను? జనరల్ రోసెన్ నన్ను అవేరియా పరిపాలించుకొమ్మని ఆదేశించాడు. కాని అతడే కాజీ కుముల్‌కు అధికారిగా మొదట మహమ్మద్ మీర్జానూ, తర్వాత అహ్మద్ ఖాన్‌నూ నియమించాడు. అహ్మద్ ఖాన్‌కు నేనంటే ద్వేషం. ఖాన్షా కూతురు సుల్తానెట్టాను తన కొడుక్కు చేసుకోవాలని అతడి కోరిక. ఆమె అందుకు నిరాకరించింది. అలా ఆమె నిరాకరించటానికి కారణం నేనే అని అతడి అనుమానం. నన్ను చంపించటానికి తన మనుషులను కూడా పంపాడు. ఏదో రకంగా నేను తప్పించుకున్నాను. ఆ తర్వాత జనరల్ క్లూగెనౌకు నా గురించి పితూరీలు చెప్పాడు. నేను రష్యన్లకు కలప సరఫరా ఆపివెయ్యమని ఆవర్‌లకు చెప్పానీ, నేనీ పాగా (తలకున్న పాగా

చూపిస్తూ) పెట్టుకుంటాననీ, అంటే దీని అర్థం నేను షామిల్ పక్షం చేరినట్టేననీ ఉన్నవీ లేనివీ కల్పించి జనరల్‌కు నామీద దురభిప్రాయం కలుగచేశాడు. మొదట జనరల్ వీటిని నమ్మలేదన్నారు గాని, అతడు టిఫ్లిస్ వెళ్ళిపోయిన తర్వాత అహ్మద్ ఖాన్ ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. అతడి సైనికులు వచ్చి నన్ను బంధించి, సంకెళ్లు వేసి శతఘ్ని ముందు నిలబెట్టారు.

అలా ఆరు రోజులు గడిచాయి. ఏడో రోజున కట్లు విప్పి నన్ను తెమిర్‌ఖాన్ షురాకు తీసికెళ్లారు. తుపాకులు ఎక్కుపెట్టిన నలభైమంది సైనికులు నాకు కాపలా. పారిపోవటానికి ప్రయత్నిస్తే తక్షణం కాల్చెయ్యాలని వాళ్లకు ఆదేశాలున్నాయి.

మేం మనోష్కాను సమీపించినప్పుడు, దారి ఇరుకయ్యింది. ఒకవైపు నూట ఇరవై గజాల లోతు గల లోయ ఉంది. నేను అటుగా నడిచాను. అంచున నిల్చున్నప్పుడు ఒక సైనికుడు నన్ను ఆపటానికి ప్రయత్నించాడు గాని అతణ్ణి కూడా వెంట లాక్కుని కిందికి దూకాను. అతడు మరణించాడు. చూస్తున్నారుగా, నేను బతికే ఉన్నాను.

పక్కటెముకలు, కాళ్లూచేతులు విరిగాయి. పాకటానికి ప్రయత్నించాను గాని మగత కమ్ముకున్నది. తిరిగి స్పృహ వచ్చే సరికి నెత్తుటి మడుగులో ఉన్నాను. ఒక గొర్రెల కాపరి చూసి ఊరివాళ్లను పిలిచాడు. నేను వాళ్లతోనే కొన్నాళ్లు గడిపాను. గాయాలు మానాయి గాని ఓ కాలు పొట్టిదైంది. అయితేనేం, బాగానే నడుస్తున్నాను గదా!

నా గురించి తెలిసి పక్క ఊళ్ల జనం కూడా చూడటానికి వచ్చారు. మరికాస్త కోలుకున్న తర్వాత నా స్వగ్రామం సెల్మెస్‌కు వెళ్లిపోయాను. ఆవర్లు మళ్లీ నన్ను అధికారం చేపట్టమన్నారు. నేను అంగీకరించాను" అంటూ సంతృప్తిగా నిట్టూర్చి ముగించాడు.

ఆ తర్వాత ఒక సంచిలోంచి రంగువెలిసిన కాగితాలు కొన్ని తీసి లారిస్ మెలికొవ్‌కు అందించాడు. అవి తనకు జనరల్ క్లూగెనౌ రాసిన లేఖలు.

"లెఫ్టినెంట్ హాజీమురాద్! మీరు నావద్ద సమర్థవంతంగా పనిచేశారు. నేను మీ నిజాయితీని శంకించలేదు. కాని ఇటీవల మీరు మాకు ద్రోహిగా మారారన్న విషయం నా దృష్టికి వచ్చింది. మీరు పాగా ధరిస్తున్నారనీ, షామిల్‌తో తరచుగా సమావేశమవుతున్నారనీ తెలిసింది. రష్యన్ ప్రభుత్వాన్ని ఎదిరించమని మీరు మీ ప్రజలను ప్రోత్సహిస్తున్నారు. నేను మీ అరెస్టుకు ఆజ్ఞాపించాను గాని మీరు మా వాళ్ల కళ్లుగప్పి పారిపోయారు. ఇది మంచి చేస్తుందో చెడు చేస్తుందో నాకు తెలియదు. మీరు నేరస్థుడో, నిరపరాధో కూడా ఇప్పుడే నిర్ణయించలేను. అందువలన నా సలహా పాటించి, మీరు నిజంగా ఏ నేరమూ చెయ్యలేదని భావించినట్టయితే, జార్ చక్రవర్తికి నిజాయితీగా భక్తిశ్రద్ధలతో సేవ చేస్తున్నానని నమ్ముతున్నట్టయితే వెంటనే నావద్దకు రండి. నేను మీకు అభయం ఇస్తున్నాను. నేను మీకు రక్ష

ణగా ఉంటాను. ఖాన్ స్వయంగా నా అదుపాజ్ఞలలోనే ఉంటాడు గనక అతడు మీకేమీ కీడు తలపెట్టలేడు"

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని క్లూగె నౌ మరోమారు స్పష్టం చేశాడు.

లారిస్ మెలికొవ్ రెండో ఉత్తరం చదవే లోగా తను మొదటి ఉత్తరానికి రాసిన జవాబు గురించి చెప్పాడు హాజీమురాద్.

"నేను పాగా పెట్టుకున్నది షామిల్ కోసం కాదు. నా పవిత్ర ఆచారాన్ని అనుసరించటం కోసమని రాశాను. నాకు షామిల్ వద్దకు వెళ్లవలసిన అవసరమూ, వెళ్లాలనే కోరికా లేవు. అతడు నా తండ్రిని, సోదరులను, బంధువులను చంపాడు. అయితే నేను రష్యన్ల పక్షం కూడా చేరలేను. ఎందుకంటే వాళ్లు నాతో అమర్యాదగా ప్రవర్తించారు. కుంజాక్‌లో నేను బందిగా ఉన్నప్పుడు ఒక నీచుడు నామీద ఉమ్మేశాడు. వాణ్ణి చంపితే తప్ప, మీతో జతకట్టలేను. ముఖ్యంగా పరమ దుర్మార్గుడు అహ్మద్‌ఖాన్ అంటే నాకు భయం. వాడున్న చోట నేనుండలేను. నా ఉత్తరానికి జనరల్ రాసిన జవాబిది" అంటూ మరో రంగు వెలసిన కాగితం అందించాడు హాజీమురాద్.

'నీ ఉత్తరానికి ధన్యవాదాలు. ఎవడో నిన్ను అవమానించినందుకు గాను, మాతో చేరనంటున్నావు. రష్యన్ చట్టాల ప్రకారం అందరికీ న్యాయం జరుగుతుంది. వాడిని నీ కళ్లముందే శిక్షించగలం. ఈ విషయంలో ఇప్పటికే ఆదేశాలు జారీచేశాను.

మరో విషయం కూడా గుర్తుంచుకో, హాజీమురాద్! నా పదవినీ, హోదాను కూడా నువ్వు గౌరవించనందుకు నాకు నీమీద కోపంగా ఉంది. అయినా క్షమిస్తున్నాను. పర్వతాలలో ఉండే మీరు మనుషుల్ని ఓ పట్టాన నమ్మరు. కేవలం ఆచారం కోసమే పాగా పెట్టుకున్నట్టయితే భయమెందుకు? రష్యన్ ప్రభుత్వాన్ని చూసి బెదిరిపోవటమెందుకు? నిన్ను అవమానించిన వాణ్ణి నీ కళ్లముందే శిక్షిస్తాం. వాడి ఆస్తి జప్తు చేసి నీపేర రాసిస్తాం. రష్యన్లకు మీరంటే అపార గౌరవం. ఎవడో అనామకుడు అవమానించినంత మాత్రాన మా దృష్టిలో మీ స్థాయి ఏమాత్రం తగ్గలేదు.

అనేక మంది పాగా ధరించటానికి నేను స్వయంగా అనుమతించాను. ఈ ఉత్తరాన్ని మీకు చేర్చిన వ్యక్తితో కలిసి నావద్దకు వెంటనే రా'

"అయినా నేను అతడి మాటల్ని నమ్మలేదు. క్లూగెనౌ వద్దకెళ్లలేదు" అన్నాడు హాజీమురాద్. కాసేపాగి సాలోచనగా, "అహ్మద్‌ఖాన్ మీద ప్రతీకారం తీర్చుకోవటం నా లక్ష్యం. అందువల్ల నేను రష్యన్ల పంచన చేరే ప్రసక్తేలేదు. ఆ తర్వాత అహ్మద్‌ఖాన్ మా గ్రామం సెల్మెస్‌ను చుట్టుముట్టి నన్ను బందీగా పట్టుకుని చంపటానికి ప్రయత్నించాడు. నా దగ్గర అప్పుడంత సైన్యం కూడా లేదు. అతణ్ణి ఎదిరించే శక్తి లేదు. సరిగ్గా అప్పుడు షామిల్ దూతలు వచ్చి, అహ్మద్‌ఖాన్‌తో యుద్ధంలో నాకు సాయం చేస్తామన్నారు. ఓడిస్తే అతణ్ణి చంపి, అవేరియాకు నేనే ఏకచత్రాధిపతిని కావచ్చు అలా అన్ని విషయాలూ బేరీజు వేసుకుని నేను షామి

ల్‌తో చేరిపోయాను. అప్పటినుండీ రష్య న్లతో యుద్ధం చేస్తూనే వున్నాను"

ఆ తర్వాత తను చేసిన పోరాటాలన్నీ ఒక్కొక్కటీ వివరంగా చెప్పాడు హాజీము రాద్. అందులో కొన్నింటి గురించి లారిస్ మెలికోవ్‌కు అప్పటికే తెలుసు. మెరుపు యుద్ధాలు చెయ్యటం హాజీమురాద్ ప్రత్యే కత. ఇంచుమించు అన్నింటిలోనూ అతడి దే పైచేయి.

"అయినప్పటికీ నాకూ షామిల్‌కూ మధ్య దోస్తీ లేదు. అతడికి నేనంటే భయం. కాని నా అవసరముంది. షామిల్ తర్వాత ఎవరు యిమాం కావా లని ఎవరో అడిగారొకసారి. 'ఎవరు విజేత అయితే వాడే ఇమాం' అన్నాను.

ఈ విషయం తెలిసి షామిల్ నన్ను వదిలించుకోవటానికి ప్రయత్నించాడు. అతడు నన్ను తబసరాన్ పంపించాడు. నేను అక్కడ వెయ్యి గొర్రెలు, మూడు వందల గుర్రాలు పట్టి తెచ్చాను. అయినా అతడు సంతోషించలేదు. పైగా నన్ను నిందించి 'నాయబ్'(గవర్నర్) పదవి నుండి తొలగించాడు. నా వద్ద వున్న ధన మంతా తిరిగి యివ్వమన్నాడు. నేను వెయ్యి బంగారు నాణాలు పంపించాను. అతని మురిద్‌లు వచ్చి నా ఆస్తినంతా లాక్కున్నారు. నన్ను తన వద్దకు రమ్మని ఆజ్ఞ జారీ చేశాడు. నన్ను చంపుతాడని తెలుసు. నేను వెళ్లలేదు. నన్ను బందీగా పట్టుకురమ్మని తన మనుషుల్ని పంపిం చాడు. అప్పుడు నేను వొరొంట్సోవ్‌ను ఆశ్ర యించాను. నా కుటుంబాన్ని వూళ్లో వదిలి ఒంటరిగా ఆయన దగ్గరకెళ్లాను. నా తల్లి, నా భార్యలు, నా కొడుకులు అతడి చెరలో వున్నారు. సర్దార్‌కు చెప్పండి. నా కుటుంబం షామిల్‌కు బందీగా వున్నంత కాలం నేను నిస్సహాయుణ్ణి. మీకేవిధం గానూ వుపయోగపడలేను"

"చెబుతానులే" అన్నాడు లారిస్ మెలి కోవ్.

"నా కోరిక మన్నించి నా కుటుంబాన్ని రక్షించండి. అంతా మీ చేతుల్లో వుంది. నన్నూ, నా వాళ్లనూ షామిల్ చెరనుండి విడుదల చెయ్యమని మరీమరీ వేడుకుం టున్నాను" అంటూ ముగించాడు హాజీ మురాద్.



డిసెంబర్ 20న మినిస్టర్ ఆఫ్ వార్, ప్రిన్స్ చెర్నిషోవ్‌కు ఫ్రెంచిలో వొరొంట్సోవ్ రాసిన వుత్తరం యిలా వుంది-

డియర్ సర్,

నేనీ వుత్తరం ఆలస్యంగా రాయటానికి ఒకే కారణం, హాజీమురాద్‌తో ఏం చెయ్యాలో ఇంకా మేం నిర్ణయించుకోలేదు. గత రెండుమూడు రోజులుగా నా ఆరోగ్యం అంత బాగాలేదు.

హాజీమురాద్ మనవైపు వచ్చి చేరాడని నేనిదివరకే రాశాను. ఎనిమిదవ తేదీనాడు అతడు టిఫ్లిస్ చేరుకున్నాడు. ఏడెనిమిది రోజులుగా అతడితో మాట్లాడుతూనే వున్నాను. భవిష్యత్తులో అతడు మనకెలా వుపయోగపడతాడు? ప్రస్తుతం అతణ్ణి ఏంచెయ్యాలి? అని ఆలోచిస్తున్నాను. తన కుటుంబం గురించి అతడు చాలా ఆందో ళన చెందుతున్నాడు. వాళ్లు షామిల్ చెరలో వున్నంతకాలం తను మనకేవిధం

గానూ వుపయోగపడలేననీ, కృతజ్ఞతగా ఏ ప్రత్యుపకారమూ చెయ్యలేననీ పదేపదే చెబుతున్నాడు.

అతడు రాత్రుళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నాడని తెలిసింది. భోజనం కూడా ముట్టడంలేదు. నిరంతరం ప్రార్థనలో గడుపుతున్నాడు. కోసక్కులతో కలిసి గుర్రపు స్వారీ చెయ్యటమొక్కటే అతడి వినోదం. పైగా అది అతడికి మొదటినుండీ వున్న అలవాటు. ప్రతిరోజూ నావద్దకొచ్చి- తన కుటుంబం గురించి ఏమైనా తెలిసిందా -అని అడుగుతాడు. మనం పట్టుకున్న షామిల్ మనుషులందర్నీ అతడికి తిరిగి అప్పగించి తన వాళ్లను విడుదల చేయించమని ప్రాధేయపడతాడు. కావాలంటే డబ్బులిస్తానంటాడు. 'నా కుటుంబాన్ని రక్షించండి. మీకు సేవచేసే అవకాశం కల్పించండి' ఇది అతని నివేదన. 'ఆ తర్వాత నా సేవతో మీరు తృప్తిచెందకపోతే, నన్ను శిక్షించండి' అంటాడు మరోసారి. అక్కడ కుటుంబ సభ్యులున్నంత వరకూ యితడివల్ల మనకుపయోగంలేదని తెలుసు. పరిహారంగా పెద్దమొత్తంలో డబ్బిచ్చి వాళ్లను విడిపించుకోవాలంటే, అంత డబ్బు మంజూరుచేసే అధికారం నాకు లేదు. హాజీమురాద్ వెంటనే తిరిగి రాకపోతే అతడి తల్లినీ, యితర కుటుంబ సభ్యుల్నీ చంపుతానని షామిల్ బెదిరించే అవకాశమూ వుంది. నిజంగా అలాంటి పరిస్థితి వస్తే ఏం చేస్తావని ఒకసారి అతణ్ణడిగాను. చేతులు పైకెత్తి అంతా దేవుడి దయ అంటూ నిట్టూర్చాడు. అయితే ఏది ఏమైనా అతడికి లొంగిపోనంటాడు. లొంగిపోతే తనను ఎలాగూ చంపేస్తాడు గదా అంటాడు. తొందరపడి తన కుటుంబాన్ని అతడు నాశనం చెయ్యడని హాజీ మురాద్ నమ్మకం. దాగెస్తాన్‌లో వున్న అనేకమంది ప్రముఖులు అలాంటి పనిచెయ్యకుండా అతడిమీద వత్తిడి తెస్తారు. కనీసం చెచెన్యా సరిహద్దులకు తను చేరుకోగలిగితే ఎవరో ఒకరు తన కుటుంబ సమాచారం చేరవేస్తారు. ఆ అవకాశమైనా తనకు లభించదా అని వాపోతాడు.

ఇరవై ముప్ఫై మంది కోసక్కుల రక్షణ దళంతో గ్రోజ్నీ వెళ్లిపోతానంటాడొకసారి.

నేనీ విషయాలన్నీ యింత వివరంగా మీకెందుకు రాస్తున్నానో, మీకిప్పటికే అర్థమైవుంటుంది. నా బాధ్యతను నేను విస్మరించలేను. అతణ్ణి పూర్తిగా నమ్మలేను. అయితే అతణ్ణి పూర్తిగా నిర్బంధించటం కూడా సరికాదు. మనమతడిని యిబ్బంది పెట్టినట్టుగా తెలిస్తే, దాగెస్తాన్‌లో మనకు చాలా నష్టం జరుగుతుంది. అక్కడ ఎక్కువమంది షామిల్‌కు వ్యతిరేకంగా, మనకు

అనుకూలంగా వున్నారు. హాజీమురాద్ పట్ల మన ప్రవర్తనను బట్టే దాగెస్తాన్ ప్రజలంటే మనకెంత గౌరవాభిమానాలున్నాయో తెలిసిపోతుంది. అందువలన ఇతడిపట్ల నేను వ్యవహరించిన పద్ధతి సరైనదనే అనుకుంటున్నాను. అయినప్పటికీ అతడికి మళ్లీ పారిపోయే అవకాశం కల్పిస్తే నేను పెద్దతప్పు చేసినట్టే. ఇలాంటి సంక్లిష్ట సందర్భాల్లో ఏది సబబో, ఏది కాదో నిర్ణయించటం కష్టం. మర్యాదకు భంగం కలగకూడదు. అయినా అతడిని ఓ కంట కనిపెడుతూనే వుండాలి.

మహాశయా! ఈ విషయాలన్నీ మహా ఘనత వహించిన చక్రవర్తిగారి దృష్టికి తీసుకుపోవలసిందిగా విన్నవించుకుంటున్నాను. నా చర్యలకు వారి అనుమతి లభిస్తే నేను కృతజ్ఞుణ్ణి.

మీకు రాసిన సమాచారమంతా నేను జనరల్ జవొడోవ్స్కీ, జనరల్ కొజ్లోవ్స్కీలకు కూడా చేరవేశాను. హాజీ మురాద్ గురించి నిర్ణయం తీసుకోవటంలో వాళ్లకీ సమాచారం వుపయోగపడుతుంది. కొజ్లోవ్స్కీ అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లొద్దని నేనిప్పటికే హాజీమురాద్‌ను హెచ్చరించాను.

రష్యన్ ఆఫీసర్లు పక్కన లేకుండా ఒక్కడే వున్నట్టుగా కనిపిస్తే మరీ మంచిదని కూడా చెప్పాను. ఇరుపక్కలా మన సైనికులు కనిపిస్తే హాజీమురాద్‌ను మనం బందీగా పట్టుకున్నామని షామిల్ ప్రచారం చేసే అవకాశముంది. అంతే కాదు, నా కుమారుడుంటున్న వోడ్విజెన్‌స్కయకు కూడా వెళ్లవద్దని హాజీమురాద్‌కు నచ్చచెప్పాను. అతడు అక్కడే లొంగిపోయాడు. నా కుమారుడిని అతడు 'మిత్రుడు' అనుకుంటాడు. కాని, నా కుమారుడక్కడ కమాండర్ కాడు. అందువల్ల ఇతడక్కడికి వెళితే, సైనికాధికారుల మధ్య మనస్పర్ధలు వచ్చే అవకాశముంది. పైగా, వోడ్విజెన్‌స్కయ శత్రుదేశానికి అతి సమీపంలో వుంది. హాజీమురాద్ ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే గ్రోజ్నీయే సరైన చోటు.

అతడు అడిగిన ఇరవైమంది కోసక్కుల తోపాటు నా నమ్మినబంటు, అత్యుత్తమ ఆఫీసర్ లారిస్ మెలికోవ్‌ను కూడా వెంట పంపిస్తున్నాను. అతడు టార్టార్ బాగా మాట్లాడగలడు. హాజీమురాద్ గురించి బాగా తెలుసు. మంచి పరిచయం కూడా వుంది. హాజీమురాద్‌కు తన యింట్లో ఆతిథ్యమిచ్చిన ప్రిన్స్ టార్కనోవ్ కూడా నమ్మకస్తుడే. అతడితో నేనీ విషయం చర్చించాను. నేను చేసిన పని సరైనదనే అతని అభిప్రాయం. హాజీమురాద్‌ను అతిథిగా చూడాలి. లేదా జైల్లో పెట్టాలి లేదా దేశం నుండి బహిష్కరించాలి.

ఈ చివరి రెండు పనులవల్ల హాజీమురాద్-షామిల్‌ల వైరంవల్ల మనకొనగూడిన లాభం పోగొట్టుకుంటాం. హాజీమురాద్ మన పక్షం వుంటే, ప్రజలు షామిల్ మీద తిరుగుబాటు చేసే అవకాశముంది. హాజీమురాద్ నిజాయితీని టార్కనోవ్ విశ్వసిస్తున్నాడు. షామిల్ తనను క్షమించి, వదిలివేసే ప్రసక్తిలేదని హాజీమురాద్‌కు తెలుసు. షామిల్‌కు అతను దొరికితే చంపటం ఖాయం. కాకపోతే యిద్దరి మధ్యా మతం ఒక ముఖ్యమైన బంధంగా కనిపిస్తుంది. ఇద్దరికీ మతమే సర్వస్వం. అయితే షామిల్ మతాన్ని అంతగా వాడుకునే అవకాశం లేదనుకుంటాడు టార్కనోవ్. మత బంధాన్ని అంగీకరించినప్పటికీ, షామిల్‌కు చిక్కటమంటూ జరిగితే హాజీమురాద్ మరణించినట్టే.

ప్రస్తుత పరిస్థితుల గురించి యిదీ నేను మీకు సమర్పించే నివేదిక.

★ ★ ★

1851 డిసెంబర్ 24నాడు టిఫ్లిస్ నుండి

ఒక స్పెషల్ మెసెంజర్ ఈ రిపోర్ట్ తీసుకుని బయల్దేరాడు. వారం రోజులు నిర్విరామంగా అంచెలంచెలుగా పయనించి గుర్రాల్ని కొరడాలతో కొట్టి నెత్తుర్లు కారించి, అత్యంత వేగంగా పరిగెత్తించి, 31 వ తేదీన మినిస్టర్ ఆఫ్ వార్ చెర్నిషోవ్‌కు అందచేశాడు. 1 జనవరి 1852 నాడు చెర్నిషోవ్ ఈ నివేదికను యితర అధికార సమాచారంతోపాటు, చక్రవర్తి నికోలస్‌కు సమర్పించాడు. చెర్నిషోవ్‌కు వొరొంట్సోవ్ అంటే గిట్టదు. అత్యంత సంపన్నుడూ, కులీనుడూ కావటంవల్ల ఇతర సైనికాధికారులతో పోలిస్తే వొరొంట్సోవ్‌కు పరపతి ఎక్కువ. చెర్నిషోవ్ సామాన్యుడు. కేవలం ఉద్యోగం వల్లే ఈ మాత్రమైనా గౌరవ ప్రతిష్టలొచ్చాయి. చక్రవర్తికి వొరొంట్సోవ్ అంటే ఇష్టం. అందువల్ల అవకాశం దొరికినప్పుడల్లా అతడి దగ్గర వొరొంట్సోవ్ గురించి చెడుగా చెప్పటానికి ప్రయత్నిస్తాడు.

ఇదివరలో కాకేసియన్ పరిణామాలపై నివేదిక అందజేసినప్పుడు కేవలం వొరొంట్సోవ్ అసమర్థత, అశ్రద్ధ వల్ల అనేక మంది సైనికులు ప్రాణాలు పొగొట్టుకున్నారని చెప్పాడు. ఇప్పుడు హాజీమురాద్ విషయంలో కూడా వొరొంట్సోవ్ వైఖరి, ప్రస్తుతానికి నష్టం కలిగేదిగా ఉందని నమ్మించాలి. రష్యన్ ప్రయోజనానికి వ్యతిరేకంగా అతడు స్థానిక ప్రజలను ప్రోత్సహిస్తున్నాడని చక్రవర్తికి నివేదించాలి. అసలు హాజీ మురాద్ ప్రభుత్వానికి నిజంగా లొంగిపోయాడా లేక షామిల్ తరఫున గూడచారిగా వచ్చాడా? అతణ్ణి మధ్యరష్యాకు తరలించి తన నిజాయితీని నిరూపించుకున్న తర్వాత కుటుంబ సభ్యులను షామిల్ చెర నుండి విడిపించిన తర్వాత మాత్రమే అతడికేవైనా బాధ్యతల్ని అప్పగించటం శ్రేయస్కరం.

అయితే చెర్నిషోవ్ వేసుకున్న ప్రణాళిక ఫలించలేదు. ఆరోజు చక్రవర్తి కోపంగా, చికాకుగా ఉన్నాడు. ఎవరి సలహానూ అంగీకరించే మూడ్‌లో లేడు. ముఖ్యంగా అతడు చెర్నిషోవ్‌ను గత్యంతరం లేక, భరిస్తున్నాడే తప్ప అతడంటే ఏమాత్రం ఇష్టంలేదు. కొందరు తిరుగుబాటుదారుల మీద విచారణ జరిగినప్పుడు, వాళ్ళకెలాగైనా శిక్షపడాలని ఇతడు అత్యుత్సాహం ప్రదర్శించాడు. ఆ తర్వాత వాళ్ళ ఆస్తులు లాక్కోవటానికి ప్రయత్నించాడు. అందువలన చక్రవర్తి మనసు బాగోలేని కారణంగా హాజీమురాద్‌కు యథాస్థితి కొనసాగింది.

★ ★ ★

ఉదయం తొమ్మిదిన్నర. మంచు కురుస్తున్నది. థర్మామీటర్ మైనస్ 13 డిగ్రీలు ఫారన్‌హీట్ చూపిస్తున్నది. పొడుగాటి కోటూ, క్యాప్, ఇతర సైనిక లాంఛనాలతో గుర్రపుబండి దిగి వింటర్‌ప్యాలెస్‌లోకి ప్రవేశించాడు చెర్నిషోవ్. సహాయ యుద్ధ మంత్రి ప్రిన్స్ వాసిలి దోల్గోరుస్కీ ఏదో ఆందోళనలో ఉన్నట్టు కనిపించినా, ఎదురు వచ్చి మర్యాదగా లోపలికి ఆహ్వానించాడు.

"చక్రవర్తి గారు?" అంటూ అతిమర్యాదగా వాకబు చేశాడు చెర్నిషోవ్.

నిశ్శబ్దం ఎక్కడ భగ్నమవుతుందోన

న్నంత భయంగా, అతి మంద్రస్వరంలో నిరీక్షించమన్నాడు దోల్గోరుస్కీ. చక్రవర్తి అధికార నివాసంలో ఉద్యోగం చేస్తున్నందుకు తనూ చక్రవర్తిననే అనుకుంటాడతను. మనిషి కదలకుండా నిటారుగా నడుస్తాడు. తల మీద నీళ్ల జగ్గుపెడితే, ఒక్క చుక్కకూడా కిందపడదు. చలిలో వచ్చినప్పుడు, కాళ్లు చచ్చుపడినట్టుగా వున్నాయేమో, కాస్త అటూఇటూ తిరిగి రక్త ప్రసరణ పెంచుకోవడానికి ప్రయత్నించాడు చెర్నిషోవ్.

ఆనాటి అపాయింట్‌మెంట్ల ఫైలును మరోసారి చెక్ చేసుకుని, చక్రవర్తిగారి గది తలుపు వారగా తెరచుకుందో లేదో.. చెర్నిషోవ్‌ను లోపలికి వెళ్ళమని సైగచేశాడు దోల్గోరుస్కీ.

అగ్నిప్రమాదం తర్వాత వింటర్ ప్యాలెస్‌ను పునర్నిర్మించారు. మొదటి అంతస్తులో చక్రవర్తి నికొలస్ నివాసం. మంత్రులూ ఇతర ఉన్నతోద్యోగులతోనూ సంప్రదించటానికి ఓ విశాలమైన హాల్ ఉంది. చక్రవర్తి అలెగ్జాండర్ చిత్రపటం ప్రముఖంగా ఓ గోడకు వేలాడుతుందక్కడ.

ఓ టేబుల్ వెనక కూర్చున్నాడు నికొలస్. అతనిది మహాకాయం. బానపొట్టను భరించలేనట్టుగా వెనక్కువాలి కూర్చున్నాడు. గదిలోకి ప్రవేశించిన వాళ్లను నిరాసక్తంగా చూస్తాడు. కళ్ళలో వెలుగు లేదు. మొహం పాలిపోయివుంది.

జుత్తు పలచబడి నుదురు విశాలంగా కనిపిస్తున్నది. మీసాలకింద పెదాలు సరిగా కనిపించడం లేదు. కొవ్వు పెరిగి క్రిందికి జారిన చెక్కిళ్లు మాంసం ముద్దల్లా ఉన్నాయి. అతడు అలసిపోయి నీరసంగా వుండటానికి కారణముంది.

సహజంగానే మూడ్ బాగాలేదు. క్రితం రాత్రి అతనో ఫ్యాన్సీడ్రెస్ పార్టీలో కాసేపు గడిపాడు. ఆశ్వికగార్డుల యూనిఫారంలో, హెల్మెట్ మీద పక్షిని అలంకరించుకుని భారీగా కదిలిందా శరీరం. శరీరం ఎలా ఉన్నా ఆత్మవిశ్వాసానికి కొదవ వుండదు. మెరుస్తున్న తెల్లటి చర్మంతో, మధుర స్వరంతో పలుకరించిన సుందరాంగి ఒకతె అక్కడ తిరిగి కనిపించింది. అంతకుముందొకసారి ఆమె ఇలాంటి పార్టీలోనే తళుక్కున మెరిసి మాయమైంది.

నిన్న కనిపించగానే ఆమెను వెంటతీసుకొని ఏకాంతం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మందిరానికి వెళ్లాడు. అయితే అక్కడ తలుపు తీయటానికి ద్వారపాలకుడు సిద్ధంగా లేడు. చికాకుపడి, స్వయంగా తలుపు తోసుకొని మర్యాద కోసం ఆమెను ముందు లోపలికి వెళ్లమని తనూ గదిలోకి ప్రవేశించాడు. అప్పటికే గదిలో మరోజంట ఉంది. స్త్రీ ఉలిక్కిపడి మొహంమీది ముసుగు తొలగించిందిగాని, పురుషుడు భయంతో నిశ్చేష్టుడై కళ్లు తేలేశాడు. ఎదురుగా సాక్షాత్తూ చక్రవర్తి!

తనను చూసి అందరూ బిక్కచచ్చి గజగజా వణికిపోతారని తెలిసిన నికొలస్, దయగా ఆ యువకుడితో "నాకన్నా చిన్నవాడివి కాసేపు నన్నిక్కడ విశ్రమించనీ" అన్నాడు.

దిగ్గున లేచి కూర్చుని, ఎర్రబడిన మొహంతో, ఏపని ముందుచెయ్యాలో తెలియని తికమకలో, తన ప్రేయసిని తీసుకుని బిత్తరచూపులు చూస్తూ పిల్లిలా నిష్క్రమించాడా యువకుడు.

నికొలస్ వెంటవచ్చిన అమ్మాయికి ఇరవై ఏళ్ళుంటాయి స్వీడిష్ గవర్నెస్ కూతురామె. తాను చిన్నపిల్లగా వున్నప్పటినుండీ, చక్రవర్తిగారి చిత్రపటాలు చూసి ఆయనమీద ఎలా మనసు పారేసుకుందో ముద్దుముద్దుగా చెప్పింది. తన ఆరాధ్యదైవం ఆయన. ఆయన కంట్లో పడటానికి

తనెన్నిసార్లు ఎన్నిరకాలుగా ప్రయత్నించిందో! ఇన్నాళ్ళకు తన కోరిక నెరవేరింది.

ఆ ఏకాంత మందిరంలో నికొలస్ గంట కుపైగా ఆమెతో గడిపాడు.

ఆ తర్వాత తన పడకగదికి వచ్చి పడుకున్నాడుగాని ఓ పట్టాన నిద్రపట్టలేదు. ఈపిల్ల ముఖంలోని ఆనందాన్నీ, కళ్ళమెరుపునూ చాలాకాలంగా తన ఉంపుడుకత్తెగా వున్న నెలిడోవానూ పోల్చిచూశాడు. వివాహితులకు పరస్త్రీలతో సంబంధముండకూడదన్న ఆలోచన ఆయన్నేమాత్రం బాధించలేదు. అది అనైతికమని ఎవరైనా చెబితే అతను ఆశ్చర్యపడతాడు కూడా. ఇలా చెయ్యటంలో తప్పు లేదనుకున్నప్పటికీ, తీపి తిన్నా నాలిక ఎందుకు చేదెక్కిందో తెలియలేదు. ఇలాంటి ధర్మ సందేహాలన్నీ మరచిపోవటానికి తనదగ్గర మంచి మత్తు మందుంది. తన గొప్పదనం, ఘనత, కీర్తిప్రతిష్టల గురించి తలచుకుంటే సరి.

ఆలస్యంగా పడుకున్నా, తెల్లవారి ఎనిమిదింటికే నిద్రలేచాడు చక్రవర్తి. టాయ్‌లెట్‌కు వెళ్లివచ్చి, బలిసిన శరీరాన్ని మంచు ముక్కలతో మర్దన చేసుకున్నాడు. బాల్యంలోనే కంఠస్తమైన ప్రార్థనలు చేశాడు. అలవాటుగా, మొక్కుబడిగా చెయ్యటమేగాని అతడి జీవితంలో ప్రార్థనలకు విలువలేదు.

మరికాసేటికి దుస్తులు ధరించి వింటర్‌ప్యాలెస్ వసారాలోనికి నడిచాడు. అక్కడ ఇంచుమించు తనంత భారీకాయుడైన ఓ కుర్రాడు ఏదో పనిలో నిమగ్నమై కనిపించాడు. యూనిఫాంను బట్టి వాడు స్కూల్లో న్యాయశాస్త్రం అభ్యసిస్తున్నట్టుగా తెలిసింది. స్వంతంగా ఆలోచించమని బోధిస్తారక్కడ. క్రమశిక్షణ, ప్రభు విధేయతకన్న స్వేచ్ఛ ఎక్కువ అభిలషణీయం కాదుగద. అలాంటి స్కూళ్లు తనకు నచ్చవు. కాని శరీరంసైజో, లేక తనను చూసి వాడు శాల్యూట్ చేసిన పద్ధతో అతడి కోపాన్ని కాస్త తగ్గించింది.

"నీ పేరేమిటి? "

"పొలసాటోన్, మహాప్రభూ!"

"గుడ్"

కుర్రాడు శాల్యూట్ చేస్తున్న పొజిషన్‌లోనే నిలుచున్నాడు.

నికొలస్ వాణ్ణి చెయ్యికిందికి దించమన్నాడు.

"సైన్యంలో చేరతావా? "

"లేదు మహాప్రభూ"

"మూర్ఖుడు!" అంటూ విసుక్కుని నికొలస్ తన నడక కొనసాగించాడు. అయితే అసంకల్పితంగా అతనో పేరు పదేపదే ఉచ్చరించాడు.

'కోపెర్వైన్.... కోపెర్వైన్...' అది నిన్నటి పిల్లపేరు. మళ్లీ నోటి చేదు గుర్తుకొచ్చి 'నేను లేకపోతే రష్యా ఏమైపోతుంది.. రష్యామాత్రమే కాదు. మొత్తం యూరోప్ ఏమైపోతుంది..' అనుకుంటూ ఆత్మవిశ్వాసం పెంచుకున్నాడు. తనతో పోలిస్తే ప్రష్యన్‌రాజు ఎంత మూర్ఖుడు, ఎంత అసమర్థుడు, తనెంత చతురుడు....

గదికి తిరిగి వస్తున్నప్పుడు గుర్రబ్బండి దిగుతూ హెలెనా పావ్లోవ్నా కనిపించింది. అతడి దృష్టిలో ఇలాంటివాళ్లు నిరర్థకజీవులు. ఆమె తనతో కవిత్వం, సైన్స్ గురించి చర్చించటానికి ప్రయత్నిస్తుంది. పరిపాలనా వ్యవహారాల గురించి సలహా లివ్వాలనుకుంటుంది. ఈ విషయాలు కూడా ఆమెకు తనకన్నా ఎక్కువ తెలుసా ఏమిటి? ఇలాంటి వాళ్లందర్నీ చెవులూ, నోరూ మూయించి ఓ మూల కూర్చోపెట్టాలి. పట్టించుకోవద్దని ఎంత ప్రయత్నించినా వీళ్లు తనను చికాకు పరుస్తూనే వున్నారు. అంతలోనే మృతి చెందిన సోదరుడు మిఖైల్ పావ్‌లోవిచ్ మదిలో మెదిలాడు. మళ్లీ 'ఆమె' జ్ఞాపకం. అలా పలు విధాల ఆలోచనలతో తన ఆఫీసు గదిలోకి ప్రవేశించాడు నికొలస్. ఇక ఒక్కొక్కరూ వస్తారు. మీసాలు దువ్వుకున్నాడు. బట్టతల మీద విగ్గు సరి చేసుకున్నాడు. అద్దంలో మొహం చూసుకున్నాడు.

తలుపు తెరుచుకుంది. చెర్నిషోవ్ ప్రవేశించాడు. చక్రవర్తి ముఖ కవళికలు, కళ్లు చూడగానే తెలిసిపోయింది, అతడి మూడ్ సరిగా లేదని. క్రితం రాత్రి జరిగిన 'రాసలీల' గురించి విన్నాడు గనక, కారణం కూడా తెలిసింది. ముభావంగా పలకరించి కూర్చొమ్మని సైగ చేశాడు. మొదట కమిషనరేట్ ఉద్యోగులు కొందరు డబ్బు గల్లంతు చేశారని నివేదించాడు చెర్నిషోవ్. ఆ తర్వాత ప్రష్యన్ సరిహద్దు గురించిన రిపోర్టు. నూతన సంవత్సరం అవార్డులు

ప్రకటించాల్సిన వ్యక్తుల వివరాలు (గత సంవత్సరం విస్మరించిన వారిని ఈసారి పరిగణనలోకి తీసుకోవాలి), హాజీమురాద్ గురించి వొరొంట్సోవ్ ఇచ్చిన సమాచారం ఉండనే ఉంది. చివరగా ఒక వైద్య విద్యార్థి, ప్రొఫెసర్ మీద చేసిన హత్యాప్రయత్నం!

డబ్బు గల్లంతు కావటం గురించి చెప్పినప్పుడు, పెదాలు నొక్కుకుంటూ మౌనంగా విన్నాడు నికొలస్. కొందరే మిటి? అందరూ దొంగతనానికి పాల్పడే ఉంటారు. వీళ్లను శిక్షించక తప్పదు. సైన్యంలో చేరమంటే సరి. కాని ఒకసారి అవినీతికి పాల్పడినవాళ్లు అక్కడ మాత్రం ఏదో చేయకుండా ఉంటారా?

"దేశంలో అవినీతి పెరిగిపోయింది. నిజాయితీగా తనలాగా విధులు నిర్వహించేవాడొక్కడన్నా వున్నాడా అసలు? " అని ఆశ్చర్యం ప్రకటించాడు.

చక్రవర్తి గారి మనసు తెలిసిన చెర్నిషోవ్ "అవును, యువర్ ఇంపీరియల్ మెజెస్టీ!" అన్నాడు వినయంగా.

"ఆ సంగతి వదిలెయ్. నా నిర్ణయం తర్వాత చెబుతానులే" అన్నాడు నికొలస్, కాగితాలు ఎడం పక్కకు తోసి.

ఆ తర్వాత అవార్డుల విషయం, సైన్యాన్ని ప్రష్యన్ సరిహద్దుకు తరలించే విషయం.

అవార్డుల జాబితా తీసుకుని గబగబా కొన్ని పేర్లు కొట్టేసి, తిరిగి ఇస్తూ, రెండు డివిజన్లను ప్రష్యన్ సరిహద్దుకు తరలించమన్నాడు. 1848 సంఘటనల తర్వాత, రాజరికానికి బదులు రాజ్యాంగబద్ధ పాలనను అంగీకరించాడు ప్రష్యన్ రాజు (నికొలస్ బావమరిది). అందువల్ల వుత్తరాల్లో ఎంత ప్రేమ కురిపించినా, సరిహద్దుల్లో కొంత సైన్యాన్ని మోహరించటమే క్షేమకరం. ప్రష్యన్లు తిరుగుబాటు చేస్తే అతడ్ని రక్షించేందుకు ఈ సైన్యం పనికొస్తుంది (యురోప్‌లోని అన్ని దేశాల్లోనూ తిరుగుబాట్లు జరిగే అవకాశముందని నికొలస్ నమ్మకం!). 1848లో తిరుగుబాటు జరిగినప్పుడు తానే కదా తన బావమరిదిని రక్షించింది!

రష్యా సహాయం చెయ్యకపోతే పరిస్థితి ఎలా ఉండేదో!

"అవును, యువర్ ఇంపీరియల్ మెజెస్టీ!"

"ఇంకేమైనా పనుందా? "

వొరొంట్సోవ్ పంపిన నివేదిక, హాజీమురాద్ లొంగుబాటు గురించి చెప్పాడు చెర్నిషోవ్.

"గుడ్. శుభ పరిణామమే గదా!"

"ఇదంతా మీ ఆలోచనేగదా!"

తన వ్యూహాత్మక ఎత్తుగడల గురించి ఎవరు ప్రశంసించినా, మహా సంతోషపడిపోతాడు నికొలస్. నిజానికి ఏ ఎత్తుగడలూ తెలియవతనికి. తన సహాయకులు, తమ వ్యూహాలను అతనికి ఆపాదిస్తారు. అయితేనేం.. అదంతా తన తెలివితేటల ఫలితమే అంటే వినడానికి గర్వంగా ఉంటుంది.

"ఎలాగంటావు? "

"మీ ఆజ్ఞల్నే మేం తూచా తప్పకుండా పాటించాం మెజెస్టీ! శత్రువుల దారులన్నీ మూసేశాం. ఆహార సరఫరా మార్గాలను మూసేశాం. ఇక తనకు గత్యంతరం లేదని తెలిసే హాజీమురాద్ లొంగిపోయాడు"

"నిజమే"

నిజానికి చెర్నిషోవ్ చెప్పిన వ్యూహం ఎర్మోలోవ్, మెల్యామినోవ్‌లు రూపొందించింది. నికొలస్ తక్షణమే షామిల్ మీద దాడి చేసి అందర్నీ చంపెయ్యమన్నాడు. శత్రువు లొంగిపోయే పరిస్థితులు కల్పించాలన్నారు వాళ్లు (నికొలస్ ఆజ్ఞ ప్రకారం చేసిన దార్గో యుద్ధంలో రష్యన్ సైనికులు

చాలా మంది మృతి చెందారు). ఈ వేచి చూసే వ్యూహం కూడా తనదే అని నికొలస్ తనను తాను నమ్మించుకున్నాడు. శత్రువులకు రక్షణ ఇచ్చిన అరణ్యాలను నరికివేసి, ఆహార సరఫరా అడ్డుకుని, ఆకలికి మాడ్చి రక్షణ లేకుండా చెయ్యటం కూడా తనదేనంటే నిజానికి దార్గో యుద్ధానికి తన అనుమతి ఇవ్వటం తప్పని అంగీకరించటమే. అయినా నిత్యం, ప్రతిక్షణం పొగడ్తల వర్షంలో తడుస్తున్న అతనికి, తన నిర్ణయాలలోని వైరుధ్యం కనిపించలేదు. హేతుబద్ధమైన ఆలోచనకు అతీతుడు అతడు. 'సింపుల్ కామన్‌సెన్స్' కూడా లేని నిర్ణయాలవి. అయినా వంది మాగధులు అతణ్ణి 'జీనియస్' అని కీర్తిస్తారు. వైద్య విద్యార్థి గురించిన అతడి నిర్ణయం అతడి 'జీనియస్'కు తార్కాణం.

ఇదీ అసలు సంగతి! రెండుసార్లు ఫెయిలయిన వైద్య విద్యార్థి మూడోసారి పరీక్ష రాశాడు. ప్రొఫెసర్ ఈసారీ అతణ్ణి పాస్ చెయ్యకపోవటంతో ఉద్దేశపూర్వకంగా తనను సతాయిస్తున్నాడని క్షణికోద్రేకంలో, టేబుల్ మీది పెన్‌నైఫ్ తీసుకొని ప్రొఫెసర్‌ను పైపైన పొడిచాడు.

"విద్యార్థి పేరేమిటన్నావు? "

"జెవోస్కీ"

"పోలిష్ వాడా? "

"పొలిష్ సంతతి. రోమన్ కాథలిక్కు"

నికొలస్ నుదురు చిట్లించాడు. అతడిప్పటికే పోలిష్ ప్రజలను చాలా కష్టాల పాలు చేశాడు. తను కష్టపెట్టాడు గనుక వాళ్లంతా దుర్మార్గులని తనను తాను నమ్మించుకోవాలి. తను వాళ్లకెంత అపకారం చేస్తే వాళ్లంత పాపులైఉండాలి.

"ఒక క్షణం ఆగు" అని కళ్లు మూసుకున్నాడు నికొలస్. ఇలా చెయ్యటం చెర్నిషోవ్ చాలాసార్లు చూశాడు. కళ్లు మూసుకొని రెండు నిమిషాలు ఆలోచిస్తే అతనికి ఎంత జటిల సమస్యకైనా సమాధానం దొరుకుతుంది. అంతరాత్మ ప్రబోధమే అన్నీ నిర్ణయిస్తుంది. పోలిష్ సంతతి ప్రజలపట్ల తనకున్న ద్వేషాన్ని సమర్థించుకోవటానికి వాళ్లమీద ఏ నిందలు మోపాలి? ఈ ఒక్క సంఘటన చాలు, తనకు పోలండ్ దేశం మీద అసహ్యం కలగటానికి. రిపోర్టు మీద మార్జిన్‌లో పెద్ద పెద్ద అక్షరాలతో, తప్పుల తడక భాషలో యిలా రాశాడు-

"మరణ శిక్షకు అర్హుడు. కాని భగవాన్, మన దేశంలో మరణశిక్ష అమలులో లేదే! దాన్నిప్పుడు ప్రవేశపెట్టడం నాకిష్టం లేదు. వెయ్యిమంది సైనికుల దెబ్బలను తట్టుకుని పన్నెండుసార్లు పరిగెత్తాలతడు" ఆ తర్వాత ఆ తన 'తీర్పు' కింద సంతకం చేసి తృప్తిగా చూశాడు.

పన్నెండువేల లారీ దెబ్బలను తట్టుకోవటమంటే మృత్యువు సంగతెందుకు గాని, కనీవినీ ఎరుగని చిత్రహింస అది. ఎంత బలవంతుడైనా చావటానికి అయిదువేల దెబ్బలు చాలు. కాని ఇలాంటి దుష్టుల పట్ల జాలి చూపకూడదు. మరణశిక్ష లేదు గనక, ఇంతకన్నా సరైన శిక్ష మరేముంటుంది!

"చదువు"

చదివి, వినయంగా తలూపుతూ చక్రవర్తి గారి అపూర్వ ప్రతిభను, ఇంతఘోరం చేసినా కేవలం దెబ్బలతో వదిలేసిన చక్రవర్తిగారి జాలి గుండెనూ పొగిడాడు చెర్నిషోవ్.

"ఈ శిక్ష అమలు జరిగినప్పుడు, మిగతా విద్యార్థులందరూ మైదానంలోనే ఉండాలి. తిరుగుబాట్లు చేస్తారా! వాళ్ల విప్లవ భావాల్ని కూకటివేళ్లతో పెకలించేస్తా"

"మీ ఆజ్ఞను అమలు పరుస్తా మెజెస్టీ" అని, వొరొంట్సోవ్ రిపోర్టు గురించి ప్రస్తావించాడు చెర్నిషోవ్.

"ప్రిన్స్ వొరొంట్సోవ్‌కు జవాబు ఏం రాయమంటారు? "

"చెచెన్యాకు దారులన్నీ మూసేయాలని నేనిదివరకే ఆదేశించానుగా. వాళ్ల ఆహార సరఫరాను అడ్డుకోవాలి. తరచూ దాడులు చేసి వాళ్లను చికాకు పరచాలి"

"హాజీమురాద్ గురించి మీ ఆదేశమేమిటి? "

"అతడి సేవలు కాకసస్‌లో వాడుకుంటానన్నాడు వొరొంట్సోవ్? "

"కాని అది ప్రమాదాన్ని కొని తెచ్చుకోవటం కాదా? "

నికొలస్‌ను సూటిగా చూడలేక "ప్రిన్స్ వొరొంట్సోవ్ రిపోర్ట్‌లో స్పష్టత లేదు" అన్నాడు చెర్నిషోవ్ వినయంగా.

"నీ అభిప్రాయమేమిటి? "

"హాజీమురాద్‌ను సెంట్రల్ రష్యాకు తరలించటం మంచిదనుకుంటాను"

"నువ్వలా అనుకుంటున్నావా, సరే. నేనతడి ప్రతిపాదనను అంగీకరిస్తున్నానని రాయి"

"తమరి ఆజ్ఞ" అంటూ తలొంచుకుని లేచి నిలబడ్డాడు చెర్నిషోవ్.

అప్పటిదాకా నిశ్శబ్దంగా కూర్చున్న దోల్గోరుస్కీ కూడా లేచాడు.

చెర్నిషోవ్ తర్వాత పశ్చిమ ప్రాంతాల గవర్నర్ బిబికోవ్‌తో సంప్రదింపులు జరిపాడు నికొలస్. అక్కడి రైతులు సంప్రదాయ క్రైస్తవాన్ని తాము అంగీకరించం అని తిరుగుబాటు చేశారు. ఆ తిరుగుబాటుదారులందర్నీ కోర్ట్‌మార్షల్ చెయ్యమని బిబికోవ్‌ను ఆదేశించాడు తను. కోర్ట్ మార్షల్ అంటే వేలాది లారీ దెబ్బలకన్నా తక్కువేమీ కాదు. ప్రభుత్వాజ్ఞను ధిక్కరించిన వేలాది మంది రైతులు దూరంగా వున్న ప్రభుత్వ భూములను సాగుచెయ్యాలని మరో ఆదేశం కూడా జారీ అయ్యింది. ఈ వార్త ప్రచురించిన స్థానిక పత్రిక సంపాదకుడిని నిర్బంధ సైనిక వుద్యోగం చెయ్యమని కూడా ఆదేశించారు అధికారులు.

"అనివార్యమనుకున్న నిర్ణయాలే తీసుకుంటున్నాను. వీటి గురించి చర్చించవలసిందేమీ లేదు" అన్నాడు నికొలస్.

ఈ నిర్ణయాల వెనకున్న హింసను, క్రౌర్యాన్ని అర్థం చేసుకున్నాడు బిబికోవ్. రైతులకు స్థానచలనం కలిగించటమంటే వాళ్లను తిరిగి అర్ధబానిసలుగా మార్చడమే. కాని చక్రవర్తి ఆజ్ఞకు తిరుగులేదు. తను అసమ్మతి ప్రదర్శించలేడు. అలా చెయ్యటమంటే నలభై ఏళ్ల కష్టపడి ఇటీవలే సంపాదించుకొన్న ఈ వుద్యోగాన్ని వదులుకోవటమే. అందువల్ల వినయంగా తలవంచి తన అంగీకారం తెలిపాడు బిబికోవ్. చక్రవర్తి ఆజ్ఞ ఎంత మూర్ఖమైనదైనా, ఎంత అమానుషమైనదైనా అధికారులు దాన్ని శిరసావహించక తప్పదు.

బిబికోవ్ నిష్క్రమించిన తర్వాత ఆనాటి కార్యక్రమం ముగించినందుకు తృప్తిగా నిట్టూర్చి ఒళ్లు విరుచుకున్నాడు నికొలస్. గడియారం వైపు చూశాడు. బయట తిరిగి రావటానికి టైమయింది. యూనిఫాం, లాంఛనాలు ధరించి రిసెప్షన్ హాల్లోకి వచ్చాడు. వందమందికి పైగా స్త్రీలు, పురుషులు తమ తమ స్థానాల్లో నిల్చుని తన

దర్శనం కోసం నిరీక్షిస్తున్నారక్కడ. ఇంత మంది తనకోసం చూస్తున్నారని తెలిసి నిర్జీవంగా వున్న కళ్లలో మెరుపు వచ్చింది. గాలి పీల్చుకోవటంతో ఛాతీ పెరిగింది. పొట్టకిందకి జారిపోకుండా పట్టీలు కట్టుకుని గంభీరంగా అడుగువేశాడు. తన గురించి తనకు గర్వంగా ఉంది. కొంత మంది ముందు ఒక నిమిషం ఆగి రష్యన్‌లోనూ, ఫ్రెంచిలోనూ పలుకరించాడు.

అందరినుండీ నూతన సంవత్సర శుభాకాంక్షలు స్వీకరించి చర్చికి బయల్దేరాడు. అక్కడ దేవుడు, తన సేవకులైన ప్రీస్టుల ద్వారా అందరిలాగే నికొలస్‌ను పొగుడుతాడు. విసుగొస్తుంది గాని, వినటానికి ప్రశంసలు బాగానే ఉంటాయి. అవును మరి, లోకకళ్యాణం తన మీద ఆధారపడి ఉంది. ఈ ప్రపంచం సజావుగా నడవటానికి తన అవసరం ఎంతైనా వుంది.

చర్చిలో ప్రార్థనల అనంతరం, డీకన్, 'దీర్ఘాయుష్మాన్‌భవ' గానం చేసినప్పుడు ఆయన దృష్టి, కిటికీ దగ్గర నిల్చున్న నెలిడోవా మీదికి మళ్లింది. వెంటనే ఆమెను, నిన్నటి పిల్లతో పోల్చుకున్నాడు.

ఆ తర్వాత భార్య (ఎంప్రెస్)తో, పిల్లలతో కొంతసేపు గడిపాడు. తన దర్బారు వ్యవహారాలు చూసే మంత్రి వొల్కొన్స్కీని కలిసి, నిన్నటి సుందరి తల్లికి సాలీనా భరణం మంజూరు చెయ్యమని ఆదేశించాడు.

పాంపెయన్ హాల్లో ఆనాటి డిన్నర్ ఏర్పాట్లు జరిగాయి. కుటుంబ సభ్యులతో పాటు కొందరు రాయబారులు, యితర వున్నతాధికారులు కూడా టేబుల్ అలంకరించారు.

చక్రవర్తి ఆగమనం కోసం నిరీక్షిస్తున్న బేరన్ లీవెన్, ప్రష్యన్ రాయబారి మధ్య పోలెండ్ గురించి ఒక ఆసక్తికరమైన చర్చ జరిగింది. కాని చక్రవర్తి వచ్చి హాజీమురాద్ లొంగుబాటు గురించి చెప్పాడు. అరణ్యాలు నరికి, చెచెన్లకు నిలువ నీడలే కుండా చేస్తున్నాడు. అందువల్ల యిక త్వరలో యుద్ధం ముగుస్తుంది. మిగతా వాళ్లూ లొంగిపోతారు. దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధమై, ఆ ప్రాంతంలో చిన్న చిన్న దుర్గాలు కూడా నిర్మిస్తున్నాడు.

నికొలస్ వ్యూహ రచనను రాయబారి ప్రశంసించాడు. అలా చెయ్యటం వల్ల చక్రవర్తి సంతోషిస్తాడని అతడికి తెలుసు.

డిన్నర్ తర్వాత నృత్య నాటిక చూడటానికెళ్లాడు నికొలస్. వందలాదిమంది సుందరాంగనలు అక్కడ చాలీచాలని దుస్తుల్లో కనువిందు చేశారు. అందులో ఒకావిడ అతణ్ణి బాగా ఆకర్షించింది. ఆమెకు వజ్రపుటుంగరం కానుకగా యివ్వమని బాలెమేనేజర్‌కు సూచించాడు నికొలస్.

మరునాడు చెర్నిషోవ్ మళ్లీ వచ్చాడు. వొరొంట్సోవ్ గురించిన ఆదేశాలలో మార్పులేదు. హాజీమురాద్ లొంగిపోయాడు గనక చెచెన్లమీద అణచివేత చర్యలు మరింత తీవ్రం చెయ్యాలి.

ఆ ఆజ్ఞలు వొరొంట్సోవ్‌కు చేరవేయటానికి మరో కొరియర్ ఆగమేఘాల మీద టిఫ్లిస్‌కు బయల్దేరాడు.

5

చక్రవర్తి ఆదేశానుసారం 1852 జనవరిలో, ఆజ్ఞలు జారీ అయిన నెలలోపే

చెచెన్యా మీద దాడి జరిగింది.

నాలుగు పదాతిదళాల బెటాలియన్లు, రెండు కోసక్కుల కంపెనీలు, మరో ఎని మిది సాయుధ దళాలు ఈ దాడిలో పాల్గొన్నాయి. రోడ్డుమార్గం ద్వారా నడిచి వెళ్లిన దళాలకు రెండువైపులా గొర్రెతోలు కోట్లు, ఎత్తైనబూట్లు, పొడుగాటి క్యాప్‌లు, రైఫిళ్లు ధరించిన సైనికులు అదనపు రక్ష ణగా వున్నారు.

శత్రు ప్రాంతంలో ప్రవేశించారు గనక వీలైనంత వరకు నిశ్శబ్దంగా వుండటానికి ప్రయత్నించారు. అప్పుడప్పుడూ తుపాకీ దేనికో తాకి కాస్త చప్పుడైంది. ఓ గుర్రం సకిలించింది. సైనికులు వరుసలో కదలన ప్పుడు కమాండర్ కసురుకున్నాడు. ఒక సారి పొదల్లోంచి రెండు జింకలు ఒకదా న్నొకటి వెంటాడుతూ వచ్చినప్పుడు సైనికు లకు నవ్వాగలేదు. కొందరు వాటిని బ యోనెట్‌లతో పొడవటానికి ప్రయత్నిం చారు కాని అవి ఎవరికీ చిక్కలేదు. అశ్వి కులూ, వెంటవున్న జాగిలాలూ వెంబడిం చినా అవి చెంగుచెంగున గెంతి పర్వతాల్లో అదృశ్యమయ్యాయి.

అది చలికాలం. ఉదయమే బయల్దేరిన సైన్యం మధ్యాహ్నమయ్యే సరికి మూడు మైళ్లు నడిచింది. ఎండవేడి పెరిగింది. తుపాకుల స్టీలు కూడా వేడెక్కింది. తుపా కుల మీద సూర్యుడు తన తీవ్రతను చూపాడు.

సెలయేరు దాటింది సైన్యం. దున్నిన పొలాలు కనిపించాయి ఎదురుగా. మరో వైపు లోయలు, పచ్చిక బయళ్లు అల్లంత దూరంలో దట్టమైన, రహస్యాలను దాచు కున్న అరణ్యం. వాటికావల అద్భుత సౌందర్యంతో వెలిగిపోతున్న మంచుకప్పిన పర్వత శిఖరాలు.

అయిదో కంపెనీ ముందువరుసలో నడుస్తున్నాడు బట్లర్. ఇటీవలే గార్డ్ దళం నుండి సైన్యంలో చేరాడు. నల్లటికోటూ, క్యాప్, ఖడ్గం ధరించాడు. శ్వాస పీల్చుకోవ టమే, జీవించి వుండటమే ఒక వరం అనే ఆనందం అతణ్ణి నడిపిస్తున్నది. పైనున్న ఏ ఒక్కరి కోరికో తీర్చటానికి యింతమంది కదం తొక్కుతున్నారు. యాక్షన్‌లో పాల్గొ నటం యిది తనకు రెండోసారి. ఏ క్షణా న్నైనా ఎదురుకాల్పులు ప్రారంభం కావచ్చు బుల్లెట్లు తనమీద వర్షించిన ప్పుడు ఆత్మరక్షణ కోసం తను తలవంచడు సరికదా, మరింత నిటారుగా నిలబడి తొణుకూ బెణుకూ లేకుండా ముందుకు క దులుతూ, యిది అతిసామాన్యమైన విష యమన్నట్టుగా తన కామ్రేడ్లతో జోకు లేస్తూ, కబుర్లు చెబుతాడు.

పక్కారోడ్డు నుండి గతుకుల దారిలోకి మళ్లింది సైన్యం. మొక్కజొన్న చేను ఏపుగా పెరిగింది. అడవికి సమీపంలో వున్నప్పుడు ఈల వేసినట్టుగా చప్పుడు చేస్తూ ఒక బులెట్ వచ్చి పొలంలో పడింది.

"ప్రారంభమైంది" అన్నాడు బట్లర్ పక్క నున్న సైనికుడివైపు చూస్తూ చిరునవ్వుతో.

అవును. ప్రతిఘటన ప్రారంభమైంది. అశ్వారూఢులైన చెచెన్లు జెండాలు గాలిలో ఎగరగా అడవిలోనుండి పరిగెత్తుకుని వచ్చారు. సైన్యం మధ్యభాగంలో ఆకుపచ్చ

జెండా ఒకటి కనిపించింది. చత్వారం వున్న బట్లర్‌తో, షామిల్ స్వయంగా ఈ యుద్ధంలో పాల్గొనే అవకాశముందని చెప్పాడు మరో సైనికుడు. పర్వతాలు దిగి వచ్చిన చెచెన్లు కుడివైపున మోహరించారు. బట్లర్ వున్న కంపెనీ, వాళ్లను ఎదిరించాలని చెప్పాడో జనరల్. మెరుపువేగంతో కదిలాడు బట్లర్. కాని అంతలోనే వెనుక నుండి శతఘ్ని కాల్పులు రెండు వినిపించాయి. అర్థంకాక అటూయిటూ చూశాడు. చుట్టూ తెల్లటి పొగ కమ్ముకుంది. ఫిరంగులు వస్తాయని వూహించని చెచెన్లు తిరిగి అడవుల్లో అదృశ్యమయ్యారు. అయినా బట్లర్‌కంపెనీ వాళ్లమీద కాల్పులు కొనసాగించింది. పొగమంచు దట్టంగా వ్యాపించింది. దూరంగా పారిపోతున్న చెచెన్లు అస్పష్టంగా కనిపించారు. తమను తరుముతున్న కోసక్కులమీద అప్పుడప్పుడూ కాల్పులు జరిపారు. కంపెనీ వాళ్లను వెంబడించింది. పర్వతం రెండో మలుపు తిరిగాక లోయలో కనిపించింది ఒక గ్రామం.

కోసక్కులతో కలిసి గ్రామంలో ప్రవేశించాడు బట్లర్. కాని ఊరు నిర్మానుష్యంగా ఉంది. ఇళ్లను, ధాన్యాన్ని, గడ్డిని తగలబెట్టమని సైనికులకు ఆజ్ఞలు జారీ అయ్యాయి. పాడుబడిన వూళ్ళో ఘాటుగా పొగ నిండింది. గ్రామస్తులు వెంట తీసుకెళ్లలేని కోళ్లను షూట్‌చేశారు సైనికులు.

పొగకు కాస్త ఎడంగా కూర్చుని భోజనం చేశారు ఆఫీసర్లు. కొన్ని తేనెపట్టులను తీసుకొచ్చాడో సార్జంట్ మేజర్. ఎక్కడా చెచెన్ల జాడలేదు. మధ్యాహ్నానికి తిరుగు ప్రయాణమయ్యారు సైనికులు. ఈ సారి వెనుక వరుసలో నిల్చున్నాడు బట్లర్. అనూహ్యంగా చెచెన్లు ప్రత్యక్షమై కంపెనీ మీద కాల్పులు జరిపారు. గ్రామం వదిలి, సైన్యం మైదానంలోకి ప్రవేశించగానే కాల్పులు ఆగిపోయాయి.

బట్లర్ కంపెనీలో ఎవరూ గాయపడలేదు. మళ్ళీ కాలవదాటి మొక్కజొన్న చేలగుండా పాటలుపాడుతూ ప్రయాణించింది పటాలం.

యుద్ధమంటే ప్రతివ్యక్తీ ప్రమాదానికెదురొడ్డి నిలువడమే అనుకున్నాడు బట్లర్. ఆ సాహసకార్యాన్ని వెన్నంటే ఉంటుంది మృత్యువు. గెలిచినా ఓడినా పెద్దలకే కీర్తి, గౌరవం దక్కుతాయి. రష్యన్లు తమను 'హీరో'లంటారు. కాని బట్లర్ యుద్ధానికి మరోవైపు ఉంటుందని, సైనికుల హతాన్మరణం, గాయాల వంటివాటి గురించి ఆ క్షణాన ఆలోచించనైనా లేదు. కీర్తి గురించి కలలు కంటున్నాడు. మృత్యువు, గాయాల గురించి ఎవరూ ఆలోచించరు. అందువలన అతడు ఆరోజు ముగ్గురు మరణించిన

విషయం, మరో పన్నెండు మంది గాయ పడటం పరిగణనలోనికి తీసుకోలేదు. ఒక మృతదేహం తన పక్కన పడుంది. అయినా అటువైపైనా చూడలేదు. చెచెన్లు కూడా గొప్ప అశ్వికులు, వీరసైనికులనే అనుకున్నాడు.

"వచ్చిన పని పూర్తిచేశాం. తిరిగి వెళ్ళిపో తున్నాం. ఇళ్లు చేరగానే అక్కడ వేడివేడి భోజనం మనకోసం రెడీగా ఉంటుంది. కమాన్, పాటందుకోండి" అంటూ అందర్నీ ఉత్సాహపరిచాడు మేజర్.

ప్రశాంతంగా ఉంది. గాలిలో కదలిక లేదు అల్లంత దూరాన మంచు కరిగినా ఏదో తాజాదనం అంతటా వ్యాపించింది. పాటలతో కలిసిపోయింది కవాతు శబ్దం. తుపాకులొకదానికొకటి తగిలి ఖంగుమం టున్నాయి.

తన పైఅధికారి మేజర్ పెట్రోవ్ పక్కనే స్వారీ చేస్తున్నాడు బట్లర్. గార్డ్ నుండి సైన్యంలో చేరటానికి తనకు సహాయం చే సింది ఈయనే. గార్డుల దళంలోవున్న ప్పుడు పేకాటలో ఉన్నదంతా పోగొట్టుకు న్నాడు. ఇక పోగొట్టుకోవటానికి ఏమీ మిగలకపోయినా, ఇంకా పోగొట్టుకునే అవ కాశముందని భయపడి సైన్యంలో చేరాల నుకున్నాడు. ఇప్పుడదంతా గతం. జీవితం నాశనమైందనీ, అప్పులింకా మిగిలేవున్నా యని అతనికి గుర్తులేదు. కొత్త వాతావ రణం, కొత్త మిత్రుల పరిచయం ఉత్సాహ మిచ్చాయి. పీటర్స్‌బర్గ్ గదుల్లోని పొగాకు కంపు ఇక్కడలేదు.

మేజర్, మాషా కలిసి ఉంటున్నారు. ఆమె ఒకవైద్యుని సహాయకుని కూతురు. అసలుపేరు మార్యా డిమిట్రియెవ్నా. అందంగా ఉంటుంది. పిల్లలు లేరు. సుమారు ముప్పై ఏళ్లు. గతం ఏమైనా ప్రస్తుతం మేజర్‌కు ఆమె 'మంచిభార్య' గానే ఉంటోంది. అతనికి తాగే అలవా టుంది గనక, మందెక్కువైనప్పుడు ఆమె అతనికి 'నర్సు'లా కూడా సేవ చేస్తుంది.

మేజర్ ఇంటికి చేరుకోగానే అతనికీ, బట్లర్‌కూ, వెంటవచ్చిన మరో ఇద్దరు ఆఫీ సర్లకూ మంచి భోజనం పెట్టింది. తిని తాగి మేజర్ గాఢ నిద్రపోయాడు.

మోతాదుకన్నా ఎక్కువ వైను తాగిన బట్లర్ డ్రెస్సు కూడా మార్చుకోకుండానే గుర్రు పెట్టాడు.

సైనికులు ధ్వంసం చేసింది రష్యన్లకు లొంగిపోవటానికి ముందు హాజీమురాద్ బస చేసిన గ్రామాన్నే. రష్యన్లు వస్తున్నా రని తెలిసి సాడో, అతడి కుటుంబ సభ్యు లు గ్రామాన్ని విడిచి వెళ్ళి పర్వతాల్లో తల దాచుకున్నారు. తిరిగి వచ్చేసరికి ఇళ్లు నేల మట్టమైనాయి. పాకలు మంటల్లో కాలిపో యాయి. అతడి కొడుకును వాళ్లు బాయ్‌నె ట్‌తో పొడిచి చంపారు. గుర్రంమీద వేసు కుని శవాన్ని మసీదుకు తీసుకువచ్చారు. హాజీమురాద్‌కు భోజనం పెట్టి, అతిథి మర్యాదలు చేసిన స్త్రీ మధ్య వయస్కు రాలు. జుత్తు పీక్కుని, మొహం రక్కుకుని తన బంగారు కొండ మీద పడి కన్నీరుము న్నీరుగా విలపించింది. ఇతర బంధువు లతో కలిసి పార తీసుకుని సమాధి తవ్వ టానికి వెళ్లాడు సాడో. ముసలితాత సగం కూలిన గోడను ఆనుకుని కూర్చున్నాడు.

పక్క ఊరిలో తేనెతుట్టెలపని చేస్తున్న వాడు విషయం తెలిసి అప్పుడే తిరిగి వచ్చాడు. రెండు గడ్డివాములను తగలపెట్టారు. ఏప్రికాట్, చెర్రీ చెట్లను నరికేశారు. మరీ దారుణం- తేనెటీగలనూ, తేనెతుట్టెలనూ కాల్చేశారు. తల్లుల, పిల్లల ఏడ్పులు ఆకలితో అరుస్తున్న పశువుల ఆర్తనాదాలతో కలసిపోయాయి. కాస్త ఎదిగిన పిల్లలు ఏడవటానికి బదులు భయం భయంగా పెద్దవాళ్ల వెనక నడిచారు. తాగేనీళ్లలో ఏదో కలిపారు. ఇప్పుడా నీళ్లు పనికి రావు. మసీదును అపవిత్రం చేశారు. ముల్లా, అతని సహాయకులు యిప్పుడు దాన్ని శుభ్రం చేస్తున్నారు. రష్యన్లను ద్వేషించినట్టుగా ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పిల్లల నుండి పెద్దవాళ్ల దాకా చెచెన్లందరికీ ఉన్నది ద్వేషంకన్నా ఎక్కువ. రష్యన్ కుక్కలను వాళ్లసలు మనుషులుగా గుర్తించదలచుకోలేదు. ఎలుకలనూ, విషపురుగులనూ, తోడేళ్లనూ మనం చంపేది ఆత్మరక్షణకే.. అసహ్యంతో, ద్వేషంతో కాదు. వాళ్లకు రష్యన్లూ అంతే.

ఏడాదిపాటు తాము రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలు నిష్కారణంగా తగలబెట్టారే.. ఇదేమి ఆనందం? ఇలా కూడా ఉంటారా మనుషులు! ఇంత జరిగాక జుగుప్సను లోలోపలే దాచుకుని రష్యన్లకు లొంగిపోవాలా? వృద్ధులు, గ్రామ పెద్దలు ప్రార్థనలు ముగించి, సహాయం కోరుతూ షామిల్ వద్దకు దూతలను పంపాలని నిర్ణయించారు. ఆ తర్వాత కాలి బూడిదైపోగా మిగిలిందేమన్నా ఉంటే తీసి భద్రపరిచారు.

★ ★ ★

దాడి జరిగిన మరుసటి ఉదయం యింటి వెనకద్వారం నుండి బయటికి వచ్చి, కాసేపు తిరిగి రావటానికి బయల్దేరాడు బట్లర్. లేత ఎండ హాయిగా ఉంది. స్వచ్ఛమైన గాలిలో నడక ఆహ్లాదకరంగా ఉంది. బ్రేక్‌ఫాస్ట్‌కు ముందర ఇలా కాసేపు నడిస్తే బాగుంటుంది అనుకున్నాడు. పెట్రోవ్ ఇంకా లేవలేదు. కొండలమీద ఎండ మెరుస్తోంది. కుడివైపు తెల్లటి గోడలమీద కూడా కాంతిపడి చూడాలంటే కళ్లు మూసుకుపోతున్నాయి. ఎడంవైపు ఆకుపచ్చ శాలువా కప్పుకున్న పర్వతాలు రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. శిఖరాలమీద పేరుకుపోయిన మంచు, మేఘాలలా కనిపిస్తున్నది. ఈ అద్భుతక్షణాల్ని ఆనందించటం కన్న జీవితానికింకా ఏం కావాలి?

నిన్నటి తన ప్రవర్తన గురించి తనను తాను అభినందించుకున్నాడు. యుద్ధంలో తాను ఎంత చాకచక్యంగా వ్యవహరించాడు! అందరూ భయపడి వణికినప్పుడు తను గుండె నిబ్బరం ప్రదర్శించాడు. ఇంటికి వచ్చిన తమను మాషా (లేక మార్యా డిమిట్రియెవ్నా) ఎంత ఆప్యాయంగా ఆదరించింది!

భుజాల దాకా పెరిగిన దట్టమైన జుత్తు, ఎత్తైన వక్షం, ఆహ్వానించే కళ్లు బట్లర్‌ను బాగా ఆకర్షించాయి. యువకుడు, ఇంకా పెళ్లికాలేదు. కోరికలు రేగిన మాటకూడా నిజమే. ఆమె తనవైపు ఓ అర్థంలో చూసింది. కాని ఇంటికి ఆహ్వానించి, మర్యాద చేసిన మిత్రునికి ద్రోహం చెయ్యటమా! నిగ్రహించుకోవటంలోనే తన మంచితనముంది.

ఇలా తియ్యటి ఆలోచనల్లో విహరిస్తున్నప్పుడు దూరంగా గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. చాలా మంది అశ్వికులు వస్తున్నారు. వేగం తగ్గింది. నెమ్మదిగా నడిచివచ్చాయి గుర్రాలు. ఇరవైమంది కోసక్కుల పహారాలో ఇద్దరు వ్యక్తులు కనిపించారు. ఒకతను సర్కేషియన్ కోట్, పాగా ధరించాడు. మరొకతను రష్యన్ ఆఫీసర్. గోధుమరంగు గుర్రం మీద రీవిగా కనిపించాడు పాగా పెట్టుకున్నతను.

అందమైన కరాబాక్ అశ్వం మీద కూర్చున్నాడు రష్యన్ ఆఫీసర్.

బట్లర్ అశ్వ ప్రేమికుడు. గోధుమరంగు గుర్రం ఎంత విలువైనదో యిట్టే పసిగట్టాడు.

"ఇది కమాండింగ్ ఆఫీసర్ ఇల్లా? " అంటూ ప్రశ్నించాడు రష్యన్ ఆఫీసర్.

"ఔను, మీరెవరు? " అంటూ వాళ్లను సమీపించాడు బట్లర్.

"ఇతను హాజీమురాద్. కమాండర్ ఇంటికి అతిథిగా వచ్చాడు"

"స్వాగతం.. సోదరా" అంటూ టార్టార్‌లో ఆహ్వానించాడు బట్లర్.

"సౌబుల్ (శుభం కలుగుగాక)" అంటూ బట్లర్‌తో కరచాలనం చేశాడు హాజీమురాద్.

"కమాండర్ ఎవరు? "

"నేను కాదు, కమాండర్ ఇంట్లో ఉన్నాడు. పిలుస్తాను" అంటూ వెనక్కెళ్లి ఇంటి తలుపు తట్టాడు బట్లర్. కాని అతిథులు ప్రవేశించటానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ద్వారం తెరుచుకోలేదు. లోపల్నించి తాళం వేసినట్టుంది. చుట్టూ తిరిగి ఇంటి వెనక్కెళ్ళి పనిమనుషులెవరూ కనిపించకపోవటంతో వంటింట్లోకెళ్లాడు. తలకు రుమాలు చుట్టుకుని, చొక్కా చేతులుపైకి మడుచుకుని పేస్ట్రీ పిండి పిసుకుతున్న మార్యా డిమిట్రియెవ్నా తనను చూసి ఆ పరిస్థితిలో సిగ్గుపడిందేమో, మొహం ఎరుపెక్కింది.

"పనిమనుషులు ఎక్కడికెళ్లారు? "

"తాగటానికి వెళ్లారు. ఏం కావాలి? "

"ముందరి తలుపు తియ్యాలి. చెచెన్ల గుంపు వచ్చింది హాజీమురాద్ వెంట"

"బాగానే కోతలు కోస్తావే? "

"జోక్ చెయ్యటం లేదు. అందరూ ఇంటి ముందర నిల్చున్నారు"

"నిజంగా? "

"అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు. స్వయంగా వెళ్ళి చూడొకసారి"

"అయ్యబాబోయ్! నావేషం ఇలా ఉంది? " అంటూ చొక్కాచేతులు కిందికి దించుకుంది. మార్యా డిమిట్రియెవ్నా.

"వెళ్ళి, పెట్రోవ్‌ను లేపుతాను మరి"

"నేను లేపుతానులే. నువ్వు తలుపు తియ్యి" అంటూ అప్పుడే వచ్చిన పనిమని షివైపు చూశాడు బట్లర్.

హాజీమురాద్ గ్రోజ్నిలో ఉన్న విషయం పెట్రోవ్‌కు తెలుసు. ఇప్పుడు తనింటికొచ్చాడు. పెద్దగా ఆశ్చర్యం అనిపించలేదు. లేచికూర్చుని సిగరెట్ వెలిగించి డ్రెస్ చేసుకోసుకోవటం ప్రారంభించాడు. ఒకసారి పెద్దగా గొంతు సవరించుకుని, 'ఈ రాక్ష సుణ్ణి' తన దగ్గరకు పంపినందుకు పైఅధికార్లను తిట్టుకున్నాడు.

ఆ తర్వాత పనిమనిషిని పిలిచి, 'మందు' తెచ్చివ్వమన్నాడు. మందంటే వోడ్కా. '(డ్రింక్స్ మిక్స్ చెయ్యటం వల్ల చాలా చిక్కులు వస్తాయి' అనుకొంటూ ఓ గుక్కెడు వోడ్కా గుటకవేసి, కాస్త రైబ్రెడ్ తిన్నాడు. క్రితం రాత్రి చికర్(వైన్) తాగాడు. తలనొప్పి వచ్చింది. ఇప్పుడు బాగానే ఉంది. డ్రెస్ మరోసారి సరిచూసుకుని ముందరి గదిలోకెళ్లాడు.

అప్పటికే అక్కడ బట్లర్, హాజీమురాద్ రష్యన్ ఆఫీసర్లతో నిరీక్షిస్తున్నారు. పైఅధికారుల ఆజ్ఞాపత్రాన్ని పెట్రోవ్‌కు అందచేశాడు రష్యన్ ఆఫీసర్. హాజీమురాద్‌తో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి. అతడు ఇతర చెచెన్‌లతో సంప్రదింపులు జరపటానికి అవకాశమివ్వాలి. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ అతణ్ణి కోట దాటి వెళ్లనివ్వకూడదు- కోసక్కుల పహరా లేకుండా.

ఆజ్ఞలు మరొకసారి చదివి, హాజీమురాద్‌ను పరికించి చూస్తూ "వెల్‌కమ్ సర్ మిమ్మల్ని ఒంటరిగా వదలొద్దని మాకు ఆ

దేశాలు ఉన్నాయి. పైవాళ్ల ఆజ్ఞలను తూచా తప్పకుండా పాటించటమే మా కర్తవ్యం" అని, బట్లర్‌వైపు చూసి, "ఇతడికి ఎక్కడ బస కల్పిస్తే బాగుంటుందంటావు? " అని అడిగాడు.

బట్లర్ నోరు విప్పకముందే మార్యా డిమిట్రియెవ్నా కల్పించుకుని "ఎక్కడో ఎందుకు? మన గెస్ట్‌రూం, స్టోర్‌రూం అతడికి కేటాయిద్దాం. కనీసం అలా ఎప్పుడూ మన కళ్లముందే ఉంటాడు" అంది.

కాని హాజీమురాద్‌వైపు చూసి, కళ్ళు పక్కకు తిప్పుకుంది.

"మార్యా చెప్పింది బాగానే ఉంది" అన్నాడు బట్లర్.

"ఇక్కడికెందుకొచ్చావు నువ్వసలు? మా వ్యవహారాల్లో ఆడవాళ్లకేం పని!" అని కసురుకున్నాడు పెట్రోవ్.

ఆ తర్వాత, చర్చలో తనకేమీ స్వంత కోరికలు లేవని, చెచెన్లు తనతో సంపర్కం పెట్టుకునే అవకాశం కల్పిస్తే చాలుననీ చెప్పాడు హాజీమురాద్. మాట్లాడినంత సేపూ అతడి కుడిచెయ్యి బాకుపిడి మీదే ఉంది.

అందరికీ భోజనాలు సిద్ధం చేసి, గదులు కేటాయించేదాకా ఆగంతకులతో కబుర్లు చెప్పమని బట్లర్‌కు పురమాయించాడు పెట్రోవ్. ఈలోగా తను ఆఫీసుకెళ్లి, ఇతర లాంఛనాలు పూర్తిచేసి, సిబ్బందికి అవసరమైన ఆదేశాలిచ్చి వస్తానన్నాడు.

హాజీమురాద్‌కు, పెట్రోవ్‌కూ ఉండవలసిన సంబంధాన్ని స్పష్టంగానే నిర్వచించారు పైఅధికార్లు. పెట్రోవ్ అతనికి నచ్చలేదు. మార్యా డిమిట్రియెవ్నా ప్రేమాభిమానాలు, ఆమె వంట, వడ్డించిన పద్ధతి అతణ్ణి బాగా ఆకట్టుకున్నాయి. ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. ఆమె కూడా తనను చూసి ఆకర్షితురాలైనట్టే ఉంది. ఆమెవైపు చూడకూడదు, ఆమెతో మాట్లాడకూడదనుకున్నాడు. కాని అతని కళ్లు అసంకల్పితంగానే ఆమె కదలికలను గమనించాయి.

మొదటి పరిచయంలోనే బట్లర్‌తో స్నేహం కుదిరింది. ఇద్దరూ సుదీర్ఘంగా కబుర్లు చెప్పుకున్నారు. అతడి గురించి అడిగి తెలుసుకున్నాడు. తన గురించి చెప్పాడు. గూఢచారులు తెచ్చిన సమాచారం కూడా అతడితో పంచుకున్నాడు. 'ఏం చెయ్యమంటారు? ' అంటూ సలహాలు కూడా అడిగాడు.

అయితే గూఢచారులు తెచ్చిన సమాచారం సంతోషకరమైందేమీ కాదు. అతడక్కడున్న మొదటి నాలుగు రోజుల్లో, రెండుసార్లు వాళ్లు సమాచారం తీసుకొచ్చారు. రెండుసార్లూ అవి దుర్వార్తలే.

హాజీమురాద్ రష్యన్లకు లొంగిపోయాడని తెలిసి అతడి కుటుంబాన్ని వెడెనో గ్రామానికి తరలించారు. షామిల్ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది వాళ్ళ భవిష్యత్తు. స్త్రీలు అంటే అతని తల్లి పటిమట్, ఇద్దరు భార్యలు, ఇంకా అయిదుగురు చిన్నపిల్లలు 'ఇబ్రహీం రషీద్' అనే ఆఫీసర్ ఇంట్లో ఉన్నారు. పద్దెనిమిదేళ్ల కొడుకు యూసుఫ్‌ను జైల్లో పెట్టారు. జైలంటే ఏడడుగుల గొయ్యి. అక్కడ మరో ఏడుగురు నేరస్తులతో కలిసి షామిల్ కోసం నిరీక్షిస్తున్నాడు వాడు.

షామిల్ నిర్ణయం ఆలస్యం కావటానికి కారణం అతడు రష్యన్లతో యుద్ధానికి పోవటమే.

1857 జనవరి 6న వెడెనోకు తిరిగివ చ్చాడు షామిల్. యుద్ధంలో పరాజితుడై, వెడెనోలో తల దాచుకున్నాడని అన్నారు రష్యన్లు. అతనూ, అతని మురిద్‌ల ప్రకారం వాళ్లు రష్యన్ల దాడిని సమర్థ వంతంగా తిప్పికొట్టారు. సామాన్యంగా యుద్ధంలో అతడు స్వయంగా తుపాకి పేల్చాడు. కాని ఈసారి రైఫిల్‌కూ, ఖడ్గానికీ పని చెప్పాడు. మురిద్‌లు అడ్డుపడి ఆపక పోతే ఎంతమందిని సంహరించేవాడో! ఘర్షణలో అతడికి రక్షణగా ఉన్న ఇద్దరు మురిద్‌లు మరణించారు.

తన సైనికులు వెంటరాగా గాలిలో తుపాకులు పేల్చి 'లా యిలాయిల్ అల్లా' అని పాడుతూ షామిల్ బృందం గ్రామంలో ప్రవేశించి, అతడి భవంతివైపు కదిలింది.

గ్రామస్తులంతా వీధిలో రెండువైపులా బారులు తీరి నిలబడి, ఇళ్ళకప్పు పైకెక్కి విజేతగా తిరిగి వచ్చిన తమ నాయకుడికి స్వాగతం పలికారు. తెల్లటి అరబ్బు గుర్రం మీద వచ్చాడు షామిల్. అతడి గుర్రానికి బంగారు, వెండి ఆభరణాలు లేవు. అలం కరించిన తోలుపట్టా ఒకటి, కాలుపెట్టుకో వటానికి రెండు వైపులా స్టీలు రికాబులు, ఎర్రటి గుడ్డ పరచిన జీను మాత్రమే హుందాగా కనిపించాయి. నల్లటి బొచ్చు కాలర్ ఉన్న గోధుమరంగు అంగరఖా వేసుకున్నాడు షామిల్. మెడ, భుజాల మీద ఆచ్ఛాదన లేదు. నడుం చుట్టూ నల్లటి గుడ్డ బిగించి కట్టుకున్నాడు. అక్కడే వేళ్లాడుతున్న బాకు పిడి, తలమీద పొడుగాటి టోపీ, చుట్టూ ఒక తెల్లటి టర్బన్, ఆకుపచ్చ చెప్పులు, నల్లటి లెగ్గింగ్స్ అతడి ఆకర్షణను పెంచాయి.

బంగారం, వెండితో సహా మెరిసేదేదీ వంటిమీద లేదు. చుట్టూ ఉన్న మురిద్‌లు మాత్రం తమ దుస్తులమీద చమ్కీ లేసులు కట్టుకున్నారు. వాళ్ల ఆయుధాల మీద కూడా బంగారం, వెండి తాపడం ఉంది. అలా సాదాసీదాగా కన్పించడం వల్లే అందరికీ తనమీద గౌరవం పెరుగు తుందని అతడికి తెలుసు. చిక్కిపోయిన ట్టుగా ఉన్న పొడుగాటి మొహం, ఎర్రటి పిల్లిగడ్డం, తీక్షణంగా చూసే కళ్లు. ఆ కళ్ళల్లో ఏ భావమూ కనిపించదు. గ్రామంలో వెయ్యి కళ్ళు అతణ్ణి చూశాయి. అతడుమాత్రం ఎవరి వంకా చూడలేదు.

షామిల్ వచ్చాడని విని, అప్పటి దాకా లోపలిగదుల్లో ఉన్న హాజీమురాద్ భార్యలు వసారాలోకి వచ్చి నిలబడ్డారు. అతని తల్లి మాత్రం తన గది విడిచి రాలేదు. నెరిసిన జుత్తు, పీక్కుపోయిన

మొహంతో కళ్లు మూసుకుని నేలమీద చతికిలబడినట్టుగా కూర్చుంది. తన కొడుకులాగే ఆమెకు కూడా షామిల్ అంటే ద్వేషం. ఇప్పుడు మరింత ద్వేషిస్తోంది. అతడి మొహం చూడటం కూడా ఆమె ఇష్టపడదు.

హాజీమురాద్ కొడుకు కూడా షామిల్ రాకను చూడలేదు. గోతి చీకటిలో ఉన్న తనకు తుపాకుల చప్పుడు, పాటలు మాత్రమే వినిపించాయి. స్వేచ్ఛలో ఎంత ఆనందం ఉంటుందో బందీలకు బాగా తెలుస్తుంది.

తన భవంతి చేరుకుని, అంతఃపురం వైపు కదిలాడు షామిల్. దారిలో అతడి దర్శనానికి నిరీక్షిస్తున్నారు జనం. లోపలి గేటువద్ద ఇద్దరు సైనికులు కాపలా ఉన్నారు. అర్జీలు చేతపట్టుకున్న కొందరు తోసుకుని ముందుకు రావటానికి ప్రయత్నించారు. అక్కడ మూగినవాళ్లలో స్వయంగా వచ్చినవాళ్లూ ఉన్నారు. తను పిలిస్తేనే వచ్చినవాళ్లూ ఉన్నారు. వాళ్లను విచారించాలి. నేరాలు చేశారని రుజువైతే శిక్షలు వేయాలి. అతడు వాళ్లకు ఇమాం కదా! అందరూ గౌరవ సూచకంగా సలాం చేశారు. కొందరు మోకాళ్ల మీద వంగారు. అందరూ దేబిరిస్తున్నట్టుగానే చూస్తారు. అందుకే వాళ్లంటే అతడికి అసహ్యం. ఏం మనుషులు! అందర్నీ దాటుకుని వసారా దాకా వచ్చాడు. శారీరకంగానూ, మానసికంగానూ అలసిపోయాడు. ప్రతి యుద్ధమూ తన శక్తియుక్తులకు ఒక పరీక్షే. విజయం తనదే అని ప్రకటించుకున్నాడు గాని, అది నిజమైన గెలుపు కాదని తనకు తెలుసు. చాలా చెచెన్ గ్రామాలను వాళ్లు ధ్వంసం చేశారు. తగలపెట్టారు. అసలు స్వభావరీత్యా చెచెన్లు నమ్మదగిన మనుషులు కారు. ముఖ్యంగా రష్యన్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న వాళ్లను అసలు నమ్మలేం. అవకాశం దొరికితే చాలు, అటువైపు పోవటానికి ప్రయత్నిస్తారు.

ఈ సమస్యల్ని కొంతవరకు పరిష్కరించాడు. అసంతృప్తి కనిపించిన చోటల్లా ఉక్కుపాదంతో అణచివేశాడు. ప్రస్తుతం అతనికేమీ ఆలోచించాలని లేదు. తనకిప్పుడు కావలసింది ఒక్కటే. విశ్రాంతి. సంసార సుఖం. ఇష్టభార్య ఆలింగనం. ఇష్టభార్యంటే నల్లకళ్ల పద్దెనిమిదేళ్ల అమీనల్. ఆ క్షణాన ఆమె పరదా వెనక తన కోసం నిరీక్షిస్తున్నదని తెలుసు. పరదాకటువైపు జనానా ఉంటారు. ఇతర భార్యలకు కూడా తనను చూడాలని కోరిక ఉండదని కాదు. కాని తన కోరికలు తీర్చుకునే సమయం కాదిది. ఇష్టంలేదు గాని, మొదట మధ్యాహ్నం ప్రార్థనలు చెయ్యాలి. మతగురువుగా అతడు అందరికీ ఆదర్శంగా ఉండాలి మరి! పైగా తనకు కూడా భోజనమెంత ముఖ్యమో, అవీ అంతే ముఖ్యం. నమాజు ముగించి తనకోసం నిరీక్షిస్తున్నవాళ్లను ఒక్కొక్కర్నీ పిలిచాడు.

మొదట ప్రవేశించాడు జమాల్ ఎడ్డిన్ - పిల్లనిచ్చిన మామ. తనకు గురుతుల్యుడు. నెరసిన జుత్తు, గడ్డం, కందగడ్డ లాంటి ఎర్రటి మొహం. త్వరగా ప్రార్థన ముగించి, యుద్ధం గురించి షామిల్‌ను

గుచ్చిగుచ్చి అడిగి, వివరాలన్నీ తెలుసుకున్నాడు. తరువాత అతడు లేనప్పుడు తన గ్రామాల్లో జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు.

చాలా విషయాలు జరిగాయి. ముఖ్యంగా కుటుంబ కలహాలకు సంబంధించిన హత్యలు, పశువుల దొంగతనాలు, తారికాత్(మత నిబంధన)ను ఉల్లంఘించి మద్యపానం, పొగత్రాగటం వగైరా నేరాలు. రష్యన్లకు తన కుటుంబాన్ని అప్పగించమని ఒత్తిడి తేవటానికి హాజీమురాద్ చేస్తున్న ప్రయత్నాల గురించి చెప్పాడు జమాల్ ఎడ్డిన్. ఇది పసిగట్టి వాళ్లను వెడెనోకు తరలించారు. ప్రస్తుతం అందరూ కట్టుదిట్టమైన పహారాలోనే ఉన్నారు. ఇకపై షామిల్ ఎలా నిర్ణయిస్తే అలా. పక్కగదిలో మతపెద్దలు తనకోసం నిరీక్షిస్తున్నారు, గత మూడు రోజులుగా. కాసేపు వాళ్లతో మాట్లాడి పంపించివేస్తే తాము తీరిగ్గా ఇతర విషయాలు చర్చించుకోవచ్చు.

గద్దముక్కు గల కురూపి, కారునలుపు రంగు, పేరు జైదాత్ అతనికి భోజనం వడ్డించింది. ఆమె అంటే అతడికేమాత్రం ఇష్టం లేదు. జైదాత్ అతని పెద్దభార్య.

భోజనం ముగించి మతపెద్దలు కూర్చున్న గదిలోకి ప్రవేశించాడు షామిల్. నెరిసిన జుత్తు, ఎర్రటి గడ్డాలతో ఆరుగురు వృద్ధులు కూర్చున్నారక్కడ. అందరి తలల మీదా టోపీలో, టర్బన్‌లో ఉన్నాయి. కొందరు బనియన్లూ, సర్కేషియన్ కోట్లు ధరించారు. నడుములకు బాకులు వేళ్లాడుతున్నాయి. షామిల్‌ను చూసి లేచి అభివాదం చేశారు. అందరికన్నా పొడుగ్గా ఉన్నాడు షామిల్. చర్చల తర్వాత ఆ సలహా మండలి సూచనల ప్రకారం ఒక్కొక్క కేసూ పరిశీలించి షరియత్ ప్రకారం శిక్షలు విధించారు. దొంగతనానికిగాను ఇద్దరికి ఒక్కొక్క చెయ్యి నరికెయ్యాలి. హత్య చేసినందుకు ఒకడికి శిరచ్ఛేదం చెయ్యాలి. ముగ్గురికి క్షమాభిక్ష ప్రసాదించాలి. ఆ తర్వాత ముఖ్యాంశం గురించి చర్చ మళ్లీ కొనసాగింది.

రష్యన్లవైపు పోకుండా చెచెన్లను నిలువరించటమెలా? ఇందుకోసం జమాల్ ఎడ్డిన్ ఒక ప్రకటన సిద్ధం చేశాడు.

"చెచెన్ సోదరులారా! మాయమాటలు చెప్పి రష్యన్లు మిమ్మల్ని తమకు లొంగిపొమ్మంటున్నారు. వాళ్ల బూటకపు ప్రచారాన్ని నమ్మవద్దు. లొంగిపోవద్దు. ఈ పుణ్యకార్యానికి ఈ జన్మలో కాకపోయినా, వచ్చే జన్మలో మీకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఇదివరలో వాళ్లు ఒకసారి మీ ఆయుధాలు స్వాధీనం చేసుకోవటం గుర్తుందా? అప్పుడే గనక భగవంతుడు మీ కళ్లు తెరిపించి ఉండకపోతే ఇప్పుడు మీరంతా సైనికులుగా ఉండేవారు. మీ భార్యల మానం బుగ్గిపాలయ్యేది.

గతం నుండి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి. ఇస్లాంకు వ్యతిరేకులైన అవిశ్వాసులైన రష్యన్లతో కలిసి బతకటం కన్నా, శత్రువులుగా వాళ్లతో యుద్ధం చేసి మరణించటం మేలు. కాస్త ఓపిక పట్టండి. నేను ఖురానుతో, ఖడ్గంతో వచ్చి మిమ్మల్ని శత్రు

వులకు వ్యతిరేకంగా నడిపిస్తాను. కాని ప్రస్తుతానికి మీరు వాళ్లకు లొంగిపోయే ఆలోచన కూడా రానివ్వవద్దని శాసిస్తున్నాను"

ఇది తన ఆజ్ఞగా విడుదల చెయ్యటానికి అంగీకరించిన షామిల్ దానిమీద సంతకం చేసి ఎడ్డిన్‌కు తిరిగిచ్చాడు.

ఆ తర్వాత హాజీమురాద్ విషయం చర్చకు వచ్చింది. ఇదే షామిల్‌కు అత్యంత ముఖ్యమైన, కీలకమైన కేసు. బహిరంగంగా అంగీకరించనప్పటికీ హాజీమురాద్ ధైర్యసాహసాలు, యుద్ధసామర్థ్యం అతడికి బాగానే తెలుసు. హాజీమురాద్ తనతో ఉన్నట్టయితే చెచెన్యా పరిస్థితి ఇలా ఉండేదికాదు. అతనితో సంధి చేసుకోవటం శ్రేయస్కరం. అది జరిగితే అతడి సేవలను తిరిగి తను వినియోగించుకోవచ్చు. కాని అది అసాధ్యమని కూడా షామిల్‌కు తెలుసు. అయినప్పటికీ అతడు రష్యన్లకు సహాయం చెయ్యకుండా నిరోధించగలగాలి. ఏదో మిషమీద అతణ్ణి తన వద్దకు రప్పించుకుని సంహరించాలి. తన మనుషులు టిఫ్లిస్‌కెళ్లి అక్కడే చంపొచ్చు. లేదా అతణ్ణే ఇక్కడికి రప్పించే వ్యూహం ఆలోచించాలి. అందుకోసం అతడి కుటుంబాన్నీ, కొడుకునూ ఎరగా వాడుకోవాలి. ముఖ్యంగా అతడి కొడుకు. వాడంటే అతడికి ప్రాణం. అవును, కొడుకును ఎరవెయ్యాలి.

చర్చ ముగిశాక కళ్లుమూసుకుని ఆలోచించాడు షామిల్. 'అతడు కళ్లుమూసుకున్నాడంటే లోలోన ప్రవక్తవాణిని వింటున్నాడన్నమాట' అని సభికుల నమ్మకం. ప్రవక్త ఆదేశానుసారమే అతడు ఏ పనైనా చేస్తాడు. అయిదు నిమిషాల తర్వాత కళ్లు తెరిచి, భృకుటి ముడిచి "హాజీమురాద్ కొడుకును ప్రవేశపెట్టండి" అని ఆజ్ఞాపించాడు షామిల్.

"ఇక్కడే ఉన్నాడు" అన్నాడు జమాల్ ఎడ్డిన్ వినయంగా. నిజానికి హాజీమురాద్ కొడుకు యూసుఫ్, అక్కడే గేట్‌వద్ద నిలుచున్నాడు. అందమైన మొహం. సన్నగా, పీలగా ఉన్నాడు. నాయనమ్మలాగే నల్లటి కళ్లు. చింకిపాతల్లో స్నానం లేక దుర్వాసన వేస్తున్నాడు.

షామిల్ పట్ల తండ్రికున్న శత్రుత్వం యూసుఫ్‌కు లేదు. గత చరిత్ర అతడికి తెలియదు. తెలిసినా అదంతా స్వయంగా అనుభవించలేదు గనక తండ్రి షామిల్ పట్ల అనవసరంగా ద్వేషం పెంచుకున్నాడనే అనుకుంటున్నాడు. అతడిక్కావలసింది విలాస జీవితం. ఎందుకు షామిల్‌తో వైరం పెంచుకోవటం? తండ్రులను ధిక్కరించాలనే కోరిక సహజంగా చాలా మంది కొడుకులకు ఉన్నట్టుగానే అతడికీ ఉంది. ఆ కారణంతో అతడికి షామిల్ పట్ల ఆరాధనాభావం పెరిగింది. చెచెన్ గ్రామాల్లో అందరూ అతణ్ణి దేవుడిలా చూస్తారు. అతడు వాళ్లకు ఇమాం. లోపలికి ప్రవేశించిన యూసుఫ్‌ను సగం మూసిన కళ్లతో చూశాడు షామిల్. షామిల్‌ను సమీపించి అతడి చేతిని ముద్దాడాడు యూసుఫ్.

"నువ్వు హాజీమురాద్ కొడుకువా? "

"అవును, ఇమాం"

"నీ తండ్రేం చేశాడో నీకు తెలుసా? "

"తెలుసు. అందుకు విచారిస్తున్నాను కూడా"

"నువ్వు రాయగలవా? "

"ముల్లా కావాలని చదువుకుంటున్నాను"

"అయితే రాయి. బైరాం పండుగకు ముందు అతడు నావద్దకు తిరిగి వస్తే అతణ్ణి క్షమిస్తాం. అందరం ఇది వరకున్నట్టుగా కలిసిమెలిసి ఉందాం. లేకపోతే, రష్యన్లతోనే ఉంటానంటే నీ నాయన మ్మనూ, తల్లినీ, అందర్నీ తలా ఓ ఊరికి పంపిస్తాను. నీ తల నరికేస్తాను"

యూసుఫ్ ముఖ కవళికలు ఏమాత్రం మారలేదు. కాని షామిల్ మాటలు అర్థం చేసుకున్నట్టుగా తలాడించాడు.

మాట్లాడటం ఆపి, యూసుఫ్‌ను చాలా సేపు పరికించి చూశాడు షామిల్.

"ఇది కూడా రాయి. నీమీద జాలితో నిన్ను చంపదలచుకోవటం లేదు. కాని దేశద్రోహులందరికీ విధించే శిక్షమాత్రం తప్పదు. నీ కళ్లు పీకిస్తాను"

షామిల్ ముందు ప్రశాంతంగా ఉన్న యూసుఫ్, పక్కగదిలోకి వెళ్లగానే తన కాపలాదారు నుండి బాకు లాక్కుని పొడుచుకోవటానికి ప్రయత్నించాడు. అందరూ కలిసి అతడి రెక్కలు వెనక్కు విరిచి కట్టేశారు.

ఆ సాయంత్రం ప్రార్థనల తర్వాత తెల్లటి కోటు ధరించి, షామిల్ తన భార్యలున్న గదుల వైపు - అమీనల్ ఉన్న గది వైపు వెళ్లాడు. అయితే అక్కడ ఆమె కనిపించలేదు. సవతులతో కలిసి కబుర్లాడుతున్నదామె. తను కనిపించకుండా ఒక తలుపు వెనక నక్కి ఆమెకోసం నిరీక్షించాడు షామిల్.

అమీనల్ భర్త మీద కోపంగా వుంది. అతడు జైదాత్‌కు సిల్కు గుడ్డలేవో బహుమతిగా ఇచ్చాడు. భర్త రావటం, పోవటం చూసిందిగానీ కావాలనే అతనికి దూరంగా వుంది. జైదాత్ గదిలో నిల్చుని అతడు తన కోసం కాలుగాలిన పిల్లిలా తిరగటం చూసి నవ్వుకుంది.

అమీనల్ కోసం చాలాసేపు నిరీక్షించిన షామిల్ అర్ధరాత్రి ప్రార్థనల కోసం తన గదికి తిరిగివచ్చాడు.

హాజీమురాద్ కొత్తచోటుకి వచ్చి వారం దాటింది. మార్యా డిమిట్రియెవ్నా అప్పుడప్పుడు చివాట్లేసి ఖనేఫీని వంటింట్లోంచి గెంటేసినా హాజీమురాద్‌ను చాలా అభిమానంగా, ప్రేమగా చూసింది. హాజీమురాద్ తనవెంట ఖనేఫీనీ, ఎల్డార్‌లను మాత్రమే తెచ్చుకున్నాడు. అతడికి భోజనం వడ్డించే పని ఎల్డార్‌కు అప్పగించి మిగతా సేవలు తాను స్వయంగా చేసింది. అతడు తన కుటుంబం గురించి మాట్లాడినప్పుడల్లా చాలా ఆసక్తి కనపర్చింది. అతడి భార్యలు, పిల్లల గురించీ అడిగి, ఎవరెవరి వయసెంతో తెలుసుకుంది. గూఢచరులు వచ్చినప్పుడల్లా తాజా పరిస్థితుల గురించి వాకబు చేసింది.

బట్లర్‌కు కూడా హాజీమురాద్‌తో స్నేహం పెరిగింది. ఒకరి గదికి ఒకరు వెళ్ళి కబుర్లు చెప్పుకున్నారు. కొన్నిసార్లు దుబాసీ సాయంతో, కొన్నిసార్లు భాష అర్థం కాకపోయినా సైగలతో మాట్లాడుకు

మాస్టారిపై మనసు!

ఆయన్ని చూస్తే చాలు.. ఆమె బుగ్గల్లో సిగ్గుల మందారాలు పూస్తాయి. ఆయన మాట్లాడుతుంటే చాలు.. మనసులో వెన్నెలలు కురుస్తాయి. ఇంతకీ ఆమె ఎవరంటే ఓ విద్యార్థిని! పేరు శశి! ఇక ఆయన ఎవరంటారా? ఆ కాలేజీలో పనిచేసే బోటనీ లెక్చరర్ ప్రసన్న కుమార్.

గురువుగార్ని గుండెల నిండా ప్రేమించిన ఈ విద్యార్థిని కథ చివరికేమయింది?

విడవకుండా ఏకబిగిన చదివించే జి. ఉమాపతి తొలి నవల **శేశి** మిమ్మల్ని పలకరించేందుకు వస్తోంది.

చతుర జులై కానుక

న్నారు. ముఖ్యంగా చిరునవ్వులు భావాల్ని బాగా వ్యక్తం చేస్తాయి.

హాజీమురాద్‌కు బట్లర్‌తో సాన్నిహిత్యం పెరిగిందని తెలుసుకున్నాడు ఎల్డార్. అతడు గదిలోకి రాగానే, హాజీమురాద్ చిరునవ్వుతో కూర్చోవటానికి దిండు అందించి మర్యాద చేశాడు.

ఖనేఫీతో కూడా బాగానే పరిచయం పెంచుకున్నాడు బట్లర్. 'వాడు నా తమ్ముడు' అని హాజీమురాద్ స్వయంగా ప్రకటించాడు గతంలో. ఖనేఫీ తమ వాళ్ళ పల్లెపాటలు బాగా పాడగలడు. బట్లర్, హాజీమురాద్ కూడా తరచుగా అతడి చేత పాటలు పాడించుకుని విన్నారు. అతడి గొంతులో భావం బాగా పలుకుతుంది. ఉచ్ఛారణ స్పష్టంగా వుంటుంది. విషాద గీతాలు మరీ బాగా పాడతాడు. ఒక పాట హాజీమురాద్‌కు చాలా ఇష్టం.

'నా సమాధిమీద
మట్టి తడారిపోయింది.
అమ్మా, ఇక నువ్వు నన్ను మరచిపో..
గడ్డి మొలిచింది.
నాన్నా, ఇక నువ్వు నన్ను మరచిపో..
నీ అందమైన కళ్ళలో,
కన్నీళ్ళు ఇంకిపోతాయి
చెల్లెమ్మా, ఇంకెన్నాళ్ళు బాధపడతావు?
కానీ అన్నా! నువ్వు మాత్రం
ఎప్పుడూ మరువ వద్దు.
నేను తీర్చుకోలేని
ప్రతీకారం నువ్వు తీర్చుకోవాలి
తమ్ముడా! మరువ వద్దు.
నా పక్కకు వచ్చి చేరేముందు

పగ సాధించు
నల్లటి తుపాకిగుండు నా బానిస..
నేను మృత్యువును జయించాను
నా శరీరం మట్టిలో
సమాధి చేయబడింది
కానీ నా ఆత్మ స్వర్గంలో విహరిస్తుంది'

హాజీమురాద్‌కు ఈ పాటంటే చాలా ఇష్టం. ప్రతిసారీ కళ్ళు మూసుకుని తన్మయంగా వినేవాడు.

'మంచి పాట, అర్థమున్న పాట' అనేవాడు రష్యన్‌లో.

హాజీమురాద్, అతని మురిద్‌ల పరిచయంతో గిరిజన జీవితం గురించి అవగాహన పెరిగి బట్లర్‌లో తెలియని మార్పొచ్చింది. ఆ జీవన సరళిలోనే కవిత్వముంది. తను ఓ బనియన్, సర్కేషియన్ కోట్, లెగ్గింగ్స్ వేసుకుని గిరిజనుడిగా మారిపోయాననుకుని ఆనందించాడు.

హాజీమురాద్ వెళ్ళిపోయేరోజు వచ్చింది. ఇతర ఆఫీసర్లందర్నీ వీడ్కోలు కార్యక్రమానికి ఆహ్వానించాడు పెట్రోవ్. మార్యా డిమిట్రియెవ్నా అడిగినవాళ్లకు టీ, వోడ్కా, వైన్ సర్వ్ చేసింది. టేబుల్ మీద తినుబండారాలున్నాయి. డ్రెస్ చేసుకుని కుంటుతూ వచ్చాడు హాజీమురాద్.

అందరూ లేచి అతడితో కరచాలనం చేశారు. పెట్రోవ్ సోఫా చూపించాడుగాని హాజీమురాద్ కిటికీ పక్కన కుర్చీలో కూర్చున్నాడు. టేబుల్ మీద తినుబండారాలున్నాయి. సమోవర్‌లో టీ మరుగుతున్నది. కాని హాజీమురాద్‌కు ఎందులోనూ ఆసక్తి ఉన్నట్టుగా కన్పించలేదు.

"టిఫ్లిస్ నచ్చిందా?" అని అడిగాడు పెట్రోవ్ దుబాసీ ద్వారా.

"అల్యా" అంటూ జవాబిచ్చాడు హాజీమురాద్.

"బాగా నచ్చిందట" అన్నాడు దుబాసీ.

"అతడికేం నచ్చింది?"

"నాటకాలు"

"కమాండర్-ఇన్-చీఫ్ ఇంటిలో జరిగిన బాల్ డాన్స్ నచ్చలేదా?"

"ప్రతి దేశానికీ కొన్ని పద్ధతులుంటాయి. మా ఆడవాళ్ళు అలా డ్రెస్ చేసుకోరు" అన్నాడు హాజీమురాద్ కళ్లు చిట్లించి, మార్యా డిమిట్రియెవ్నావైపు ఓసారి చూసి.

"మొత్తంమీద నచ్చలేదన్నమాట"

"మా దగ్గరో సామెత వుంది. కుక్క, గాడిదను మాంసం తినమన్నదట. గాడిద, కుక్కను గడ్డి తినమన్నదట. అలా చేసి రెండూ ఆకలితో చచ్చాయి. ఎవరికివాళ్లకు తమ ఆచారాలు బాగానే వుంటాయి" అన్నాడు హాజీమురాద్ దుబాసీ ద్వారా.

సంభాషణ కొనసాగలేదు. కొందరు టీ తాగారు. కొందరు కొద్దిగా తిన్నారు. హాజీమురాద్ టీ గ్లాసు చేతిలో పట్టుకున్నాడు.

"పాలూ, బన్ను కావాలా?" అని అడిగింది మార్యా డిమిట్రియెవ్నా.

హాజీమురాద్ చిరునవ్వుతో అడ్డంగా తలూపాడు.

"ఓకే, ఇక గుడ్‌బై. మళ్లీ ఎప్పుడు కలుద్దాం?" అన్నాడు బట్లర్.

"వీడ్కోలు, మిత్రమా. మన స్నేహ బంధం బలపడనీ" అంటూ బయల్దేరాడు హాజీమురాద్.

ఒక తెల్లని బురఖా భుజాన వేసుకుని, చేతిలో ఖడ్గం పట్టుకుని ఎదురొచ్చాడు ఎల్డార్. బురఖా అందుకుని మార్యా డిమిట్రియెవ్నా వైపు చూస్తూ ఏదో చెప్పాడు హాజీమురాద్.

"మీకే బురఖా నచ్చిందన్నారట. ఇది మీకు బహుమతిగా ఇస్తున్నాడు" అన్నాడు దుబాసీ.

"వద్దు" అంది మార్యా కాస్త సిగ్గుపడుతూ.

"కానుక మాత్రమే" అన్నాడు హాజీమురాద్.

"థాంక్యూ, మీ కొడుకు క్షేమంగా వుండాలి. త్వరగా మిమ్మల్ని చేరుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంది మార్యా.

హాజీమురాద్ కృతజ్ఞతగా తలాడించి, ఎల్డార్ నుండి ఖడ్గం తీసుకుని పెట్రోవ్‌కు బహూకరించాడు.

"అతణ్ణి నా గోధుమరంగు గుర్రం తీసుకొమ్మను" అని దుబాసీతో చెప్పాడు పెట్రోవ్.

తనకు కానుకలొద్దన్నాడు హాజీమురాద్.

చాలాదూరం వెళ్ళాలి. దూరంగా కనిపించే పర్వతం వైపు చూస్తూ వడివడిగా నడిచాడు.

ఇంటిల్లిపాదీ బయటి గేటుదాకా వచ్చి అతడిని సాగనంపారు. అతడిచ్చిన ఖడ్గం పరిశీలించి ఇది నిజంగా 'గుర్డా ఖడ్గమే' అని సంతోషించారు.

గుర్రపుశాల దాకా హాజీమురాద్ వెంట నడిచాడు బట్లర్. అక్కడే అనుకోని సంఘటన ఒకటి జరిగింది.

రష్యన్లకు అనుకూలంగా వున్న గ్రామం టాష్‌కిచూ. అక్కడి ప్రజలకు హాజీమురాద్ అంటే అపారమైన గౌరవం. అతణ్ణి చూడటానికి తరచుగా వస్తుండేవాళ్ళు. తమ వూళ్ళో వున్న మసీదుకు రావాలని హాజిమురాద్‌కు మూడురోజుల క్రితమే దూతల ద్వారా వర్తమానం పంపించారు. కాని అక్కడి రాకుమారులకు హాజీమురాద్ అంటే ద్వేషం. ఇరువురి మధ్యా ఏదో పాత పగ రగులుతున్నది. హాజీమురాద్‌కు ప్రజలు ఆహ్వానం పంపిన విషయం తెలిసి, అతణ్ణి మసీదులోకి అనుమతించం అన్నారు. రాజకుమారుల మనుషులకూ, గ్రామస్థులకూ మధ్య పెద్ద పోట్లాట జరిగింది. గ్రామస్థులను శాంతింపజేసి హాజీమురాద్ మసీదును సందర్శించడని ప్రకటించారు రష్యన్ అధికారులు.

ఒప్పందం ప్రకారం హాజీమురాద్ అక్కడికి వెళ్ళలేదు. గొడవ సమసిపోయిందనే అనుకున్నారందరూ.

కాని సరిగ్గా హాజీమురాద్ వీడ్కోలు తీసుకుంటున్నప్పుడే బట్లర్ స్నేహితుడైన ఒక రాకుమారుడు అర్స్‌లాన్‌ఖాన్ అక్కడికి వచ్చాడు. హాజీమురాద్‌ను చూసి, కోపంతో ఊగిపోతూ, బెల్ట్‌లోంచి పిస్టల్‌ను తీసి కాల్చాడు. కాని అంతలోనే వంగి, దూరంగా పరిగెత్తి తప్పించుకున్నాడు హాజీమురాద్. ఆ తర్వాత అర్స్‌లాన్‌ఖాన్ గుర్రం కళ్లెం పట్టుకుని, బాకు తీసి టార్టార్‌లో ఏదో అరిచాడు.

బట్లర్, ఎల్డార్ పరిగెత్తి, ఇద్దర్నీ వేరు చేసి చేతులు వెనక్కి కట్టేశారు. పిస్టల్ చప్పుడు విన్న పెట్రోవ్ కూడా అక్కడికి చేరుకుని "ఇదేం పని అర్స్‌లాన్. ఈ నీచమైన పని నా ఇంట్లోనే చెయ్యాలా? యుద్ధరంగంలో కరుణ చూపించవద్దు. కాని ఇక్కడ ఇంట్లో చంపుకోవటం మర్యాద కాదు" అన్నాడు.

హాజీమురాద్ వైపు కోపంగా చూస్తూ, పెట్రోవ్ వెంట ఇంట్లోకి వెళ్లాడు అర్స్‌లాన్‌ఖాన్. భారంగా వూపిరి పీల్చుకుంటూ, నవ్వుకుంటూ గుర్రాల వైపు కదిలాడు హాజీమురాద్.

"అతడెందుకు చంపాలనుకున్నాడు? " అడిగాడు బట్లర్.

"అది వాళ్ళ సంప్రదాయమట. అతడి రక్తబంధువును హాజీమురాద్ చంపాడు. అందువల్ల అతడు ప్రతీకారం తీసుకోక తప్పదు" అని హాజీమురాద్ జవాబును అనువదించి చెప్పాడు దుబాసీ.

"అతడు దారి కాచి, నీ మీద దాడి చేసి వుంటే? " అనడిగాడు బట్లర్.

"ఒకవేళ అతడు నన్ను చంపటమే జరిగితే అది అల్లా నిర్ణయం. గుడ్‌బై" అంటూ గుర్రాన్ని అదిలించాడు హాజీమురాద్.

అప్పుడే అక్కడికి మార్యా డిమిట్రియెవ్నా కూడా వచ్చింది.

"గుడ్‌బై. అందరికీ గుడ్‌బై"

"దేవుడు నిన్నూ, నీ కుటుంబాన్నీ రక్షించాలి" అంది మార్యా డిమిట్రియెవ్నా. ఆ రష్యన్ మాటలు అర్థంకాకపోయినా ఆమె సానుభూతిగా ఏదో అన్నదని మాత్రం గ్రహించాడు హాజీమురాద్.

"నీ సోదరులను మరచిపోవద్దు" అన్నాడు బట్లర్.

"అతడు నా ఆప్తమిత్రుడు. నాలో ప్రాణ మున్నంతవరకూ మరచిపోను" అన్నాడు హాజీమురాద్ దుబాసీతో. గుర్రం కదిలింది. కళ్లేన్ని కొద్దిగా లాగాడు. నడుమ్మీది బాకు, ఖడ్గం ఒకసారి తాకి చూసుకున్నాడు. ఆ తర్వాత గుర్రం తన శరీరంలో ఓ భాగమన్నట్టు స్వారీ చేశాడు. ఖనేఫీ, ఎల్డార్‌లు కూడా సెలవు తీసుకుని తమ నాయకుని వెంటే బయల్దేరారు.

వెళ్ళిపోవలసినవాళ్ళు వెళ్లిపోయిన తర్వాత అక్కడున్నవాళ్లు వాళ్ల గురించి చర్చించుకున్నారు.

"ఏం నేర్పు అది. అర్స్‌లాన్‌ఖాన్ మీదికి సివంగిలా లంఘించాడు"

"కాని వీణ్ణి నమ్మలేం. పెద్ద కిలాడీలా వున్నాడు" అన్నాడు పెట్రోవ్.

"నిజమే. రష్యన్ కిలాడీలు కూడా అలా వుంటే ఎంత బాగుండేది! వారం రోజులు మన అతిథిగా వున్నాడు. ఏమైనా కిలాడీ పనులు చేశాడా? ఎంత మర్యాద, ఎంత ఆప్యాయత చూపించాడు" అంది మార్యా డిమిట్రియెవ్నా కాస్త కోపంగా.

"అతనిలో అన్ని మంచి గుణాలున్నాయని నీకెలా తెలిసింది? "

"ఎలాగోలా తెలిసిందిలే"

"అతడేదో మాయ చేశాడు"

"చేస్తే చేశాడు. నేనా మాయలో పడ్డాను. అయితే నీకేమిటి? మంచివాళ్లను ఆడిపోసుకోవటం ఎందుకు? టార్టార్ అయినంత మాత్రాన అలా మాట్లాడాలా? "

"మార్యా డిమిట్రియెవ్నా, నువ్వు చెప్పింది ముమ్మాటికీ నిజం" అన్నాడు బట్లర్.

చెచెన్యా సరిహద్దు వెంట వున్న దుర్గాల్లో జీవితం సజావుగా సాగిపోయింది. ఇప్పటివరకు మనం చెప్పుకున్న విషయాల తర్వాత మిలిటరీ రెండుసార్లు మాత్రమే 'యాక్షన్'లోకి దిగాల్సివచ్చింది. రెండుసార్లూ సైన్యాన్ని చూసి, అల్లర్లు సృష్టించటానికి వచ్చిన చెచెన్లు పర్వతాల్లోకి పారిపోయారు. ఓసారి మాత్రం వోడ్విజెన్‌స్కయ గ్రామంలో ఓ కోసక్కును చంపి ఎనిమిది గుర్రాలను అపహరించారు.

గ్రామాల మీద దాడులు జరగలేదు. విధ్వంసకాండ కూడా చెలరేగలేదు. కాని కొత్త కమాండర్ ప్రిన్స్ బార్యాటిన్స్కీ నియామకంతో యుద్ధం ప్రారంభమయ్యే అవకాశం వుందని గ్రహించారు. అతడు జనరల్‌కు పాత మిత్రుడు. ఇప్పటిదాకా కబార్జా రెజిమెంట్‌కు కమాండర్‌గా పనిచేశాడు. చక్రవర్తి ఆదేశాలు చెర్నిషోవ్ ద్వారా జనరల్‌కు చేరాయి. బార్యాటిన్స్కీ వాటిని అమలు చేయాలి.

సైన్యం కురిన్ ప్రాంతానికి చేరుకుని చెట్లు నరకటం ప్రారంభించింది. సైమన్ మిహలోవిచ్ వొరొంట్సోవ్ (వైస్‌రాయ్ కొడుకు) పక్క గ్రామం వోడ్విజెన్స్కయ గ్రామంలో పెద్దగుడారం వేసుకుని క్యాంప్ చేస్తున్నాడు. రాత్రుళ్లు భార్య మార్యా వాసిలెవ్నా తనతో గడపటానికి వస్తుంటుంది. బార్యాటిన్స్కీకి ఆమెతో వున్న సంబంధాల గురించి అందరికీ తెలుసు. చిన్న పుద్యోగులూ సైనికులూ ఆమెను తిట్టుకోని రోజు లేదు. ఆమె మూలంగా వాళ్లు రాత్రుళ్లు యుద్ధసన్నద్ధమైనట్లుగా నేలమీద బోర్లాపడుకుని డ్యూటీ చేయాల్సివస్తోంది. సాధారణంగా చెచెన్లు పర్వతాలలో దాగి అప్పుడప్పుడూ కాల్పులు జరుపుతుంటారు. కాని అవేవీ తనకింత వరకూ నష్టం చెయ్యలేదు. ఆ కాల్పుల శబ్దానికి మార్యా భయపడుతున్నది గనక వాళ్లు కాల్పులు జరపకుండా వీళ్లే ముందుగానే వాళ్లని చెదరగొట్టాలి. ఇది అనవసరమైన డ్యూటీ. అందుకే తిట్లు.

సెలవు మీద బట్లర్ తన పాత మిత్రులతో గడపటానికి కురిన్‌కు వచ్చాడు. సహోద్యోగులు అతనికి పోల్టోరాట్స్కీ గుడారంలో బస ఏర్పాటు చేశారు. రోజంతా కబుర్లు, వేళాకోళాలు, విందులు, వినోదాలు. వొరొంట్సోవ్‌తో పెద్దగా స్నేహం లేదు. ఒకప్పుడు ఇద్దరూ ఒకే రెజిమెంట్‌లో పనిచేశారు. ఆ పరిచయంతో వొరొంట్సోవ్, బట్లర్‌ను ఆహ్వానించి బార్యాటిన్స్కీకి పరిచయం చేశాడు. ఆ రోజు బదిలీ అయిన జనరల్ కొజ్లోవ్స్కీకి వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశాడు.

భోజనం బాగుంది. వరుసగా గుడారాలు వేసి, పొడుగాటి టేబుళ్ళ మీద డిన్నర్, బాటిళ్ళు అరేంజి చేశాడు. అంతా పీటర్స్‌బర్గ్ గార్డ్స్ క్యాంపులో జరిగినట్టే వుంది. రెండింటికి అందర్నీ లోపలికి ఆహ్వానించారు. ఒక వరుస మధ్యలో కూర్చున్నాడు కొజ్లోవ్స్కీ. ఇరువైపులా బార్యాటిన్స్కీ, వొరొంట్సోవ్‌లు, భర్త పక్క మార్యా ఆసీనులయ్యారు. కబార్జా, కురిన్ రెజిమెంట్ల ఆఫీసర్లందరూ ఆ పార్టీకి ఆహూతులే. పోల్టోరాట్స్కీ పక్కన కూర్చున్నాడు బట్లర్. మందు ధారాళంగా ప్రవహించింది. ఆర్డర్లీలు ఎవరి గ్లాసూ ఖాళీగా వుండాకుండా చూశారు.

"కొజ్లోవ్స్కీ యివ్వాళ నవ్వులపాలు కాక తప్పదు" అన్నాడు బట్లర్‌తో పోల్టోరాట్స్కీ.

"ఎందుకు? "

"తనకు జరిగిన సన్మానానికి సమాధానంగా అతడు వుపన్యసించాలి. ఉపన్యసించడమంటే యుద్ధం చెయ్యటమంత సులభం కాదు"

"నిజమే, పాపం! పూర్ కొజ్లోవ్స్కీ" అనుకున్నారు చాలామంది ఆఫీసర్లు.

చివరికి ఆ సమయం రానే వచ్చింది.

బార్యాటిన్స్కీ, కొజ్లోవ్స్కీకి టోస్ట్ చేశాడు. ఒక్క గుక్కలో తన డ్రింకు ముగించి కాస్త తత్తరపాటుతో ప్రారంభించాడు కొజ్లోవ్స్కీ.

"చక్రవర్తి ఆదేశానుసారం నేను మీకు వీడ్కోలు చెబుతున్నాను. మీ అందర్నుండీ సెలవు తీసుకునే సమయం ఆసన్నమైంది. కాని నేనెప్పుడూ మీ వాణ్ణే. మీ మధ్యనే

వుంటాను. ఒక సామెతుంది- యుద్ధరంగంలో ఒక్క మనిషి ఏ సాహసాలూ చెయ్యలేడు-అని. అందువలన జెంటిల్మెన్, మహాఘనత వహించిన చక్రవర్తిగారి నుండి నేను తీసుకున్న మెడల్స్, గౌరవాలు, పదోన్నతులు ఇప్పుడు నన్నిక్కడ నిలబెట్టిన ప్రేమకు నిస్సందేహంగా... (ఇక్కడ అతడి గొంతు రుద్ధమైంది) నేను మీకు సదా రుణపడి వుంటాను. మిత్రులారా! (మొహం ఎర్రబడింది, కన్నీరు ధారగా కారింది) మీకివే నా హార్దిక కృతజ్ఞతలు"

ఇక మాట్లాడలేక కొజ్లోవ్స్కీ ఒక్కొక్కర్నీ ఆలింగనం చేసుకున్నాడు. మార్యా తన చేతిరుమాలుతో కళ్లద్దుకుంది. అందరి కళ్లలోనూ నీళ్లు నిండాయి. కొజ్లోవ్స్కీని మొదటిసారిగా చూసిన బట్లర్ కూడా కన్నీటి పర్యంతమైనాడు. అతడికీ వుపన్యాసం బాగా నచ్చింది.

ఆ తర్వాత అనేకమంది టోస్ట్ చేశారు. బార్యాటిన్స్కీ, వొరొంట్సోవ్ మొదలైనవాళ్ల పొగడ్తల వర్షం కురిసింది. క్రమంగా నిషా తలకెక్కింది. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. మధ్యాహ్నపుటెండ నులివెచ్చగా వుంది. కౌగిలింతలు ముగిశాయి. చలిమంటల చుట్టూ పాటలు పాడుతూ నాట్యం చేశారు. బట్లర్ చాలా ఆనందంగా వున్నాడు. ఆఫీసర్లు కొందరు గ్రూపులుగా పేకాట టేబుళ్ళ వద్ద చేరారు. ఒక అడ్జుటెంట్(చిరుద్యోగి) వంద రూబుళ్ళతో బ్యాంకు ప్రారంభించాడు. ఈ వాతావరణంలో కాసేపు తచ్చాడి, నిగ్రహించుకోలేక, ఇక జీవితంలో ఎప్పుడూ పేకాట ఆడనని తన అన్నకిచ్చిన మాటను జవదాటి, టేబుల్ వద్ద కూర్చున్నాడు బట్లర్. గంట గడిచిందో లేదో ఒళ్ళంతా చెమట పట్టింది. ఒంట్లో వణుకు ప్రారంభమైంది. బ్యాంకర్ దగ్గర లెక్కలు చూసి ఎంత పోగొట్టుకున్నాడో తెలుసుకోవాలనుకున్నాడు. కాని ఆ ధైర్యం కూడా చెయ్యలేక పోయాడు. చాలా పోయుంటుంది. నెల జీతం అడ్వాన్స్‌గా తీసుకోవడంతోపాటు గుర్రాన్ని అమ్మినా కూడా ఈ బాకీ తీర్చలేడు. వీడు చిరుద్యోగి. బ్యాంకర్ అట. తన పేరు పక్కన ఇంత డబ్బు రాశాడు! కోపంతో మైమరిచిపోయేవాడే. కాని అడ్జుటెంట్ 'ఎంత పోయిందో తెలుసా? ' అని అడిగి కాగితం చూపించాడు. అంత మొత్తం ఉన్నపళంగా ఎక్కడి నుంచి తేగలడు? "ఇప్పుడు కాదు ఇంటికెళ్ళి పంపిస్తాను" అంటూ గొణిగాడు. అందరికీ జాలేసింది. అతడి వైపు చూడలేక తలలు తిప్పుకున్నారు. ఆ క్యాంపులో అది అతడి చివరి సాయంత్రం. ఎందుకాడుడు? వొరొంట్సోవ్ ఇంటికి ఆహ్వానించాడే. వాళ్లింటికెందుకు వెళ్ళలేదు? ఇంత డబ్బు మిగిలేది కదా? ఇంత అవమానం మూటకట్టుకునే వాడు కాదుగదా!

అందరి దగ్గరా సెలవు తీసుకుని, ఇంటికెళ్ళి పద్దెనిమిది గంటలపాటు కదలకుండా పడుకున్నాడు. పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకున్నప్పుడు మనుషులు అలాగే నిద్రపోతారు. తన వెంట వచ్చిన కోసక్కుకు యాభై కోపెక్కులివ్వమని అడిగిన ప్పటి నుండీ దిగాలుగా వున్న అతడి మొహం చూసి, ఏదడిగినా నోరు మెదపకపోవటం వల్లా, ఇలాంటిదేదో జరిగిందని గ్రహించింది మార్యా డిమిట్రియెవ్నా. అతడికి సెలవు ఇచ్చినందుకు పెట్రోవ్ మీద మండిపడింది.

తెల్లవారి మధ్యాహ్నం మెలకువ వచ్చిన తర్వాత మళ్లీ మామూలుగా పనులు చేసుకోవాలనుకున్నాడు గానీ సాధ్యపడలేదు. నాలుగు వందల డెబ్భై రూబుళ్లు బాకీ పడ్డాడు. తన నేరం అంగీకరిస్తూ వూళ్ళో వున్న మిల్లులో తన వాటా కూడా తీసేసు

కుని, చివరిసారి అయిదు వందల రూబుళ్లు పంపమని అన్నకు వుత్తరం రాశాడు. పిల్లికి బిచ్చం వెయ్యని మరో బంధువుకు ఇష్టం వచ్చిన వడ్డీ కట్టుకుని, అయిదు వందలివ్వమని అర్జీ పెట్టుకున్నాడు. మార్యా డిమిట్రియెవ్నా దగ్గర ఎంతో కొంత వుండకపోదు. ఆమె దగ్గర అప్పు తీసుకుని తనకివ్వమని పెట్రోవ్ దగ్గర మొరపెట్టుకున్నాడు.

"నీకివ్వాలనే ఉంది. కాని మార్యా డబ్బుల విషయంలో మహా గట్టిది. చచ్చి గీపెట్టినా ఒక్క రూబుల్ కూడా ఇవ్వదు. ఆడవాళ్లను అర్థం చేసుకోవటం ఎవరి తరం! ఒకసారి ఆలోచించావా, ఆ క్యాంటీన్ మేనేజర్‌గాడు బాగానే సంపాదించాడు. వాణ్ణడిగి చూడు" అని సలహా ఇచ్చాడు పెట్రోవ్.

క్యాంటీన్ మేనేజర్‌ను అడిగినా లాభం లేదు. ఇక తన అన్నయ్యయినా ఇవ్వాలి. లేదా పిసినారి బంధువయినా కరుణించాలి.

★ ★ ★

చెచెన్యాలో అనుకున్నది సాధించకపోవడంతో, టిఫ్లిస్‌కు తిరిగివచ్చి ప్రతి రోజూ వొరొంట్సోవ్ చుట్టూ ప్రదక్షిణలు చేశాడు హాజీమురాద్.

ఎలాగైనా తన వాళ్లను వదిలిపెడితే ఖైదీలను విడుదల చేస్తామని షామిల్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలి. కుటుంబమంతా అతడి చెరలో వుండడంతో తన చేతులు కట్టేసినట్లుంది. ఈ పరిస్థితిలో తను రష్యన్లకేమీ సాయం చేయలేడు. షామిల్‌ను అంతమొందించటం తనకు సాధ్యమే కాని అంతకుముందు తనవాళ్ళు విడుదలకావాలి.

"అలాగే, జనరల్ ఆర్గుటిన్‌స్కీ టిఫ్లిస్ పచ్చాక అతడితో సంప్రదించి ఏదో ఒకటి చేస్తాను" అన్నాడు వొరొంట్సోవ్ కాస్త చిరాకుగా.

ట్రాన్స్‌కాకేషియాలోని చెచెన్యా సరిహద్దులో ఉన్న నూఖా గ్రామానికి తనను వెళ్లనివ్వమని అర్థించాడు హాజీమురాద్. అక్కడుంటే తను స్వయంగా షామిల్‌తో మంతనాలు జరపొచ్చు, తన కుటుంబాన్ని విడుదల చేయించటానికి ప్రయత్నించవచ్చు. నూఖా ముస్లిం గ్రామం గనక అక్కడి మసీదులో తను ముస్లిం సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు చేసుకోవచ్చు. ఈ విషయంలో అనుమతి కోరుతూ చక్రవర్తికి అర్జీ పంపాడుగాని జవాబు రాకుండానే హాజీమురాద్‌ను నూఖా వెళ్లిపొమ్మని చెప్పాడు వొరొంట్సోవ్.

హాజీమురాద్ గురించి తెలిసిన అధికారులకూ, పీటర్స్‌బర్గ్‌లోని అధికారులకూ, వొరొంట్సోవ్‌కూ, చెచెన్యాతో యుద్ధంలో ఇది తమకు కలిసివచ్చే అంశంలా కనిపించింది. కాని హాజీమురాద్‌కు ఇదొక విపత్పరిణామం. అక్కడి నుండి పారిపోయి రష్యన్ల వైపు రావటానికి ముఖ్య కారణాలు ఆత్మరక్షణా, షామిల్ పట్ల ద్వేషమూ. కష్టనష్టాలకోర్చి చివరికి తన లక్ష్యం నెరవేర్చుకున్నాడు. షామిల్ మీద దాడి చెయ్యటానికి వ్యూహం కూడా సిద్ధం చేసుకున్నాడు. కుటుంబాన్ని కూడా సురక్షిత ప్రాంతానికి తరలించటం సులభమే అను

కుంటున్న దశలో, షామిల్ వాళ్లను చెరప ట్టాడు. ఇప్పుడు వాళ్ళను విడిపించుకో వటమే తన ప్రధాన లక్ష్యమై కూర్చుంది.

ఆడవాళ్ళను వూరికొకర్ని పంపిస్తానం టాడు షామిల్. కొడుకు కళ్లు పీకేస్తాడు. లేదా చంపేస్తాడు. నూఖా వెళ్ళి, దాగెస్తాన్‌లో వున్న తన సమర్థకులతో కలిసి బలప్రయోగం ద్వారానో, మరేదైనా పద్ధతిలోనో తన వాళ్లను విడిపించుకో వాలి. అతణ్ణి దేవుడిగా భావించే అవర్ ప్రజలు, తన కుటుంబాన్ని బలవంతంగా నైనా విడిపించి రష్యన్ సరిహద్దు దాటిం చడానికి వుద్యుక్తులయ్యారని చెప్పాడు హాజీమురాద్‌ను కలిసిన ఒక గూఢచారి. కాని హాజీమురాద్ వైపున్న అవర్ల సంఖ్య స్వల్పం. వెడెనో గ్రామంలో వాళ్లింటిమీద దాడి చెయ్యటం ప్రమాదకరం. అందువల్ల వాళ్లను మరోచోటికి తరలించేటప్పుడు, దారికాసి, వాళ్లను విడిపిస్తారట.

ఈ పని చేసినవాళ్లకు మూడు వేల రూబుళ్లు బహుమానమిస్తానన్నాడు హాజీ మురాద్.

నూఖాలో మసీదు పక్కనే ఉన్న ఓ అయిదు గదుల ఇంటిని హాజీమురాద్‌కు కేటాయించారు. అతడి కదలికల మీద నిఘా పెట్టాల్సిన అధికారులు, దుబాసీ, కొందరు అనుయాయులు ఆ యింట్లో వుంటారు. తన కోసం వచ్చే వాళ్లను కలు సుకోవటం, కొద్దిదూరం స్వారీ చెయ్యటం హాజీమురాద్ దినచర్య.

24 ఏప్రిల్‌నాడు హాజీమురాద్ స్వారీ నుండి తిరిగి వచ్చేసరికి, అధికారి ఒకడు తన కోసం టిఫ్లిస్ నుండి వచ్చాడని తెలి సింది. ఆ సమాచారం తెలుసుకోవాలని ఎంత కోరికగా వున్నా, మొదట తన నమాజు ముగించి అతణ్ణి కలిశాడు.

టిఫ్లిస్ నుండి వచ్చిన అధికారి పేరు, కౌన్సిలర్ కిరిలోవ్. పన్నెండవ తారీఖున హాజీమురాద్ టిఫ్లిస్ వచ్చి, జనరల్ అర్గు టిన్స్కి ముందు హాజరు కావాలి అని వొరొంట్సోవ్ ఆదేశం.

"అలాగా? " అని కోపంగా నుదురు చిట్లించాడు హాజీమురాద్.

"డబ్బులు తెచ్చావా? "

"తెచ్చాను" అన్నాడు కిరిలోవ్.

"రెండు వారాల డబ్బులు రావాలి" అంటూ చేతులు చాచాడు హాజీమురాద్.

"ఇస్తున్నాను" అని తన తోలుసంచీ విప్పాడు కిరిలోవ్. "ఇతడికి డబ్బులెం దుకు? ఏం చేసుకుంటాడు? " అని రష్య న్‌లో, ఇతర అధికార్లతో పరాచికాలాడాడు. హాజీమురాద్‌కు రష్యన్ తెలియదనుకున్నా డతను. కాని, కిరిలోవ్ మాటలు అర్థమై, హాజీమురాద్ కోపం మరింత పెరిగింది. సంచీలోంచి డబ్బులు తీస్తూ, అతడితో మాటలు కలపాలని "ఇక్కడ నీకు బోరుకొ ట్టడంలేదా? " అని అడిగాడు కిరిలోవ్. హాజీమురాద్ పెదాలు బిగించి దుబాసీ వైపు చూశాడు. దుబాసీ అదే ప్రశ్న మళ్ళీ అడిగాడు.

"అతడితో నేను మాట్లాడదలచుకోలేదు. డబ్బివ్వమను" అని దుబాసీ వైపు చూసి గర్జించాడు హాజీమురాద్.

డబ్బులు టేబుల్ మీద పోశాడు కిరి లోవ్.

హాజీమురాద్‌కు రోజుకు అయిదు బంగారు నాణాలు అలవెన్సుగా ఇస్తారు. రెండు వారాలకుగాను పదేసి బంగారు నాణాలు ఏడు వరుసల్లో పేర్చాడు కిరి లోవ్.

ఒక్కసారిగా నాణాలన్నీ దగ్గరకు లాక్కుని తన కోటు జేబులో వేసుకుని, కి రిలోవ్ తలమీద మొట్టికాయ వేసి చివా లున లేచాడు హాజీమురాద్.

కల్నల్ హోదాలో ఉన్న తనతో ఇలా ప్రవర్తించటం తగదని హాజీమురాద్‌కు

చెప్పమని దుబాసీతో కోపంగా వూగిపోతూ అరిచాడు కిరిలోవ్. కాని తనేం చేశాడో తనకు తెలుసన్నట్లుగా దుబాసీ మాటలను పట్టించుకోకుండా తన గదిలోకి వెళ్లిపోయాడు హాజీమురాద్.

"ఇలాంటి వాళ్ళనేమీ చెయ్యలేం. కోపం వస్తే బాకు నీ పొట్టలో గుచ్చుతాడు. అనాగరికులు!" అన్నాడు హాజీమురాద్‌కు ఇన్‌ఛార్జిగా వున్న ఒక ఆఫీసర్.

సాయంత్రం చీకటి పడుతున్నప్పుడు, ముసుగులు కప్పుకున్న ఇద్దరు గూఢచారులు వచ్చారు. ఇంటికి కాపలాగా వున్న ఆఫీసర్ వాళ్లను హాజీమురాద్ గదికి తీసుకెళ్ళాడు. వాళ్లు తీసుకొచ్చిన సమాచారం సంతోషకరమైనదేమీ కాదు. కుటుంబాన్ని విడుదల చేయిస్తామని చెప్పిన అతని అనుయాయులు ఇప్పుడాపని చేయటానికి నిరాకరించారు. షామిల్‌ను చూసి భయపడుతున్నారు. హాజీమురాద్‌కు సహాయం అందించిన వాళ్లను చిత్రహింసలు పెట్టి చంపుతానని హెచ్చరించాడతడు. గూఢచార్లు చెప్పిందంతా విని తలపట్టుకున్నాడు హాజీమురాద్.

ఏదో ఒకటి చెయ్యాలి. తీవ్రంగా ఆలోచించాడు. ఇంక మీనమేషాలు లెక్కపెట్టి లాభంలేదు. నిర్ణయం తీసుకుని తక్షణమే అమలు చెయ్యాలి. గూఢచారులకు చెరో బంగారు నాణెం ఇచ్చి వెళ్లిపొమ్మన్నాడు.

ఏం చెయ్యాలి?

దైవనిర్ణయం ఎలా వుంటే అలా జరుగుతుంది.

వార్తాహరులు నిష్క్రమించారు. తివాచీ మీద కూర్చుని మోకాళ్ళు పట్టుకుని, వెనక్కు వాలి దీర్ఘాలోచనలో మునిగాడు హాజీమురాద్.

ఏం చెయ్యాలి? షామిల్ మాటలు నమ్మి తిరిగి వెళ్లాలా? కాని వాడు జిత్తుల మారి. తనను తప్పక మోసం చేస్తాడు. మోసం చెయ్యకపోయినా ఆ నీచుణ్ణి తను భరించలేడు. వాడి ముందు తలొంచలేడు. ఒకసారి తను రష్యన్లవైపు వచ్చాడు గనక వాడు తనను నమ్మే ప్రసక్తి లేదు. ఒక నీతికథ గుర్తుకు వచ్చింది. వేట గాళ్ళకు చిక్కిన ఒక డేగ, కొన్నాళ్ళు వాళ్ళతో గడిపి, తిరిగి కొండల్లో వుంటున్న తన వాళ్ళ దగ్గరకు వచ్చింది. అయితే, ఇప్పుడు దాని కాళ్లకు వేటగాళ్ళు కట్టిన గంటలున్నాయి. అందుకే మిగతా డేగలు దాన్ని దగ్గరకు చేరనీయలేదు. 'నీకు గంటలు కట్టిన వాళ్ల వద్దకే వెళ్లిపో. ఇక్కడుండొద్దు' అన్నాయి నిష్ఠూరంగా. డేగ, తన గూటిలోనే వాటి మధ్యనే వుంటానంది. కాని అవన్నీ కలిసి దాన్ని పొడిచి చంపాయి.

తనవాళ్లు కూడా తననిప్పుడు ఇనుప ముక్కుల్తో పొడిచి చంపుతారు. చెచెన్యాలో తిరుగుబాటును అణచివేసి జార్ చక్రవర్తి మన్నన పొందితే తనకు తిరుగులేదు.

షామిల్‌ను నాశనం చెయ్యటం అసాధ్యమేమీ కాదు. లేకపోతే, వాడే నన్ను నాశనం చేస్తాడు.

నిద్ర రాలేదు. ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు. చాలాసేపు ఈ విషయాలే ఆలో

చిస్తూ గడిపాడు హాజీమురాద్.

అర్ధరాత్రికి నిర్ణయం జరిగిపోయింది. తను వెడెనో గ్రామం వెళ్లి, తన అనుచరుల సహాయంతో బందీలుగా వున్న తన వాళ్లను విడిపించుకోవాలి. ప్రమాదంతో కూడుకున్న పనే. చావు కూడా తప్పకపోవచ్చు. వాళ్లను విడిపించుకుని తిరిగి రష్యన్లవైపు రావాలా లేక కుంజాక్ గ్రామానికి వెళ్లి, బలాలను సమీకరించుకొని షామిల్ మీద యుద్ధం ప్రకటించాలా అన్నది యింకా తేలలేదు. తను తక్షణం రష్యన్ల నుండి తప్పించుకుని వెడెనా వెళ్లటం ముఖ్యం. ప్రణాళిక సిద్ధమైంది.

దిండుకింది నుంచి బనియను తీసుకుని తన మురిద్‌లు పడుకున్న గదిలోకెళ్లాడు. వాళ్లు హాల్లో మరోపక్క వుంటున్నారు. హాల్లో ప్రవేశించగానే చల్లని గాలి మొహాన కొట్టింది. వెన్నెలలో మంచు కురుస్తున్నది. ఈదురుగాలి చెవుల్లో ప్రవేశించింది. తోటలో నైటింగేల్ పక్షులు పాడుతున్నాయి.

మురిద్‌ల గది తలుపు తెరిచాడు. లోపల దీపం లేదు గాని మొదటిజాములో వున్న చంద్రుడి వెలుగు కిటికీలోంచి ప్రవేశించింది. ఒక మూలన టేబుల్, రెండు కుర్చీలున్నాయి. నలుగురు మనుషులు తివాచీ మీద నిద్రపోతున్నారు. ఖనేఫీ, బయట గుర్రాల దగ్గర పడుకున్నాడు. తలుపు తెరిచిన చప్పుడు విని గంజాలో లేచి చూసి మళ్లీ పడుకున్నాడు. ఎల్డార్ బనియన్ తొడుక్కుని, తన నాయకుని ఆజ్ఞకోసం నిరీక్షించాడు. ఖాన్ మహోమా, బాటా గాఢ నిద్రలో వున్నారు. హాజీమురాద్ వెంట తెచ్చిన బనియన్ టేబుల్ మీద పడేశాడు. దానికి బంగారు తీగల అల్లిక వుండటం వల్ల కిందపడినప్పుడు కొద్దిగా చప్పుడైంది.

"ఇవి కూడా బనియన్‌లో కుట్టెయ్యి" అన్నాడు హాజీమురాద్ బంగారు నాణాలు టేబుల్‌మీద పోస్తూ. ఎల్డార్ వెన్నెల్లోకెళ్లి బాకుతో బనియన్ కుట్టు విప్పి, రంధ్రం పెద్దది చేశాడు. ఈ చప్పుడుకు గంజాలో లేచి కూర్చున్నాడు.

"గంజాలో, రైఫిళ్లను, పిస్టళ్లను, తూటాలను సిద్ధం చేసి వుంచమని మన వాళ్లకు చెప్పు. రేపే మన ప్రయాణం" అంటూ ఆదేశించాడు హాజీమురాద్.

"ఎప్పుడో రెడీ చేసి వుంచాను" అంటూ మరేదో గొణిగాడు గంజాలో. ఆయుధాలను ఎందుకు లోడ్ చేయమన్నాడో అర్థమైంది. మొదటినుండీ తన కోరిక ఒకటే. వీలైనంతమంది రష్యన్లను పొడిచి చంపి పర్వతప్రాంతాలకు పారిపోవాలి. రోజురోజుకూ ఆ కోరిక పెరుగుతూనే వుంది. ఇన్నాళ్లకు హాజీమురాద్ తన కోరిక తీర్చుకునే అవకాశం కల్పించాడు.

హాజీమురాద్ నిష్క్రమించగానే పడుకున్నవాళ్లందర్నీ లేపి ఆయుధాలపని ప్రారంభించాడు గంజాలో. పాతవాటిని శుభ్రం చెయ్యాలి. పాలిష్ చెయ్యాలి. అవసరమైన మరమ్మతులు చెయ్యాలి. ఖడ్గాలకు, బాకులకు కొవ్వు పట్టించాలి. గ్రీజు పూస్తే పదును పెరుగుతుంది.

తెల్లవారుజామున మళ్లీ అక్కడికి నీళ్ల కోసం వచ్చాడు హాజీమురాద్. నైటింగేల్‌ల గానం మరింత స్పష్టంగా వినిపిస్తున్నది. బాకులకు సానపెడుతున్నారు. సానరాతిమీద కీచుకీచుమన్న శబ్దం లయబద్ధంగా, వీనులవిందుగా వుంది. తొట్టిలోంచి నీళ్లు ముంచుకునిపోతున్న హాజీమురాద్‌కు ఖనేఫీ గొంతు వినిపించింది. అది తనకు తెలిసినపాటే. అయినా మరోసారి వినాలనిపించింది. హంజద్ అనే వీరుడు రష్యన్ల తెల్ల గుర్రాలను బంధించి తీసికెళ్లాడు. వందలాదిమంది రష్యన్ సైనికులు అతణ్ణి వెంబడించి తెరెక్ గ్రామం

దగ్గర చుట్టుముట్టారు. హంజద్ ఆ గుర్రాలను వధించి, తుపాకులలో తూటాలున్నంతవరకు, బెల్టులో బాకులు ఉన్నంతవరకు, ఒంట్లో చివరి నెత్తుటిబొట్టు ఉన్నంతవరకు హోరాహోరీ యుద్ధంచేసి నేలకొరిగిన వైనం వివరిస్తుందాపాట.

ఎగురుతూ వచ్చిన పిట్టల్లారా, పక్షుల్లారా/ ఇళ్లకెళ్లి మా అమ్మలతో, అక్కలతో, చెల్లెళ్లతో/ మాకోసం నిరీక్షిస్తున్న అందాల పడతులతో చెప్పండి.

పవిత్రయుద్ధంలో ప్రాణాలర్పించాం మేం/ సమాధుల్లో ప్రశాంతంగా నిద్రించవు మా శరీరాలు/ తోడేళ్లు మమ్మల్ని పీక్కుతింటాయి/ గద్దలు మమ్మల్ని పొడుచుకుతింటాయి.

చివరి పంక్తుల విషాదానికి 'లా-ఇలాకా-యిల్' అంటూ గొంతు కలిపాడు బాటా. అదో పొలికేకలా విన్పించింది. ఆ తర్వాత క్షణం సేపు భీకర నిశ్శబ్దం ఆవరించింది, నైటింగేల్స్ గొంతులు తప్ప.

పరధ్యానంలో వున్న హాజీమురాద్ చెయ్యి తగిలి జగ్గులోని నీళ్లు వొలికిపోయాయి. చికాకుగా మళ్లీ నీళ్లకోసం వచ్చాడు. కార్యక్రమాల తర్వాత ఆయుధాలు పరీక్షించి, బెడ్ మీద కూర్చున్నాడు. తను వెడెనో వెళ్లాలంటే రష్యన్ ఆఫీసర్ల అనుమతి తప్పనిసరి. కాని యింకా తెల్లవారలేదు. వాళ్లంతా నిద్రలో వుంటారు.

ఖనేఫీ పాట, తన తల్లి పాడిన పాటను గుర్తు చేసింది. ఆ పాటను తనొకసారి లారిన్ మెలికొవ్‌కు వినిపించాడు.

ఎదుట తల్లి కనిపించింది. నెరసిన జుత్తు, ముడతలు పడిన చర్మంతో, పళ్ల మధ్య సందులతో ఉంది. చివరిసారి చూసినప్పుడు ఆమె ఇలాగే వుంది. యవ్వనంలో అందంగా వున్న అమ్మ బొద్దుగా ఉన్న అయిదేళ్ల తనను బుట్టలో ఎత్తుకుని, పర్వతాల్లో మైళ్లకు మైళ్లు నడిచి, పుట్టింటికి తీసుకుపోయింది.

తన బాల్యంతోపాటు తన కొడుకు యూసుఫ్ రూపం కూడా కళ్లముందు మెదిలింది. వాడంటే తనకు ప్రాణం. వాడికి తొలిసారి శిరోముండనం తానే చేశాడు. ఇప్పుడు వాడు యువవీరుడు. మహాశౌర్యశాలి. సెమ్‌లెస్ గ్రామంలో చివరిసారి వాణ్ని చూసినప్పుడెలా వున్నాడో అలాగే వూహించుకున్నాడు. ప్రయాణానికి గుర్రం వాడే సిద్ధం చేశాడు. వెంట వస్తానన్నాడు. రావటానికి అనుమతివ్వమని అర్థించాడు. డ్రెస్ చేసుకుని, ఆయుధం ధరించి సిద్ధంగా నిల్చున్నాడు. సన్నగా, చిరుతలాగా వున్నవాడు తండ్రికన్నా పొడుగుంటాడు. అందమైన మొహం. జీవితంలోని ఆనందమంతా తనదే అన్నట్టు ధీమాగా వుంటాడు. ఆజానుబాహువు. చెంగుచెంగున గెంతినట్టుగా వుంటాయి కదలికలు. వాడిని చూడటానికి రెండు కళ్లూ చాలవు.

"నువ్విక్కడే వుండటం మంచిది. అమ్మనూ, నానమ్మనూ జాగ్రత్తగా చూసుకో" అని హితవు చెప్పాడు తాను.

యూసుఫ్ గర్వంగా తనవైపు చూసి "నా గొంతులో ప్రాణమున్నంతవరకూ వాళ్లకి ఏ ఆపదా రాదు" అన్నాడు.

వాడికళ్లు పీకేస్తానంటున్నాడు షామిల్. ఆ తర్వాత వాడు తన భార్యనేం చేస్తాడో వూహించుకుంటేనే భయం వేస్తుంది.

ఆ ఆలోచనలతో సతమతమై కూర్చోలేక అటూ యిటూ పచార్లు చేశాడు. కుంటు తూనే పరిగెత్తి, ఎల్డార్‌ను పిలిచాడు. ఇంకా తెల్లారలేదు కాని వెలుగొచ్చింది. నైటింగేల్స్ నిర్విరామంగా పాడుతూనే వున్నాయి.

"వెళ్లి, ఆఫీసర్‌కు చెప్పు. నేను గుర్రం మీద పోతాను. త్వరగా జీనువేసి రెడీ చెయ్యి" అని మరో మురిద్‌ను ఆదేశిం

చాడు హాజీమురాద్.

అప్పు తీర్చలేక అవమానభారంతో కుంగిపోయిన బట్లర్ వీరగాథలూ, యుద్ధ కవిత్వం చదివి కాలక్షేపం చేశాడు. హాజీ మురాద్‌లాగ సర్కేషియన్ కోటు తొడుక్కుని మురిసిపోయాడు. శత్రువుల వేటకు రెండుసార్లు బొగ్దానొవిచ్‌తో కలిసి వెళ్లాడు గాని, ఎవరూ కనిపించలేదు. బొగ్దానొవిచ్ ధైర్యశాలి. గొప్ప వీరుడు. అలాంటివాడితో కలసి తిరగటంవల్ల తనకూ ధైర్యం పెరిగినట్టనిపించింది. ఒక యూదుమనిషి దగ్గర అత్యధిక వడ్డీకి డబ్బులు తీసుకుని అప్పుతీర్చాడు. అంటే అతడు తన సమస్యను తీర్చుకోలేదు. కేవలం వాయిదా వేసుకున్నాడు. కవిత్వం సరిపోక మద్యంలో కూడా మనశ్శాంతి వెదుక్కున్నాడు. తాగుడెక్కువైనకొద్దీ బలహీనత కూడా పెరిగింది- నైతికంగా. మార్యా డిమిట్రియెవ్నా పట్ల ఇప్పుడతని చూపుల అర్థం మారింది. ఆమెతో వ్యవహారం పెట్టుకోవాలనుకున్నాడు. కాని ఆమె పరుషంగా మాట్లాడి తిరస్కరించింది. ఇది మరో అవమానం.

ఏప్రిల్ చివరలో బార్యాటిన్స్కి పంపిన సైన్యం దుర్గం చేరుకుంది. చెచెన్యామీద దాడికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అప్పటి దాకా సాధ్యం కాదనుకున్నది యిప్పుడు ఆచరణలో పెట్టబోతున్నారు. సైన్యంలో రెండు కంపెనీల కబార్డా రెజిమెంట్లున్నాయి. కాకేసియన్ సంప్రదాయం ప్రకారం కురిన్ కంపెనీలు వాళ్లకు అతిథి మర్యాదలు చేశాయి. బారక్స్‌లో బసచేసిన సైనికులకు బక్‌వీట్ పాయసం, బీఫ్ మాత్రమే గాక వొడ్కా కూడా సప్లై చేశారు. కురిన్ ఆఫీసర్లతో కలిసి వున్నారు గనక భోజనంతో పాటు పాటలు, నాట్యాలు, తాగుడు పోటీలతో మజా చేశారు. మందెక్కువైన పెట్రోవ్ ఖడ్గం దూసి ఊహాశత్రువులను సంహరించాడు. ఒకసారి బూతులంకించుకుంటాడు. ఒకసారి పడిపడి నవ్వుతాడు. ఒకసారి ఎవరినో కౌగిలించుకోబోతాడు. మరోసారి డాన్సు స్టెప్పులు వేయటానికి ప్రయత్నిస్తాడు.

బట్లర్ కూడా అక్కడే వున్నాడు. ఈ ప్రహసనంలో అతడికి యుద్ధకవిత్వం కనిపించింది. కాని పెట్రోవ్ స్థితి చూసి జాలేసింది. ఇప్పుడు అతణ్ణి ఆపటం అసాధ్యం. అసలు విషయమేమిటంటే తనకు కూడా తల తిరుగుతున్నట్టుగా వుంది. నెమ్మదిగా యింటివైపు కదిలాడు.

తెల్లటి యిళ్లగోడల మీదా, రాళ్లమీదా మెరిసింది వెన్నెల. ఆ వెలుగులో ప్రతి గులకరాయీ, ప్రతి గడ్డిపోచా, దుమ్మూధూళీ కూడా స్పష్టంగా కనిపించాయి. ఇంటికి సమీపంలో మార్యా డిమిట్రియెవ్నా ఎదురొచ్చింది. భుజాల మీద శాలువా కప్పుకుంది. 'ప్రేమ' పరాభవం తర్వాత ఆమె కనిపిస్తే తప్పుకునిపోవటం అలవాటు చేసుకున్నాడు బట్లర్. అలా చేసినందుకు తనకే సిగ్గుగా వుంది. కాని ఈ వెన్నెల వెలుగులో మందిచ్చిన ధైర్యంతో ఆమెతో రాజీ కుదుర్చుకోవచ్చని అనుకున్నాడు.

"ఎక్కడికి బయల్దేరావు? "

"ఇంకెక్కడికి.. మా ఆయన కోసం"

అందామె సరదాగా.

అతడి పట్ల ఆమెకేమాత్రం ప్రేమభావనా లేదు. ఆనాడు నిజంగానే కోపం వచ్చి తిట్టింది. కాని అతడు తనను చూసి దూరంగా పోవటం ఆమెకు నచ్చలేదు.

"ఎందుకు వెదుకుతావు? వస్తాడులే"

"వస్తాడంటావా? "

"అతడు రాలేని పరిస్థితిలో వాళ్లు తీసుకొస్తారు"

"తప్పుగదా. అతడు ఇలా పాడైపోతుంటే చూస్తూ వూరుకోనా? "

"ఏం ఫరవాలేదు. ఇంటికి పద"

వెనుదిరిగి అతనితో కలిసి నడిచింది మార్యా డిమిట్రియెవ్నా. వెన్నెల ఎంత ప్రకాశమంతంగా వుందంటే నేల మీది వాళ్ల తలల నీడల చుట్టూ ఏదో కాంతి పుంజం వున్నట్టనిపించింది. ఆమె పట్ల తనకు గౌరవముందని, అన్యథా భావించవద్దని చెప్పి రాజీ కుదుర్చుకోవాలనుకున్నాడు బట్లర్. కాని ఎలా ప్రారంభించాలో అర్థం కాలేదు. అతడేం చెబుతాడో విందామని ఆమె నిరీక్షించింది. ఇద్దరూ నిశ్శబ్దంగా యింటి దాకా నడిచారు. అప్పుడు వీధి సందులో కొందరు అశ్వికులు కనిపించారు. ఒక ఆఫీసరుకు ఎస్కార్ట్‌గా వస్తున్నారు వాళ్లు.

"ఎవరు వాళ్లు? " అంది మార్యా డిమిట్రియెవ్నా పక్కకు తొలుగుతూ. వెన్నెల వాళ్ల వెనక వైపుండటంతో బాగా దగ్గిరకొచ్చిందాకా మొహాలు కనిపించలేదు. ఆ ఆఫీసర్ పేరు కామెనెవ్. ఇదివరలో పెట్రోవ్ వద్ద పనిచేశాడు. మార్యా డిమిట్రియెవ్నాకు తెలుసతడు.

చేరువగా రాగానే "నువ్వా కామెనెవ్!" అంది.

"ఆఁ నేనే" అని బట్లర్ వైపు చూస్తూ "ఎలా వున్నావు? ఇద్దరూ కలిసి వాకింగ్ చేస్తున్నారా? పెట్రోవ్ ఎక్కడున్నాడు? అర్జెంట్..." అన్నాడు కామెనెవ్.

"అక్కడ" అంటూ పాటలు విన వస్తున్న వైపు చూపించాడు బట్లర్. మార్యా డిమిట్రియెవ్నా "అక్కడ పార్టీ నడుస్తున్నది" అని చెప్పింది.

"భలే! మీరిద్దరూ యిక్కడ పార్టీ చేసుకుంటున్నారా? "

"లేదు. కబార్జా రెజిమెంట్‌వాళ్లు వచ్చారు. వాళ్ల కోసమే పార్టీ"

"గుడ్! నేను కూడా జాయిన్ అవుతాను. ఒక నిమిషం పెట్రోవ్‌తో మాట్లాడాలి"

"అధికారిక వ్యవహారమా? "

"ఆఁ ఇంచుమించు అలాంటిదే"

"మంచా, చెడా? "

"కొందరికి మంచి, కొందరికి చెడు" అని నవ్వాడు కామెనెవ్.

అందరూ యింటికి చేరుకున్నారు.

"చికిరెవ్, ఇలా రా" అంటూ ఓ కోసక్కును పిలిచాడు కామెనెవ్.

ఒక అశ్వికుడు ముందుకొచ్చాడు. డాన్ కోసక్కు యూనిఫాంలో వున్నాడు. జీనుకోగోతాము వెళ్లాడుతోంది.

"దాన్ని దించుకో" అని తాను గుర్రం దిగి, గోతాము వైపు వేలు చూపించాడు కామెనెవ్.

కోసక్కు దిగి, గోతాము చేతిలో పట్టుకున్నాడు. కామెనెవ్ ముడివిప్పి గోతాములో చెయ్యి పెట్టాడు.

"మిమ్మల్ని సర్ప్రైజ్ చెయ్యాలనుకుంటున్నాను. ఓ అరుదైన కానుక తీసుకొచ్చాను. భయపడవు గదా? "

"నేనెందుకు భయపడతాను? " అంది మార్యా డిమిట్రియెవ్నా.

"ఇదిగో, చూడు" అంటూ గోతాంలోంచి ఓ మనిషి తల పైకి తీశాడు కామెనెవ్. వెన్నెల్లో అది కూడా మెరిసింది.

"గుర్తు పట్టగలవా? "

శిరోముండనం చేసిన తల అది. చిన్న గడ్డం, మీసాలు. ఒక కన్ను తెరచి వుంది. మరొకటి మూసుకుపోయి వుంది. తల మీద గాటు ఉంది. ముక్కు దగ్గర నెత్తురు గడ్డ కట్టింది. నెత్తుటిలో తడిసిన గుడ్డలో చుట్టి వుంది మెడ. మొహం మీద గాయాలున్నా, పెదాల మీద చంటి పిల్లల చిరునవ్వుంది.

మార్యా చివాలున తల తిప్పుకుని, మాట్లాడకుండా గబగబా యింట్లోకి నడిచిపోయింది.

ఆ తల నుండి దృష్టి కదల్చలేకపోయాడు బట్లర్. అది హాజీమురాద్ తల. అనేక రోజుల పాటు కబుర్లు చెప్పి, ఎన్నో అనుభవాలు పంచుకున్న మిత్రుడి తల.

"ఎలా జరిగింది ఇది? ఎవరు చంపారు? " అడిగాడు.

"మనకళ్లు గప్పి పారిపోవాలనుకున్నాడు. కాని, మేం పట్టుకున్నాం" అంటూ, తలను కోసక్కుకు తిరిగిచ్చాడు కామెనెవ్.

ఇద్దరూ యింట్లోకి నడిచారు.

"హీరోలా మరణించాడు"

"ఎలా జరిగింది ఇంతకూ? "

"ఒక్కక్షణం ఓపికపట్టు. పెట్రోవ్ రానీ. అంతా సవివరంగా చెబుతాను. అసలు నేనిక్కడికి వచ్చిందే అందుకు. అన్ని దుర్గాలకూ, అన్ని గ్రామాలకూ దీన్ని తీసుకెళ్లి ప్రదర్శించాలి"

కొందరు సైనికులు వెళ్లి పెట్రోవ్‌ని వెంటబెట్టుకు వచ్చారు. ఇంకా మత్తు దిగలేదు. చూడగానే కామెనెవ్‌ను కావలించుకున్నాడు.

"నేను హాజీమురాద్ తల తీసుకొచ్చాను" అన్నాడు కామెనెవ్.

"చంపారా? "

"పారిపోవటానికి ప్రయత్నించాడు"

"అలాంటిదేదో చేస్తాడని నాకు తెలుసు. ఇంతకూ తల ఏది? ఒకసారి చూడనీ"

కోసక్కు మళ్లీ గోతంలోంచి తీశాడు తల. కళ్లు మూతలు పడుతున్నా, చాలా సేపు చూశాడు పెట్రోవ్.

"ఏదో జరిగిపోయింది గాని మనిషి మంచివాడు. గుడ్ ఫెల్లో. ఒకసారి ముద్దాడనీ"

"ఇది వీరుని తల" అన్నారు ఆఫీసర్లు.

తలను కోసక్కుకు తిరిగిచ్చారు. నేలకు తగిలితే గాయమవుతుందేమోనన్నట్టుగా, జాగ్రత్తగా గోతంలో పెట్టాడతడు.

"కామెనెవ్, నీకు తెలిసిందంతా చెప్పు" అని అడిగాడో ఆఫీసర్.

"అతడు నాకు ఖడ్గం బహుమతిగా యిచ్చాడు" అన్నాడు పెట్రోవ్.

వసారాలోకి వెళ్లాడు బట్లర్.

రెండోమెట్టు మీద కూర్చుంది మార్యా డిమిట్రియెవ్నా. అడుగుల చప్పుడు విని, కోపంగా తలతిప్పి చూసింది.

"ఎందుకలా వున్నావు మార్యా డిమిట్రియెవ్నా? "

"మీరంతా మిత్రద్రోహులు. విశ్వాస ఘాతకులు. కట్‌థ్రోట్స్. నమ్మించి గొంతు కోస్తారు. దుర్మార్గులు"

"ఇది యుద్ధం. ఎవరికైనా యిలా జరగొచ్చు" అన్నాడు బట్లర్.

"యుద్ధం! యుద్ధంలో నీతి వుండదా?

ధర్మం వుండదా? మృతదేహాన్ని భూమిలో సమాధి చెయ్యాలి. వాళ్లేమో దాన్ని ఊరూరా ప్రదర్శనకు పెడతారట" అంటూ గబగబా నడిచి లోపలికెళ్లి తలుపేసుకొంది.

గదిలోకి తిరిగి వచ్చి, అసలేం జరిగిందో చెప్పమని కామెనెవ్‌ను అడిగాడు బట్లర్.

అంతా పూసగుచ్చినట్టు చెప్పాడు కామెనెవ్.

ఏం జరిగిందంటే...

★ ★ ★

ఊళ్లో మాత్రమే స్వారీ చెయ్యటానికి హాజీమురాద్‌కు అనుమతి ఉంది. అది కూడా కోసక్కు సైనికులు తనను అనుసరించినప్పుడు మాత్రమే. ఆ సమయంలో నూఖాలో ఉండవలసినదాంట్లో సగం సైన్యం మాత్రమే ఉంది. అందులో పది మందిని ఆఫీసర్ల కోసం కేటాయించారు. అందువల్ల హాజీమురాద్‌ను అనుసరించటానికి అయిదుగురు మాత్రమే సిద్ధంగా ఉన్నారు. వెంట తన అనుచరులందర్నీ తీసుకొని స్వారీకి రావద్దని హాజీమురాద్‌కు సూచించారు. కాని ఏప్రిల్ 25నాడు మొత్తం ఐదుగుర్నీ తీసుకొని బయల్దేరాడు హాజీమురాద్. ఇది గమనించి అంతమందిని వెంటతెచ్చుకోవటానికి అనుమతి లేదని సూచించాడు కమాండర్. కాని అతడు ఆ మాటలు వినిపించనట్టుగా తన గుర్రాన్ని అదిలించాడు. కమాండర్ కూడా పెద్దగా పట్టించుకోలేదు.

కోసక్కు సైనికుల వెంట ఒక నాన్ కమిషన్డ్ ఆఫీసర్ నజారోవ్ కూడా ఉన్నాడు. ధైర్యసాహసాలకుగాను అతడికి ఇటీవలే మెడల్ వచ్చింది. ఆరోగ్యంగా, అప్పుడే విరిసిన గులాబీలా ఉన్నాడు కుర్రాడు. పేద కుటుంబం. తండ్రి లేడు, అన్నదమ్ములందర్లోకీ పెద్దవాడతడు. తల్లీ, ముగ్గురు చెల్లెళ్లూ, ఇద్దరు తమ్ముళ్లూ ఉన్నారు.

"జాగ్రత్త! నజారోవ్! అతణ్ణి ఫాలో అవ్వాలి" అని ఆదేశించాడు కమాండర్.

"అలాగే, సర్" అంటూ గుర్రాన్ని పరిగెత్తించాడు నజారోవ్. మరో నలుగురు కోసక్కు సైనికులు అతని వెంట కదిలారు. అందులో ఒకడు ఖెరాపొంటొవ్. సన్నగా పొడుగ్గా ఉంటాడు. దొంగ. గంజాలోకు గన్‌పౌడర్ అమ్మింది అతడే. మరొకడు ఇగ్నాటొవ్. బలంగా ఉంటాడు, సీనియర్. కొన్నాళ్లలో సర్వీస్‌నుండి రిటైర్ అవుతాడు. ఇంకొకడు మిష్కిన్. బలహీనంగా కనిపిస్తాడు. అందరూ వాణ్ణి చూసి నవ్వుతారు. చివరివాడు పెట్రాకోవ్. తల్లికి ఒక్కడే కొడుకు. సరదాగా ఉంటాడు.

ఉదయం మంచు కురిసింది. కాని ఇప్పుడు బాగా ఎండ కాస్తున్నది. పచ్చగా మెరిసే చెట్టూచేమా, గడ్డి, మొక్కజొన్న, గలగలా ప్రవహించే నది- అది ఆహ్లాదకరమైన వాతావరణం.

హాజీమురాద్ గుర్రం నెమ్మదిగా కదిలింది. కోసక్కు సైనికులు, అతడి మనుషులు కూడా హాజీమురాద్‌ను వెంబడించారు. కోట దాటి మరింత ముందుకు నడిచాయి గుర్రాలు. బుట్టలు నెత్తికెత్తుకున్న మహిళలూ, బళ్లు తోలుతున్న సైనికులూ కనిపించారు. ఒకటిన్నర మైలు తర్వాత హాజీమురాద్ తన కబార్జా అశ్వాన్ని నెమ్మదిగా అదిలించటంతో అది దౌడు తీసింది. కోసక్కులు, అతడి మనుషులు కూడా తమ గుర్రాలను పరుగెత్తించారు.

"గుర్రమంటే అలా ఉండాలి. ఎంత అందంగా దౌడు తీస్తున్నదో. అతడు నా శత్రువైతే అతడ్ని చంపి ఆ గుర్రాన్ని స్వాధీనం చేసుకొనేవాణ్ణి" అన్నాడు ఖెరాపొంటొవ్.

"టిఫ్లిస్‌లో దానికి వంద రూబుళ్లు ఇస్తామన్నారు"

"అతణ్ణి నేను అందుకోగలను" అన్నాడు నజారొవ్.

వేగం పెంచాడు హాజీమురాద్.

"ఆగు భాయ్, వేగం తగ్గించు, నెమ్మదిగా పోనీ" అంటూ అరిచాడు నజారొవ్.

వెనక్కు తిరిగి చూసి, ఆగకుండా ముందుకు కదిలాడు హాజీమురాద్.

"దుర్మార్గులు. మనకళ్లు గప్పి పోవాలనుకుంటున్నారు. చూడు, గుర్రాలను ఎలా పరిగెత్తిస్తున్నారో" అన్నాడు ఇగ్నాటొవ్.

పర్వతాల దిశగా కదిలాయి గుర్రాలు.

"ఆగు, అది పద్ధతి కాదు" అంటూ మళ్లీ అరిచాడు నజారొవ్.

జవాబివ్వకుండా వేగం మరింత పెంచాడు హాజీమురాద్.

"దొంగా, నువ్వెక్కడికి పోతావురా!" అంటూ గుర్రాన్ని దౌడు తీయించాడు నజారొవ్. కొరడాతో ఒక్క దెబ్బ వేయటంతో అది గాలిలో ఎగిరినట్టుగా కదిలింది.

ఆకాశం నిర్మలంగా ఉంది. చల్లటి స్వచ్ఛమైన గాలి వీస్తున్నది. నజారొవ్‌కు కూడా ఆనందంగా ఉంది. గుర్రం, తాను కలిసిపోయినట్టుగా హాజీమురాద్‌ను వెంబడించాడు. ఆరోజు ఏదైనా ప్రమాదం ముంచుకొస్తుందేమోనన్న ఊహ కూడా అతడికి రాలేదు. అతడి గుర్రం హాజీమురాద్‌కు మరింత చేరువయింది.

వెనక నుండి గిట్టల చప్పుడు వినిపించి, తనను వాళ్లు సమీపించారని తెలుసుకున్నాడు హాజీమురాద్. కుడి చేతిలో పిస్టల్ పట్టుకుని ఎడమచేత్తో కళ్లెం లాగాడు.

"వేగం తగ్గించు" అంటూ అరిచాడు నజారొవ్. ఇంచుమించూ ఇద్దరూ పక్కపక్కనే పరిగెత్తుతున్నారు. హాజీమురాద్ గుర్రం కళ్లెం ఒకచేత్తో అందుకోవటానికి

జూన్ సంచిక మార్కెట్లో ఉంది!

ఇరుగుపొరుగు ఇళ్లలో ఉంటూ కలిసిమెలిసి పెరిగారు పూర్ణ, వేణూ! పూర్ణ వేణుని ఇష్టపడింది. కానీ ఆమె ప్రేమ ఫలించలేదు. చాలా ఏళ్ల తర్వాత పూర్ణ కొడుకు మురళిని చూసి వేణు ఉలిక్కిపడ్డాడు. ఎందుకు? **డి. కామేశ్వరి** తెలుగు కథ **మనసేశిక్ష** చదవండి

- జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత **ప్రతిభారాయ్ అంటరాని దైవం**
- ఆఫ్రికా సాహితీవేత్త **చినువా అచెబె తిరుగుబాటు**
- కథకుల ఫైల్‌లో **కేశవస్వామి పసిడి బొమ్మ**
- 35 ఏళ్ళ విపుల కథగా **పరుచూరి గోపాలకృష్ణ** ఎంపిక చేసిన **భార్య**
- **జ్ఞానధార**

ఇంకా ఎన్నో ప్రత్యేక శీర్షికలతో జూన్ 'విపుల' మీకోసం...

విపుల
విశ్వకథా వేదిక

ప్రయత్నించాడు నజారొవ్. అతడు చెయ్యి చాచాడో లేదో పిస్టల్ పేలింది.

"ఏం చేస్తున్నావ్!" అంటూ అరిచాడు నజారోవ్. గుండె పట్టుకుని మరుక్షణమే పట్టు తప్పి కింద పడిపోయాడు.

అదే సంకేతంగా సైనికుల మీద కాల్పులు జరిపారు హాజీమురాద్ మనుషులు. దగ్గరగా వచ్చినవాళ్ల మీద కత్తులు ఝళిపించారు.

పరిగెత్తుతున్న గుర్రంమెడను పట్టుకుని వేళ్లాడాడు నజారొవ్. గుర్రం కిందపడి ఇగ్నాటొవ్ కాలు విరిగింది. హాజీమురాద్ మనుషులు సైనికుల్ని విచక్షణారహితంగా గాయపరిచారు. పెట్రాకొవ్ తన కామ్రేడ్ లను రక్షించటానికి ప్రయత్నించాడుగాని, అప్పుడే వీపు, పక్కటెముకల్లోనూ రెండు తూటాలు దూసుకుపోయాయి. ఏం జరిగిందో తెలుసుకునేలోపే కూలిపోయాడు.

వెనుదిరిగి దుర్గం వైపు పరుగు తీశాడు మిష్కిన్. ఖనేఫీ, బాటా అతణ్ణి వెంబడించారు. కాని అప్పటికే అతడు వాళ్లు అందుకోలేనంత దూరం వెళ్లిపోయాడు.

నేలమీద వెల్లకిలా పడున్నాడు పెట్రాకొవ్. పొట్ట చీలింది. ఆకాశంవైపు చూస్తూ చివరి క్షణాల్లో, శ్వాసకోసం చేపలా కొట్టుకున్నాడు.

ఇగ్నాటొవ్‌ను సంహరించి, మరొక్క వేటుతో నజారొవ్‌ను కూడా నేలకూల్చాడు హాజీమురాద్. మరణించిన వాళ్ల నుండి తూటాలు సేకరించాడు బాటా. నజారొవ్ గుర్రం తీసుకోవాలనుకున్నాడు ఖనేఫీ, కాని హాజీమురాద్ అతణ్ణి వారించాడు. అందరూ పర్వతాలవైపు దౌడు తీశారు. వెంట వచ్చిన నజారొవ్ గుర్రాన్ని అతి కష్టం మీద వెనక్కి పంపించారు. కాస్త దూరంలో వరిచేలు వారికి స్వాగతం పలికాయి. నూఖా నుండి ఆరుమైళ్లు వచ్చారు.

హాజీమురాద్ తప్పించుకుని పారిపోయినట్టుగా నూఖాలో అలారం మోగింది.

★ ★ ★

"ఎందుకిలా జరిగింది? వాడెందుకిలా చేశాడు? " అంటూ తలపట్టుకున్నాడు కమాండర్.

మిష్కిన్ చెప్పిందంతా విని "వాణ్ణి పారిపోనిచ్చాం. దుర్మార్గులు, నమ్మకద్రోహులు" అంటూ తనను తాను తిట్టుకున్నాడు.

అలారం మోగటంతో కోసక్కులు మాత్రమేకాక, రష్యన్లకు అనుకూలంగా ఉన్న గ్రామాలనుండి సాయుధులందరూ హాజీమురాద్‌కోసం వేటలో పాల్గొన్నారు. అతణ్ణి 'అలైవ్ ఆర్ డెడ్' పట్టుకున్నవాళ్లకు వెయ్యి రూబుళ్లు బహుమతి ప్రకటించారు. అతడు పారిపోయాడని తెలిసిన రెండు గంటల్లో రెండు వందల మంది అశ్వికులు, ఒక ఆఫీసర్ నాయకత్వంలో ఎక్కడున్నా సరే, పట్టుకోవాలని వెదకటానికి బయల్దేరారు.

కొన్ని మైళ్ల తర్వాత గుర్రం రొప్పుతుండటం గమనించి ఆగాడు హాజీమురాద్. అలసటతో చెమట పట్టింది.

తూర్పున ఉన్నది బెనెల్డ్‌జిక్ గ్రామం. అక్కడి ఇళ్లూ, మినారులూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడమవైపున పొలాలు. వాటికి ఆవల నది. పర్వతాలను చేరుకోవాలంటే తూర్పుగా ప్రయాణించాలి. కాని తనను వెంబడిస్తున్నవాళ్లు ఎట్లాగూ అటే పోతారు గనక పడమటి వైపు మళ్లాడు హాజీమురాద్. అతడీ దిశగా పయనిస్తాడని ఎవరూ ఊహించే అవకాశమే లేదు. ఇలా వెళ్లినా నది దాటి, అరణ్యాలను దాటి పర్వతాలను చేరుకోవచ్చు.

కాని కొద్దిదూరం వెళ్లాడో లేదో, నది దాకా పోవటమే అసాధ్యమనిపించింది. బురద పట్టిన పొలాల్లో, గుర్రాలు అడుగు తీసి అడుగు వెయ్యలేకపోయాయి. గట్టి నేల ఎక్కడా కనిపించలేదు. ఎటు

చూసినా నీరూ, బురద మాత్రమే వ్యాపించిన పొలాలు. గుర్రాల కాళ్లు దిగబడి ఎంత ప్రయత్నించినా పైకి రాలేదు. అసలే అలిసిన గుర్రాలు ఇక కదలవేమోననిపించింది. చీకటి పడింది. ఈ పొలాలు దాటే దెప్పుడు? నదిని చేరేదెప్పుడు? మరింత ఎడమవైపు దుబ్బులు పెరిగిన నేల చూసి అటుగా కదలటానికి ప్రయత్నించారు. అతి ప్రయత్నం మీద ఒక్కొక్క అంగుళమే కదలాలి. ఆకలేసింది. కొందరు రొట్టెలూ, వెన్న తిన్నారు.

వెన్నెల వచ్చింది గాని చంద్రుడు కొండ వెనక్కు వెళ్లిపోవటంతో మళ్లీ చీకటి అలముకొంది. అడవిలో నైటింగేల్‌ల గుంపులు సంగీత కచేరీ ప్రారంభించాయి. పక్కనున్న పొదల్లో దాగిన మరో రెండు నైటింగేల్స్ విడిగా పాటందుకున్నాయి. హాజీమురాద్ మనుషులు కదిలినంత సేపూ అవి నిశ్శబ్దంగా ఉంటాయి. వాళ్లు విశ్రమిస్తే అవి గానం ప్రారంభిస్తాయి.

ప్రతి చిన్న శబ్దాన్ని వినగల హాజీము రాద్ పక్షుల గానాన్ని శ్రద్ధగా ఆలకించాడు. హంజద్ గాథ గుర్తుకువచ్చింది. 'తన జీవితమూ అలాగే ముగుస్తుందేమో' అనుకున్నాడు. త్వరగా ప్రార్థనలు ముగించాడు. సమీపిస్తున్న గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. ఒకటి కాదు, రెండు కాదు. అది అశ్విక సైన్యం.

కాస్త దూరంగా వెళ్లి మునివేళ్ల మీద నిలబడి చూశాడు బాటా. చీకట్లో కదులుతున్న నీడలు కనిపించాయి. కొందరు నడుస్తున్నారు. కొందరు గుర్రాల మీద వస్తున్నారు. మరోవైపు నుండి కూడా సైనికులు కదిలివస్తున్నట్టుగా గుర్తించాడు ఖనేఫీ. వాళ్లకు నాయకుడు కర్గానోవ్. ఆ ప్రాంత మిలిటరీ కమాండర్.

'హంజద్‌లాగే యుద్ధం చేస్తాం' అనుకున్నాడు హాజీమురాద్.

అలారం తర్వాత, తన సైన్యంతో, కోసక్కులతో కలసి హాజీమురాద్ వేటకు బయల్దేరాడు కర్గానోవ్. కాని అతడి జాడ దొరకలేదు. ఇక ఆశ వదులుకుని, తిరిగి ఇంటి ముఖం పట్టినప్పుడు ఒక వృద్ధుడు కనిపించి, తను ఆరుగురు అశ్వికులను వరి పొలాల్లో చూశానని చెప్పాడు. అలా కర్గానోవ్ మళ్లీ వేట ప్రారంభించాడు. సహాయంగా ఉంటాడని వృద్ధుణ్ణి కూడా వెంట రమ్మన్నాడు. గుర్రాలు కనిపించటంతో, హాజీమురాద్ బృందం కూడా అక్కడే ఎక్కడో ఉండక తప్పదని రూఢీ చేసుకు

న్నారు. చీకటిలో వాళ్లను చుట్టుముట్టి, తెల్లవారిందాకా నిరీక్షించారు- 'అలైవ్ ఆర్ డెడ్'గా పట్టుకోవటానికి.

తాము సైన్యం వలయంలో ఉన్నామని తెలుసుకున్నాడు హాజీమురాద్. ఇక చిన్న చిన్న చెట్లూ, దుబ్బులే తమకు రక్షణ. వీలైనంతసేపు వాళ్ల కంటపడకుండా నక్కి, బుల్లెట్లు ఉన్నంతసేపూ పోరాడాలి. ఇదే విషయం తన కామ్రేడ్స్‌కి స్పష్టం చేశాడు. సైన్యం కాస్త ఎత్తులో ఒకదిబ్బపై ఉన్నది. తాము గోతిలో ఉన్నారు. బాకులతో మట్టి తవ్వి ఒక అగడ్త నిర్మించుకున్నారు.

తూర్పున నెమ్మదిగా వెలుగొచ్చింది.

కమాండర్ అరిచాడు

"హాజీమురాద్, లొంగిపో. మాది సైన్యం, మీరు కొద్దిమంది"

జవాబుగా ఒక తుపాకీ పేలింది. గోతిలోంచి తెల్లటి పొగమబ్బు లేచింది. బులెట్ ఒక సైనికుడి గుర్రానికి తగిలింది. మరి కాసేపట్లో చతికిలబడింది గుర్రం. సైనికులు గోతిలోకి పేల్చారు తుపాకులు, కొమ్ములు, ఆకులు అల్లల్లాడాయిగాని, మనుషులు క్షేమంగానే ఉన్నారు. దారి తప్పిన గంజాలో గుర్రానికి తలలో తగిలింది బుల్లెట్. అది వెంటనే కింద పడలేదు. నెత్తురు కారగా అటూఇటూ పరుగెత్తి ఇతర గుర్రాలను హడలెత్తించింది. పచ్చ గడ్డి మీద ఎర్రటి నెత్తురు ప్రవహించింది. సైనికులు దగ్గరగా వచ్చినప్పుడు మాత్రమే కాల్చారు హాజీమురాద్ మనుషులు. ఎప్పుడూ గురి తప్పలేదు. ముగ్గురు సైనికులు గాయపడ్డారు. శత్రువును చుట్టుముట్టడానికి బదులు వెనక్కి తగ్గి కాల్పులు జరిపారు వాళ్లు.

గంటసేపలా గడిచింది. చెట్ల మీద సగం దాకా ఎండ పడింది. తన గుర్రం మీదికి ఎగిరి కూర్చుని నదివైపు దౌడు తీయగలనా? అని ఆలోచించాడు హాజీ ముదాద్. గుర్రాల, మనుషుల గోల పెరిగింది. అంటే అదనపు బలగాలు వచ్చాయన్నమాట. ఆ వచ్చిన వాళ్లలో మెక్‌తులికి చెందిన హాజిఆగా, అతని సైనికులు కూడా ఉన్నారు. వీరి సంఖ్య రెండువందలు. ఒకప్పుడు హాజీఆగా, హాజీమురాద్‌కు అత్యంత సన్నిహితుడు. ఒకర్నొకరు అన్నా అని పిలుచుకున్నారు. పర్వతాల్లో అన్యోన్యంగా కలిసి బతికారు. కాని తరువాత రోజుల్లో హాజీఆగా రష్యన్లవైపు వెళ్లాడు. అతడు అహ్మద్‌ఖాన్ (హాజీమురాద్ పాత శత్రువు) కుమారుడు.

కర్గానోవ్‌తోపాటు, హాజీఆగా కూడా హాజీమురాద్‌ను లొంగిపొమ్మన్నాడు. ఈసారి కూడా హాజీమురాద్ తుపాకీతోనే సమాధానం చెప్పాడు.

"ఖడ్గాలు తీయండి" అంటూ తన వాళ్లను ఆదేశించాడు హాజీఆగా. వంద మంది భీకరంగా అరుస్తూ దుబ్బల్ని ఎడాపెడా నరికారు.

తుపాకులు పేలాయి. ముగ్గురు సైనికులు నేలకొరిగారు. మిగతా వాళ్లు గుళ్ళ వర్షం కురిపిస్తూ గోతిని సమీపించారు. ఎవరికి గురిపెట్టాలో వాళ్లకు తెలియదు. కాని హాజీమురాద్ గురి తప్పలేదు. గంజాలో కూడా బులెట్లను వృథా చేయలేదు. ప్రతిసారీ ఎవరో ఒకర్ని గాయప

ర్చాడు. గోతి అడుగున కూర్చున్న ఖాన్ మహోమా 'ల్యాకా యిల్ అల్లాక్' అని పాడుతూ తీరిగ్గా కాల్చాడు. కాని అతడి గుళ్లు ఎవరికీ తగల్లేదు. బాకు చేతిలో పట్టుకుని క్షణక్షణం అసహనంగా నిరీక్షించాడు ఎల్డార్. ఖనేఫీ మాత్రం ఇక్కడా పనిమనిషిలాగే ప్రవర్తించాడు. తుపాకులు లోడ్ చేసి హాజీమురాద్‌కు, ఖాన్ మహోమాకు అందించటం అతడి డ్యూటీ. అదను చూసుకుని పరిగెత్తి తమ గుర్రాల్ని సురక్షిత ప్రాంతానికి పంపించాలని ప్రయత్నించాడు బాటా. పెద్దగా అరుస్తూ, సపోర్టు లేకుండానే తుపాకీ పేల్చాడు.

అందరికన్నా మొదట గాయపడింది అతడే. మెడలో తగిలింది బులెట్. నెత్తురు కక్కుతూ అందరికీ శాపనార్థాలు పెట్టాడు. బనియన్ చించి, గాయాన్ని నొక్కుకుంటూ కాల్పులు కొనసాగించాడు.

"ఖడ్గాలతో వాళ్లమీద దాడిచేద్దాం" అంటూ మూడోసారి అడిగాడు ఎల్డార్. సరిగ్గా అదే క్షణాన అతడికో బులెట్ తగిలింది. వెనక్కు వాలిపోతూ హాజీమురాద్ కాలిమీద పడిపోయాడు. అతడి అందమైన మేకపోతు కళ్లు హాజీ మురాద్‌ను చూశాయి. పసిపిల్లాడి పెదాల్లాంటి అతడి పెదాలు ఇక కదల్లేదు. కాలు లాక్కుని కాల్పులు కొనసాగించాడు హాజీమురాద్.

ఖనేఫీ వంగి ఎల్డార్ తుపాకీ, బులెట్స్

తీసుకున్నాడు.

పాట ఆపలేదు ఖాన్ మహోమా. మరొక్క అడుగేస్తే సైన్యంతో ముఖాముఖి యుద్ధమే.

హాజీమురాద్‌కు ఎడమ వైపున మరో బులెట్ తగిలింది. కిందికి ఒరిగి, బనియన్‌తో గాయాన్ని నొక్కుకున్నాడు. ఇది సీరియస్ గాయం. అతడి ప్రాణం పోతుందిక. తెర మీది చిత్రాల్లా గుర్తుకొచ్చింది గతం. చెక్కిలి చీరుకుపోయినా, చివరిదాకా యుద్ధం చేసిన అబు నట్సల్ ఖాన్, జిత్తులమారి వొరొంట్సోవ్. పాలిపోయినట్టుగా కనిపించే అతడి మొహం. యూసుఫ్ భార్య సోఫియట్. ఎర్రగడ్డంతో, సగం మూసుకున్న కళ్లతో షామిల్. బాధా లేదు. కోపమూ లేదు. ఏ కోరికా లేదు. ఇక ప్రారంభం కాబోయే కొత్త ప్రయాణంతో పోల్చితే ఏదీ ముఖ్యంకాదు. లోపల, ఇప్పటికే ప్రారంభమైంది ప్రస్థానం.

అయినా దృఢమైన అతని శరీరం తన పనిని కొనసాగించింది. ఉడిగిపోతున్న శక్తిని కూడదీసుకుని తనవైపు వస్తున్న వ్యక్తిని గురి తప్పకుండా కాల్చాడు. అతడు నేలకూలాడు. హాజీమురాద్ గోతిలోంచి లేచి బాకుతో శత్రువుపైన లంఘించాడు.

తుపాకులు పేలాయి. కింద పడిపోయాడు హాజీమురాద్. పడిపోయిన ఆ శరీరం చుట్టూ విజయనాదాలతో సైనికులు మూగారు. చలనం లేదనుకున్న శరీరం ఒక్కసారి కదిలింది. మొదట నెత్తురు కారుతున్న, అచ్ఛాదన లేని తల పైకి లేచింది. తరువాత చేతులు పక్కనున్న కొమ్మను పట్టుకున్నాయి. అదో భయానకమైన దృశ్యం. అతడి వైపు పరుగెత్తుకొచ్చినవాళ్లు కూడా ఆ దృశ్యం చూసి దూరంగా నిలుచుండిపోయారు. శరీరం చివరిసారిగా కంపించింది. పట్టుకున్న కొమ్మ జారింది. బోర్లా కింద పడింది శరీరం. ఎవరో విరిచి పారేసిన ముల్లులా కనిపించింది. అదింక కదలలేదు.

అతడిలో చలనం లేదు. కాని స్పందన ఉంది.

మొదట ఆ శరీరాన్ని సమీపించిన హాజీఆగా ఖడ్గంతో బలంగా ఒక దెబ్బ వేశాడు. ఎవరో సుత్తితో కొట్టినట్టనిపించింది హాజీమురాద్‌కు. ఎవరు కొడుతున్నారో, ఎందుకు కొడుతున్నారో అతనికర్థం కాలేదు. అదే అతని చివరి చైతన్య దశ. ఆ క్షణాన శరీరంతో సంబంధం కూడా తెగిపోయింది. స్పందనలేని ఆ శరీరాన్ని శత్రువులు తన్నారు. కత్తులతో పొడిచారు. కాని ఇప్పుడు అతనికా శరీరంతో ఎలాంటి సంబంధమూ లేదు.

శవం వీపు మీద కాలుపెట్టి రెండు దెబ్బల్లో తలను మొండెం నుంచి వేరుచేశాడు హాజీఆగా. బూట్ల మీద నెత్తురు చిల్లకుండా జాగ్రత్తపడ్డాడు. తలను కాలితో దూరంగా తన్నాడు. మెడ ధమనుల్లోంచి నెత్తురు ఉబికి వచ్చింది. తల నుండి కారిన నల్లటి నెత్తురు గడ్డిని తడిపింది.

చచ్చిన జంతువును మధ్యలో పెట్టుకుని ఆడే క్రీడాకారుల్లాగా కర్గానోవ్, హాజీ ఆగా, అహ్మద్‌ఖాన్‌లు హాజీమురాద్, అతని మురీద్‌ల (ఖనేఫీ, ఖాన్ మహోమా, గంజాలోలను కలిపి కట్టేశారు) చుట్టూ చేరి పొదల మీద ఎగిసిన తెల్లటి పొగలో గెలిచామని నాట్యం చేశారు.

యుద్ధం జరుగుతున్నంతసేపూ మౌనంగా ఉన్న నైటింగేల్‌లు తిరిగి పాట కచేరీ ప్రారంభించాయి. ఒకటి దగ్గరలో, మిగిలినవి కాస్త దూరంలో.

★ ★ ★

దున్నిన పొలంలో కనిపించిన ముల్లును చూస్తే నాకే మృత్యుదృశ్యమే గుర్తుకొచ్చింది. ©